




PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 40, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజిలు : 8, వెల రూ. 5, శనివారం - 12 - జూలై - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


### రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై

# ఫోకస్ పెట్టాం



**మన దేశానికి అతిపెద్ద ఆర్థిక వనరు జనాభానే అన్న చంద్రబాబు**
**అమెరికాలో ఫర్టిలిటీ రేటు 1.62 శాతమేనన్న సీఎం**
**జనాభా పెరుగుదలను తాను సమర్థిస్తున్నానని వ్యాఖ్య**

అమరావతి: మన దేశానికి అతి పెద్ద ఆర్థిక వనరు జనాభా అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో జనాభా పడిపోతోందని చెప్పారు. అతి ఎక్కువ జనాభా ఉన్న దేశం భారతదేశం అని అన్నారు. మన దేశ జనాభా 143 కోట్లు కాగా... చైనా జనాభా 130 కోట్లు అని చెప్పారు. అమెరికాలో ఫర్టిలిటీ రేటు 1.62 శాతం మాత్రమేనని.... 2.1 శాతం ఫర్టిలిటీ రేటు ఉంటేనే రీప్లేస్ మెంట్ ఉంటుందని... లేకపోతే రోజురోజుకూ జనాభా తగ్గిపోతుందని తెలిపారు. మన దేశంలో బీహార్ లో ఫర్టిలిటీ రేటు 3 శాతంగా మిగతా.. 2లో




## పీ 4 మార్గదర్శులతో త్వరలో సీఎం చంద్రబాబు భేటీ

- పీ4 - జీరో పావర్టీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన సీఎం
- మార్గదర్శులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్న సీఎం
- పేదల కోసం పెద్దలను ఆశ్రయిద్దామన్న సీఎం

## త్వరలో 22,033 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు..

# జాబ్ కేలండర్ రెడీ

- ★ మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాల భర్తీ
- ★ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కోటా
- ★ పంచాయతీరాజ్ చట్ట సవరణకు త్వరలో ఆర్డినెన్స్
- ★ సీఎం అధ్యక్షతన జరిగిన భేటీలో కేబినెట్ కీలక నిర్ణయాలు
- ★ వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం, వాకిటి
- ★ అమిటీ, సెయింట్ మేరీస్ విద్యా సంస్థలకు వర్సిటీ హోదా
- ★ పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సత్వరమే పూర్తి
- ★ మత్స్యశాఖ బడ్జెట్ రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంపు




హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పంచాయతీరాజ్ చట్టం - 2018 సవరణకు త్వరలో ఆర్డినెన్స్ తీసుకురావాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విలేకరులకు వివరాలు వెల్లడించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీతో పాటు కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం రాష్ట్రంలో కుల గణన నిర్వహించడాన్ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు మిగతా.. 2లో




## ఐడీ కార్డులు అడిగి మరీ చంపారు!

### పాకిస్థాన్ లో రెబెల్స్ దాడి...




బలూచిస్తాన్ ప్రావిన్స్ లో ఘటన బలూచ్ కు చెందని వారిని లక్ష్యంగా చేసుకున్న మిలిటెంట్లు 9 మందిని కాల్చి చంపిన వైనం దాడికి బాధ్యత తమదేనన్న బలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్


## రోహిత్ వేముల మరణానికి కారణమైన రామచందర్ రావుకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఎలా ఇస్తారు?




- రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తమ ప్రభుత్వం విచారణ జరుపుతోందన్న భట్టి
- త్వరలోనే రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తామని వెల్లడి
- రోహిత్ కుటుంబాన్ని కేసీఆర్ పరామర్శించలేదని విమర్శ

### ఈనెల 14న తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి

## చేతులమీదుగా రేషన్‌కార్డుల పంపిణీ




### మహిళా అధికారులను 'సర్' అని సంబోధించాలన్న

## ఆదేశాలను రద్దు చేసిన బంగ్లాదేశ్ ప్రభుత్వం




తనతోపాటు మహిళా అధికారులను 'సర్' అని సంబోధించాలని హసీనా ప్రభుత్వం ఉత్తర్వులు
ఆ ఆదేశాలను రద్దు చేసిన బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం
ఎలా పిలవాలన్న దానిపై ప్రత్యేక కమిటీని నియమించిన వైనం

## పాకిస్థాన్ దాడిలో భారత్‌కు నష్టం కలిగిందన్న విదేశీ మీడియా ప్రచారంపై స్పందించిన అజిత్ దోవల్

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు నష్టం జరిగిందని విదేశీ మీడియా ప్రచారం




ఒక్క ఆధారం చూపించాలని అజిత్ దోవల్ సవాల్
మన సైన్యం, బ్రహ్మోస్ ఉగ్రస్థావరాలను మట్టుబెట్టాయన్న దోవల్

## బీసీ రిజర్వేషన్లపై మంత్రి చెప్పారు కానీ, కొన్ని అనుమానాలు ఉన్నాయి: కవిత




- ఆర్డినెన్స్ తీసుకు వస్తామని చెప్పినందున రైల్ రోకోను వాయిదా వేస్తున్నట్లు కవిత వెల్లడి
- ఆర్డినెన్స్ తేవాలనుకుంటే 18 నెలలు ఎందుకు ఆగారని ప్రభుత్వానికి నిలదీత
- వారం రోజుల పాటు ప్రభుత్వం కార్యాచరణను గమనిస్తామన్న కవిత




సున్నిపెంట సర్కిల్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 1,75,233 క్యూసెక్కులు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్ ఫ్లో 1,70,347 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు నుంచి 20,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 32,237 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మూడు స్పిల్‌వే గేట్లు ఎత్తి 81,195 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.80 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 203.42 టీఎంసీలకు చేరింది.

## టీటీడీలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలి

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బండి సంజయ్
టీటీడీలో వెయ్యి మందికి పైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్న
వారిని ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్



హైదరాబాద్: టీటీడీలో అన్యమతాలకు చెందిన ఉద్యోగులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వెయ్యి మందికి పైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆ ఆనవాయతీని ఎందుకు కొనసాగిస్తున్నారని అన్నారు. అన్యమతస్తులను వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా మిగతా.. 2లో

## వ్యాపారాలకేమో

# హిందీ కావాలి...

## మరి హిందీ నేర్చుకోవడానికి ఇబ్బంది ఏంటి...?

హైదరాబాదులో రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకలు
హాజరైన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
హిందీ దేశ భాష అని వెల్లడి
హిందీ నేర్చుకుంటే మరింత బలపడతామని స్పష్టీకరణ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాష యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఐటీ రంగంలో విజయం సాధించడానికి ఆంగ్లం ఎంత ముఖ్యమో, దేశంలో ఎక్కువ మంది మాట్లాడే హిందీని నేర్చుకోవడం వల్ల కూడా అంతే ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దక్షిణ భారతీయ సినిమాలలో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం మిగతా.. 2లో

## హైకోర్టులో సిద్ధరామయ్యకు ఊరట




కాంగ్రెస్ నేతలపై బీజేపీ పరువునష్టం దావా
'అవినీతి రేటు కార్డు' ప్రకటనపై బీజేపీ దావా
కేసును తాత్కాలికంగా నిలిపివేసిన హైకోర్టు

## నీట మునిగిన పలు గ్రామాలు

### మహారాష్ట్ర, తెలంగాణలో వర్షాలు

గోదావరికి పోటెత్తుతున్న వరద నీరు



PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# వ్యాపారాలకేమో హిందీ కావాలి...

మొదటి పేజి తరువాయి



దక్షిణ భారతీయ సినిమాలలో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం వస్తుందని గుర్తు చేశారు. వ్యాపారానికి హిందీ అవసరమైనప్పుడు, నేర్చుకోవడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. తన సినిమాలో "ఏ మేరా జహా" అనే హిందీ పాట పెట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ, మాతృభాష తెలుగు అయినప్పటికీ, హిందీ దేశ భాష అని చెప్పడానికే అలా చేశానని తెలిపారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోవడం కాదని, మరింత బలపడటమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మరో భాషను అంగీకరించడం ఓటమి కాదని, కలిసి ప్రయాణించడమని ఆయన ఉద్ఘాటించారు. విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి వంటి రంగాలలో భాషా అవధులు చెరిగిపోతున్న ఈ సమయంలో హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి మాతృభాషల పట్ల గౌరవం ఉండాలని చెబుతూనే, హిందీని పెద్దమ్మ భాషగా అభివర్ణించారు. ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృభాష ఉండగా, దేశ సరిహద్దులు దాటితే హిందీ రాజ్య భాషగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం విడిపోవడానికి కారణాలు వెతుకుతుంటే, భారతదేశం మాత్రం ఒకే భాషతో ఏకం కావాలని చూస్తోందని, అది హిందీతో సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఒక బెంగాలీ గీతం జాతీయ గీతమైందని, ఒక పంజాబీ దేశం కోసం పోరాడారని, రాజస్థాన్‌కు చెందిన రాణప్రతాప్ శౌర్యానికి చిహ్నంగా నిలిచారని, తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ అయ్యారని, మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన వ్యక్తి రూపొందించిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి భాషా జీవ భాష, మాతృ భాష అయినప్పటికీ, రాజ్య భాష మాత్రం హిందీయేనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# త్వరలో 22,033 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు..జాబ్ కేలండర్ రెడీ



రాష్ట్రంలో కుల గణన నిర్వహించడాన్ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించిన విషయం గుర్తు చేశారు. సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఇతర మంత్రులు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ పలువురు కేంద్రమంత్రులు, సంబంధిత అధికారులతో దీనిపై అనేకసార్లు చర్చించినా కొర్రీలు వేస్తూ కాలయాపన చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ భేటీకి అడ్వొకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి ఆయన సలహాలు తీసుకుని, న్యాయపరమైన చిక్కులు రాకుండా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎన్నికలకు ఇబ్బందులు ఎదురవకుండా రాజకీయ పార్టీలు కూడా చిత్తశుద్ధితో సహకరించాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి ఇప్పటికే రాష్ట్రంలో 62 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, రిజర్వేషన్లపై 50 శాతం క్యాప్ నిబంధన దేశంలో ఎప్పుడో పోయిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దీనికి ముందు వరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో 327 అంశాలపై చర్చించి 321 అంశాలపై నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. తాజాగా జరిగిన 19వ సమావేశంలో ఆ నిర్ణయాల అమలులో పురోగతిపై విస్తృతంగా చర్చించామని, 96 శాతం అంశాలకు సంబంధించి జీవోలు జారీ చేసి అమలు దశకు తీసుకెళ్లినట్టు తేలిందని చెప్పారు. కాగా ప్రతి రెండు వారాలకు ఒకసారి కేబినెట్ సమావేశం నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన మేరకు మళ్లీ ఈ నెల 25న మంత్రివర్గ భేటీ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి 3 నెలలకోసారి ఆ కాల వ్యవధిలో జరిగే ఆరు కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించాలని కూడా నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు చేరవేసే వ్యవస్థ పనితీరును మళ్లీ కేబినెట్‌లోనే ఇలా సమీక్షించడం దేశంలోనే తొలిసారి అని అన్నారు. రాష్ట్రంలోని అమిటీ, సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ విద్యా సంస్థలకు వర్సిటీలుగా గుర్తింపు కల్పించాలని కేబినెట్ నిర్ణయించినట్టు పొంగులేటి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 15 ఉత్తమ వర్సిటీల్లో అమిటీ 11/12వ స్థానంలో ఉందన్నారు. సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ సైతం అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వనుందని చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్ చొరవతో ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించడానికి ఆ సంస్థల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, వీటితో పాటు మరో 17,084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని పొన్నం చెప్పారు. ఇక కొత్తగా 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు జాబ్ కేలెండర్ సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. వచ్చే మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించామన్నారు. ఎస్సీల వర్గీకరణ సమస్యతో నోటిఫికేషన్ల జారీలో కొంత జాప్యం జరిగిందని ఆయన వివరించారు. రాష్ట్రంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన మిగులు భూసేకరణను సత్వరం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. అనంతరం ఆ ప్రాజెక్టుల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్టు పొంగులేటి వెల్లడించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జెడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జెడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా పరిగణించి బీసీ రిజర్వేషన్లు కల్పిస్తారు. సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ కమిటీ వచ్చే కేబినెట్ సమావేశంలోపు తమ నివేదికను అందించాలని గడువు నిర్ణయించింది. సీఎం ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు. రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. కగా హైదరాబాద్‌లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకార సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చెరువులు, కుంటల్లో 80%-%110 మి.మీ. సైజు గల 82 కోట్ల చేప పిల్లలను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన బడ్జెట్‌ను రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని కమిటీని ఆదేశించింది.

### పీ 4 మార్గదర్శులతో త్వరలో

# సీఎం చంద్రబాబు భేటీ

అమరావతి: పీ4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కీలక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో మార్గదర్శకులతో సమావేశం కానున్నారు. పీ4 - జీరో పావర్టీ కార్యక్రమంపై నిన్న తన క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పీ4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమంలో మార్గదర్శకులుగా ఉండేందుకు 18,332 మంది ముందుకు వచ్చారు. వీరిలో పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, ఉన్నత వర్గాల వారు ఉన్నారు. వీరి ద్వారా 1,84,134 బంగారు కుటుంబాలకు చేయూత లభిస్తోంది. ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడంతో పాటు మార్గదర్శిగా ఉండేవారిని ప్రోత్సహించేందుకు పలు చర్యలు చేపట్టాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. మార్గదర్శులుగా ఉండేవారిని ప్రోత్సహించడానికి స్వయంగా వారితో చంద్రబాబు సమావేశం కానున్నారు. మార్గదర్శులుగా ఉండే 200 మంది టాప్ ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు, భారీ నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఎంఎన్సీ కంపెనీల ప్రతినిధులు, సెలబ్రిటీలతో సీఎం సమావేశం కానున్నారు. ఈ నెల 18వ తేదీన అమరావతిలో వీరిని విందుకు ఆహ్వానించాలనే అంశంపై ఈ సమీక్షలో చర్చ జరిగింది. పీ4 లక్ష్యాలను వివరించి మరింత మందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. సమాజంలో పేదలకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్న అనేక వర్గాల వారిని ఒక తాటిపైకి తెచ్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని సీఎం భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఈనెల 14న తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి

# చేతులమీదుగా రేషన్‌కార్డుల పంపిణీ




హైదరాబాద్: తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల జారీకి ముహూర్తం ఖరారైంది. ఈనెల 14న తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.4లక్షల కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు. దీని ద్వారా 11.30లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రంలో గత ఆరు నెలల్లో 41 లక్షల మందికి ప్రభుత్వం కొత్తగా రేషన్ పంపిణీ చేసింది. త్వరలో పంపిణీ చేయనున్న వాటితో కలిపి రేషన్‌కార్డుల సంఖ్య 94,72,422కి చేరనుంది. మొత్తంగా 3.14కోట్ల మందికి లబ్ధి చేకూరనుంది

# టీటీడీలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలి

మొదటి పేజి తరువాయి



తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తిరుమల వచ్చారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ లో ఇప్పటికే భూమిపూజ చేసిన స్థలంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వెంటనే నిర్మించాలని బండి సంజయ్ కోరారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. సనాతనధర్మ పరిరక్షణ కోసం అందరూ కలసికట్టుగా ఉండాలని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ధూపదీప నైవేద్యాలకు నోచుకోలేని పురాతన ఆలయాలను గుర్తించి, టీటీడీ నిధులను కేటాయించి వాటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నానని అన్నారు. కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట రామాలయం ఆలయాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఇతర మతస్తులు టీటీడీలో పనిచేస్తున్నందునే ఆచార వ్యవహారాల్లో తేడా వస్తోందని సంజయ్ అన్నారు. స్వామిపై నమ్మకంలేని వ్యక్తులకు జీతాలిచ్చి ఎందుకు పోషిస్తున్నారని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు సరికాదని అన్నారు. బొట్టు పెట్టుకుని వెళితే మసీదులు, చర్చిల్లో ఉద్యోగాలు ఇస్తారా అని ప్రశ్నించారు.

### రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై

# ఫోకస్ పెట్టాం

మొదటి పేజి తరువాయి


మన దేశంలో బీహార్ లో ఫర్టిలిటీ రేటు 3 శాతంగా ఉందని, ఏపీలో 1.7 శాతానికి చేరుకుందని చెప్పారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారని... ఇప్పుడు ఎక్కువ జనాభా ఉన్న దేశాలకు గౌరవం దక్కుతోందని చంద్రబాబు అన్నారు. గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే... స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు లేదనే చట్టాన్ని తాను తీసుకొచ్చానని... ఇప్పుడు జనాభా పెరుగుదలను తానే సమర్థిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై దృష్టి సారించామని తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవ సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## పవర్ షేరింగ్ ఏమీ లేదు: మల్లు భట్టి విక్రమార్క



ఢిల్లీ : బీఆర్ఎస్ నేతల మాటలు మితిమీరిపోయాయని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, అదే సమయంలో జనాల్లోకి కూడా వెళ్లడం లేదని భట్టి విక్రమార్క తెలిపారు. ఈరోజ(శక్రవారం, జూలై 11వ తేదీ) ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్న మల్లు.. తమ ప్రభుత్వంలో అంతా కలిసికట్టగా పనిచేస్తున్నారని, ఇక్కడ పవర్ షేరింగ్ అంటూ ఏమీ లేదని మల్లు తెలిపారు. అందరం కలిసి టీమ్ వర్క్‌గా పనిచేస్తున్నామన్నారు. 'రెండు లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది విధాన నిర్ణయం. రేషన్ కార్డు ఆధారంగానే కుటుంబంలో రుణ మాఫీ. సన్నం బియ్యం సక్సెస్ అయ్యింది. మహిళలకు ఉచిత బస్సుకు మంచి స్పందన ఉంది. ఫోర్త్ సిటీ పనులు జరుగుతున్నాయి. మూసి సుందరీకరణ ఈ ప్రభుత్వం హయంలో పూర్తి అవుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తుంది. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేది లేదు. సిగాచి ప్రమాదం పై విచారణ కు ఆదేశించాము. ఇటీవల జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో ఖర్గే,కేసి వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల పూర్తి సంతృప్తితో ఉంది' అని మల్లు తెలిపారు.

## మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది



అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0' కార్యక్రమం విజయవంతం అయిందని చెబుతూ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. సమాజం స్వచ్ఛందంగా అందించిన మద్దతు విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంచడం, విద్యార్థుల ప్రగతిని సమీక్షించడం, పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 'మెగా పీటీఎం 2.0' ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపునకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించడం జరిగిందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించి, వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని నారా లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా, వారి భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్రను మరింత క్రియాశీలం చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# ఐడీ కార్డులు అడిగి మరీ చంపారు!

### పాకిస్థాన్ లో రెబెల్స్ దాడి...

ఢిల్లీ: పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో గురువారం రాత్రి ప్రయాణికుల బస్సులపై తిరుగుబాటుదారులు దాడి చేసి 9 మందిని కాల్చి చంపారు. పంజాబ్ ప్రాంతానికి చెందిన వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసిన తర్వాత బాధితులను లక్ష్యంగా చేసుకున్నారని సమాచారం. డాన్ వార్తాపత్రిక కథనం ప్రకారం, క్వెట్టా నుండి పంజాబ్‌కు వెళుతున్న రెండు బస్సులను లోరలై-జోబ్ హైవేపై సుర్-డకై సమీపంలో అడ్డగించారు. సాయుధులు రోడ్డును బ్లాక్ చేసి, వాహనాల్లోకి ఎక్కి ప్రయాణికుల జాతీయ గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. పంజాబ్‌కు చెందిన వారిగా గుర్తించిన వారిని తుపాకీతో బెదిరించి కిందకు దించి, ఆ తర్వాత చంపేశారు. స్థానిక అధికారి నవీద్ ఆలం ఏఎఫ్ పీ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "ఉగ్రవాదులు రెండు ప్రయాణికుల బస్సులను హైవేపై ఆపి, తొమ్మిది మంది ప్రయాణికులను కిందికి దించారు. వారిని సమీప ప్రాంతానికి తీసుకెళ్లి అందరినీ చంపేశారు" అని తెలిపారు. జిల్లా అడ్మినిస్ట్రేటర్ సాదత్ హుస్సేన్ మృతదేహాలను రోడ్డు పక్కన గుర్తించినట్లు ధృవీకరించారు. "మృతదేహాలన్నీ పంజాబ్‌లోని వేర్వేరు ప్రాంతాలకు చెందినవారని బలగాలు గుర్తించాయి" అని ఆయన మీడియాకు చెప్పారు. "ఉగ్రవాదులు ప్రయాణికుల గుర్తింపు పత్రాలను కూడా తీసుకెళ్లి ఉంటారు" అని నవీద్ ఆలం డాన్‌తో అన్నారు. కాగా, బలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ ఈ దాడికి బాధ్యత వహించింది. ఈ సంస్థ పాకిస్తాన్ ప్రభుత్వంపై చాలా కాలంగా తిరుగుబాటు చేస్తోంది. బలూచ్ కు చెందని పౌరులు మరియు సైనిక సిబ్బందిని లక్ష్యంగా చేసుకుంటోంది. ఇస్లామాబాద్ నుంచి స్వాతంత్ర్యం కోసం బలూచ్ తిరుగుబాటు ఇటీవల సంవత్సరాలలో తీవ్రమైంది. అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఈ హత్యలను ఖండించారు. దేశాన్ని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్న నిషేధిత బలూచిస్తాన్ ఉగ్రవాదులే దీనికి కారణమని ఆయన ఆరోపించారు. గత సంవత్సరం జరిగిన ఇలాంటి దాడిలో 23 మంది ప్రయాణికులు మరణించారు.

### మహిళా అధికారులను 'సర్' అని సంబోధించాలన్న

## ఆదేశాలను రద్దు చేసిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా సహా ప్రభుత్వంలోని మహిళా ఉద్యోగులను 'సర్' అని సంబోధించాలన్న ఆదేశాలను మధ్యంతర ప్రభుత్వం రద్దుచేసింది. నిన్న జరిగిన అడ్వైజరీ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తనను 'సర్' అని సంబోధించాలని హసీనా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఆ తర్వాత మహిళా అధికారులను కూడా అలాగే సంబోధించాలంటూ ఆదేశించారు. హసీనా 16 ఏళ్ల పాలనలో ఇలాగే పిలిపించుకున్నారు. ఇప్పటికీ అక్కడ మహిళా అధికారులను 'సర్' అనే సంబోధిస్తున్నారు. ఇలా పిలవడం సామాజికంగా, సంస్థాగతంగా అనుచితమైనదని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆ ఆదేశాలను వెనక్కి తీసుకుంటున్నట్టు చీఫ్ అడ్వైజర్ కార్యాలయం ప్రకటించింది. అంతేకాదు, భవిష్యత్తులో అధికారులను ఎలా సంబోధించాలన్న దానిపై రివ్యూ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపింది. ఎనర్జీ, రోడ్లు, రైల్వేలు, పర్యావరణం, నీటి వనరులపై సలహాలు ఇచ్చే సైదా రిజ్వానా హసన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీ నెల రోజుల్లో నివేదికను అందించాలని ఆదేశించింది. కాగా, సలహా మండలి సమావేశంలో 'సర్' అని పిలవాలనే నియమాన్ని రద్దు చేయడంతోపాటు ఇతర సంక్లిష్టమైన ప్రొటోకాల్ నియమాలను కూడా సమీక్షించాల్సిన అవసరాన్ని చర్చించారు. కొత్తగా ఏర్పడిన కమిటీ వాటిని కూడా పరిశీలించి తగిన మార్పులను సూచిస్తుంది.

### పాకిస్థాన్ దాడిలో భారత్‌కు నష్టం కలిగిందన్న విదేశీ

## మీడియా ప్రచారంపై స్పందించిన అజిత్ దోవల్

ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ దాడిలో భారత్‌కు నష్టం వాటిల్లిందంటూ విదేశీ మీడియా చేస్తున్న ప్రచారంపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్ దాడుల్లో భారత్‌కు నష్టం జరిగిందని ఒక్క ఆధారం చూపించాలని ఆయన సవాల్ విసిరారు. చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించినట్లు చెప్పారు. మన సైన్యం పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టిందని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో విదేశీ మీడియా చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు నష్టం వాటిల్లిందని చేస్తున్న ప్రచారం సరికాదని అన్నారు. అదే సమయంలో పాకిస్థాన్, పీవోకేలలో ఉగ్రవాద స్థావరాలను గుర్తించి మన సైన్యం కచ్చితత్వంతో దాడులు నిర్వహించిందని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి ఫొటోలు కూడా బయటకు వచ్చాయని తెలిపారు. భారత్‌కు నష్టం జరిగినట్లు ఒక్క ఫొటో కూడా బయటకు రాలేదని, నిజంగానే నష్టం జరిగిందని భావిస్తే ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఆయుధ సంపత్తిని దేశీయంగా రూపొందిస్తోందని అజిత్ దోవల్ తెలిపారు. మన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌లోని పలు వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాయని అన్నారు. ఢిల్లీ లక్ష్యంగా పాకిస్థాన్ ప్రయోగించిన ఫతాహ్11 బాలిస్టిక్ క్షిపణులను భారత్ బలగాలు మధ్యలోనే సమర్థవంతంగా పేల్చివేశాయని తెలిపారు.

### బీసీ రిజర్వేషన్లపై మంత్రి చెప్పారు కానీ,

## కొన్ని అనుమానాలు ఉన్నాయి: కవిత

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పడం సంతోషకరమని, అయితే తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అందుకే ఈ నెల 17న తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆర్డినెన్స్ జారీ చేసిన వెంటనే రిజర్వేషన్లను అమలు చేయగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు ఎందుకు వేచి చూసిందని కవిత ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని తాము భావిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తోందని ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయని కవిత అన్నారు. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, కాబట్టి తలుచుకుంటే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వవచ్చని అన్నారు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తప్పులన్నీ కాంగ్రెస్ పైకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమోనని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆమె అన్నారు. బీసీ బిల్లును షెడ్యూల్ -9లో పెట్టాలని, దీని కోసం బీసీ బిడ్డ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని కవిత విజ్ఞప్తి చేశారు. ఆర్డినెన్స్ తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినందున, ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనించి, అందుకు అనుగుణంగా తాము నిర్ణయం తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

### రోహిత్ వేముల మరణానికి కారణమైన

### రామచందర్ రావుకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఎలా ఇస్తారు?

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన రామచందర్ రావును రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారని ఆయన ప్రశ్నించారు. రోహిత్ మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోకుండా... పదవులు ఇస్తున్న బీజేపీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తమ ప్రభుత్వం విచారణ జరుపుతోందని భట్టివిక్రమార్క తెలిపారు. న్యాయశాఖ దీనిపై పని చేస్తోందని చెప్పారు. త్వరలోనే తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తామని వెల్లడించారు. రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన బండారు దత్తాత్రేయకు గవర్నర్ పదవి, రామచందర్ రావుకు రాష్ట్ర అధ్యక్ష పదవి, ఏబీవీపీ నాయకుడు సుశీల్ కుమార్ కు ఢిల్లీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవి ఇచ్చారని మండిపడ్డారు. దేశంలోని దళితులు, ఆదివాసీలకు గౌరవం లేకుండా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారికి బీజేపీ పదవులు ఇస్తుందని దుయ్యబట్టారు. వందల ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయని... బీజేపీ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరమని చెప్పారు. ప్రతి పౌరుడి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై కూడా భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. రోహిత్ వేముల చనిపోతే ఆయన కుటుంబాన్ని కేసీఆర్ కనీసం పరామర్శించలేదని విమర్శించారు. యూనివర్సిటీల సంక్షేమాన్ని ఏ రోజూ పట్టించుకోలేదని మండిపడ్డారు.

# హైకోర్టులో సిద్ధరామయ్యకు ఊరట

కర్ణాటక: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసును హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. 2023 ఎన్నికల సమయంలో... 'అవినీతి రేటు కార్డు' ప్రకటనపై బీజేపీ పరువునష్టం కేసు దాఖలు చేసింది. ఇందులో సిద్ధరామయ్య, రాహుల్ గాంధీ, డీకే శివకుమార్ పేర్లను చేర్చింది. బీజేపీ లంచం తీసుకున్నట్టు 2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వంలో పదవులు, కాంట్రాక్టులకు లంచాల రేట్లను నిర్ణయించిందని ఆరోపించింది. ఈ ప్రకటన ద్వారా తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశారంటూ బీజేపీ పరువునష్టం దావా వేసింది. ఈ కేసును ధర్మాసనం తాత్కాలికంగా నిలిపివేయడంతో కాంగ్రెస్ నేతలకు భారీ ఊరట లభించింది.

### ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం...

# నీట మునిగిన పలు గ్రామాలు

## మహారాష్ట్ర, తెలంగాణలో వర్షాలు

ధవళేశ్వరం: మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరద తాకిడి పెరగడంతో అధికారులు బ్యారేజీ మొత్తం 175 గేట్లను ఎత్తేశారు. దీంతో 2,00,600 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళుతోంది. వరద కారణంగా పలు లంక గ్రామాలు నీట మునిగాయి. కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల్లో నీరు చేరుతోంది. నాలుగు గ్రామాలకు బయటి ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. అత్యవసరమైన వారు పడవలపై ప్రయాణం చేస్తున్నారు.

## ఖమ్మంలో తెలంగాణ యోగ సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభలు



ప్రభాత సూర్యుడు - ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి : ఈనెల 13న ఖమ్మం కవిత మెమోరియల్ కాలేజీలో జరగనున్న తెలంగాణ యోగా సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మరికంటి వెంకట్ కోరారు. శుక్రవారం ఏర్పాటుచేసిన యోగా సాధకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి 200మంది యోగ ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు . ఈ మహాసభలో యోగ విద్యను పాఠ్యాంశంగా కేజీ నుండి పీజీ వరకు పెట్టాలని ఆయన కోరారు. యోగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు మహాసభలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామని తెలిపారు యోగ శిక్షకులు సాధకులు యోగా ఉత్సాహికుల ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ బి వెంకట్ గురుదక్షిణ ఫౌండేషన్ శిక్షకులు పంజాల ఐలయ్య ఏ .దామోదర్ సిహెచ్. కల్పన కే. జ్యోతి ఎం.సృజన తదితరులు పాల్గొన్నారు

## ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సస్పెండ్ చేసారు. తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామం, కందుకూరు మండలం కొత్తగూడ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న డి. అనిత, ఆర్ఉ. మాదేవిలు విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహించారనే కారణంతో విధులనుండి సస్పెండ్ కు గురయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారి అయినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## బీసీ రిజర్వేషన్ పెంచినందుకు కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం



తాడ్వాయి ప్రభాత సూర్యుడు : రాష్ట్ర కాబినెట్ బీసీ రిజర్వేషన్ 42% పెంచినందుకు సీఎం రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క చిత్ర పటాలకు తాడ్వాయి మండలం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు దేవేందర్, ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వరావు, గౌరవ అధ్యక్షులు అనంతరెడ్డి సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్, బీసీ సెల్ అధ్యక్షులు మల్లయ్య, కిసాన్ సెల్ అధ్యక్షులు రవి ఎస్టీ సెల్ అధ్యక్షులు ప్రశాంత్ మాజీ ఎంపీటీసీ రాజు తదితరులు పాల్గొన్నారు

## మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర మంత్రివర్యులు దనసరి అనసూయ సీతక్క గారు...



ఏటూరు నాగారం ప్రభాత సూర్యుడు : ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఎండీ వలియాబి, వలి బాబా గారి తండ్రి జమాల్ ఖాన్ గారు రెండు రోజుల క్రితం మృతి చెందగా తేది ఈ రోజున మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులు అర్పించిన రాష్ట్ర మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క గారు... ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ మల్లాడి రాంరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి,ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, బ్లాక్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న,మండల అధ్యక్షులు చిటమట రఘు, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోడు చేస్తున్న ట్రాక్టర్ సీజ్

మంగపేట ప్రభాత సూర్యుడు : ఆటవి హక్కుల పత్రంలో ఉన్న భూమి కంటే ఎక్కువ సాగు చేసుకోవాలని ఉద్దేశంతో అడివినర్ కి పోటీ చేస్తున్న క్రమంలో పక్క సమాచారం మేరకు కబ్బాక బాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి డాక్టర్ను చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి అశోక్ తెలిపారు మండలంలో బుచ్చంపేట కంపార్ట్మెంట్ ఫోర్ ఏ బీట్ పరిధిలో అబ్బ ఒక బావకు మూడు ఎకరాల భూమికి ఆటవికుల పత్రం ఉందని ఈ క్రమంలో సాగు విస్తీర్ణం పెంచుకుందామని సాగు చేసేందుకు పక్కన ఉన్న ఫారెస్ట్ నరికి పోసేస్తున్నట్లు సమాచారం కావడంతో తనిఖీ చేయరా పోస్ట్ చేసిన ట్రాక్టరు ను స్వాధీనం బాబుపై కేసు నమోదు చేసినట్టు ఫారెస్ట్ రేంజ్ అధికారి అశోక్ తెలిపారు

## తెలంగాణ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

### .. బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచినందుకు

### హర్షం వ్యక్తం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. రఘు



ఏటూరు నాగారం ప్రభాత సూర్యుడు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికల వైపు అడుగుపెట్టడం ఒక విప్లవాత్మక నిర్ణయం రఘు అన్నారు. ఈ రోజు జరిగిన క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు అవసరమైన ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు గర్వంగా ఉంది. 2018 చట్టాన్ని సవరించి బీసీలకు న్యాయం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం . ఏఐసీసీ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ గారు భారత్ జోడో యాత్రలో చేసిన "జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి" అన్న డిమాండ్‌ను దేశంలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని అమలు పరచేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారు,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రీ వర్యులు దనసరి అనసూయ సీతక్క గారు, బీసీ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గారు అలాగే మంత్రివర్గ వర్గ సభ్యులందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు.తెలంగాణ సమాజం, ముఖ్యంగా బీసీ సామాజిక వర్గం, సామజిక న్యాయం కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని అన్నారు

## మహిళలకు ప్రభుత్వం అందించే వడ్డీ లేని రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



చిలుకూరు (ప్రభాత సూర్యుడు) : మండలంలోని బేతవోలు గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా కళాజాత బృందాలతో మహిళలకకు ప్రభుత్వం అందించే రుణాల మహిళా సంఘాలకు క్యాంటీన్ల గురించి, మహిళలు సంఘంలో చేరడం వలన పొందే లాభాల గురించి, ఇన్సూరెన్స్ ద్వారా లోన్ బీమా, ప్రమాద బీమా సౌకర్యాలను, మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్ల గురించి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం వంటి ఇతర అన్ని పథకాలపై అవేర్నెస్ కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ ,మాజీ ఉపసర్పంచ్ ,వార్డ్ మెంబర్లు, కార్యకర్తలు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అవకాశవాది..

### మనం ఓడిపోయినా, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తీసుకొచ్చినా, అరెస్టులు చేసినా ఎవరూ భయపడం..

### వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి...

### వైసీపీ అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం..

### చంద్రబాబు మేనిఫెస్టో'పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం..



అనంతపురం జూలై 11, చంద్రబాబు అవకాశవాది అనీ, అధికారం కోసం ఏమైనా చేస్తాడు అని, మనం ఓడిపోయినా, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తీసుకొచ్చినా, అరెస్టులు చేసినా ఎవరూ భయపడకుండా ప్రజల పక్షాన నిలబడదాం అని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అనంత ఆధ్వర్యంలో వైసీపీ అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి హాజరయ్యారు. మొదటగా వై యస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాలర్పించారు. అనంతరం 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తర్వాత అనంత వెంకటరామిరెడ్డి, నరేష్‌రెడ్డి, ఇతర నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయాల్లో





చంద్రబాబు అవకాశవాది అనీ, ఇప్పటి వరకు నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. ప్రతిసారీ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. మహిళలు, రైతులకు రుణమాఫీలు కూడా చేయలేదన్నారు. జగన్ సీఎం అయ్యాక నవరత్నాలు పథకాలు తీసుకొచ్చి అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా పథకాలు దిగ్విజయంగా అమలు చేశారు. వసతిదీవెన, విద్యాదీవెన అందించాం. జగన్ ఇచ్చిన పథకాల కంటే ఎక్కువ పథకాలు అందిస్తామని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు చెప్పారు. ఏడాది గడిచినా ఇచ్చిన సూపర్ సిక్స్ అమలుకు నోచుకోలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ఏడాదికి ప్రజలకు 81 వేల కోట్లు అందించాలి. కానీ ఈ ప్రభుత్వం ఇవ్వలేకపోయిందన్నారు. వైసీపీ హయాంలో అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనం, రైతు భరోసాను అన్నదాత సుఖీభవ అని మార్చుకున్నారన్నారు. వైఎస్ఆర్‌సీపీకి గత ఎన్నికల్లో 11 సీట్లు వచ్చినా 40 శాతం మంది ఓట్లు వేశారనీ, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పని చేస్తామన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తీసుకొచ్చి అక్రమ కేసులు పెట్టినా.. అరెస్టులు చేసినా ఎవరూ భయపడడం లేదనీ, ప్రజల పక్షాన మనం బలంగా పోరాటం చేయడమే కాకుండా, కూటమి ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వ మెడలు వంచుదామన్నారు. మనం ఐదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమానికి పెద్దపీట వేశాం. అనేక సంస్కరణలు తెచ్చాం. పార్టీలో గతంలో జరిగిన పొరపాట్లు భవిష్యత్‌లో జరగవనీ, మనకు ద్రోహం చేసిన వారిపై కన్నుపెడుతూనే రానున్న కాలంలో కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు.. పార్టీకి, ప్రజలకు మధ్య కార్యకర్తలే వారధి. ఇది నా మాట కాదు.. జగన్ మాట అని, వైసీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నాం. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో పార్టీని పటిష్టం చేస్తున్నాం. కార్యవర్గాలు ఏర్పాటు చేశాం, త్వరలోనే డివిజన్, గ్రామ స్థాయిలో నియామకాలు పూర్తి చేస్తామన్నారు. అందరూ ఐకమత్యంతో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'ను ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు.

# అమెరికాతో తెలుగువారికి స్నేహపూర్వకమైన బంధం

### - యూఎస్-తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలను మెరుగుపరేందుకు చర్యలు- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ప్రజాతంత్ర, జూలై 11 : అమెరికా సంయుక్త రాష్ట్రాలకు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ప్రపంచం పూర్తిగా మారిపోయిందని, అమెరికా ప్రపంచం ముందు అనేక సానుకూల అంశాలను ఆవిష్కరించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ కాన్సుల్ జనరల్ - అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ. ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా, నిరంతరం ఆవిష్కరణలను అందించడమనే రెండు అంశాల్లో అమెరికా ప్రపంచ దృక్కోణాన్ని మార్చిందని వివరించారు. ఓటమిని ఎప్పుడూ అంగీకరించని స్ఫూర్తి అమెరికాది. ఎల్లప్పుడూ బలమైన దేశంగా, అనేక అంశాల్లో ఒక సానుకూల మార్గంలో పరిష్కారాలను చూపగలిగిందన్నారు. తెలంగాణ స్ఫూర్తి కూడా అమెరికా స్ఫూర్తికి ఎంతో సారూప్యత ఉందని, స్నేహాన్ని కోరుకోవడం, బంధాన్ని మరింత పటిష్టపరుచుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని అన్నారు. 2008 లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఏర్పాటైంది. భారతదేశంతో దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో అమెరికా ఎంతో నిబద్ధతను ప్రదర్శించింది. అమెరికాతో తెలుగు ప్రజలకు ఉన్న స్నేహపూర్వకమైన బంధం ఎంతో బలమైంది. అమెరికాలో తెలుగు భాష వేగంగా అభివృద్ధి చెందుతోంది. హైదరాబాద్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ రెండు సంస్కృతుల మధ్య, ప్రజల మధ్య వాణిజ్యపరమైన సంబంధాలను పటిష్టపరచడంలో ఇరు దేశాల మధ్య బలమైన వారధిగా నిలుస్తున్నారు. ఐటీ, ఫార్మా, డిఫెన్స్, మాన్యుఫాక్చరింగ్, ఏరోస్పేస్ వంటి రంగాలకు చెందిన దాదాపు 200 అమెరికా కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఎంతో మంది విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకోవడానికి ఇక్కడి నుంచి అమెరికా వెళుతున్నారు. అమెరికా - తెలంగాణల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత మెరుగుపరచడానికి మేం ప్రయత్నిస్తున్నాం. తెలంగాణను 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా%ా% 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తెలంగాణ రైజింగ్ దార్శనికతకు కట్టుబడి మా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందుకు మాకు అమెరికన్ల మద్దతు కావాలి. జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసం, విలువల ఆధారంగా అమెరికా - భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోంది. ముఖ్యంగా సైనిక విన్యాసాలు, అంతరిక్ష పరిశోధనలో సహకారం, సాంకేతిక రంగంలో పెట్టుబడులకు సంబంధించిన వాణిజ్యంలో ఇరు దేశాలు రికార్డు నెలకొల్పాయి. హైదరాబాద్‌లో మరింత పురోభివృద్ధి సాధించాలని, అమెరికాలోని అత్యుత్తమైన వాటిని తెలంగాణకు తీసుకొస్తారని తాను ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# హిందీ భాష మనది...బల్ల గుద్ది మరీ చెప్పిన పవన్!




దక్షిణాదిన కొన్ని రాష్ట్రాలు హిందీ భాష వద్దు అంటూ ఉద్యమాలు చేస్తున్నాయి. అసలు భాషా పరమైన వివాదాలు వివిధ రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్నాయి. దక్షిణాదిన కొన్ని రాష్ట్రాలు హిందీ భాష వద్దు అంటూ ఉద్యమాలు చేస్తున్నాయి. అసలు భాషా పరమైన వివాదాలు వివిధ రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్నాయి. తాజాగా కర్ణాటక, మహారాష్ట్ర త్రిభాషా విద్యా విధానంలో హిందీ ఎందుకు అని ప్రశ్నించాయి. తమిళనాట ఎప్పటి నుంచో హిందీ విషయంలో వ్యతిరేకత ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హిందీ భాష మనది అన్నారు. జాతీయ భాష అన్నారు. రాజ భాష అన్నారు. హిందీ విషయంలో భయం ఎందుకు అని ప్రశ్నించారు. ఉర్దూ పర్షియన్ తో పాటు ఇతర భాషలను స్వాగతిస్తున్న మనకు హిందీతో ఇబ్బందులు ఏమిటి అని ప్రశ్నించారు జర్మనీ జపాన్ సహా ఇతర భాషలను అనేక విదేశీ భాషలను నేర్చుకుంటున్న మనకు జాతీయ భాష అయిన హిందీ విషయంలో ద్వేషం ఎందుకు ఉండాలని ఆయన అన్నారు. - 'డ్యూక్స్'..బంతితో ఆట కాదు..బంతే ఆటగాళ్లతో ఆడుకుంటోంది... మన ఇంట్లో మన రాష్ట్రంలో మాట్లాడేది మాతృ భాష. అయితే రాష్ట్రం దాటితే అందరినీ కలిపే రాజ భాష హిందీ అని పవన్ అభివర్ణించారు. హిందీ భాష విషయంలో వివాదాలు చేయడం తగదని ఆయన అన్నారు. హైదరాబాద్ లో శుక్రవారం నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న పవన్ ఈ సందర్భంగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది దక్షిణాది అని హిందీ భాష విషయంలో సాగుతున్న వివాదాలు భాష మీద ఆధిపత్య రాజకీయలు సాగుతున్నాయని పేరుతో ద్వేషిస్తున్న తీరు కొనసాగుతున్న వేళ పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. - రూ.1.8 కోట్లతో మరణాన్ని మోసం చెయ్యొచ్చుంట... ఎలాగో తెలుసా? అందరికీ హిందీ దివస్ అభినందనలు తెలిపిన పవన్ హిందీ భాష ప్రాముఖ్యత గురించి దేశంలో ఆ భాష పోషించే కీలక పాత్ర గురించి వివరించారు. భాషా భేదాలు విడనాడాలని ఆయన ఒక మంచి సందేశం ఇచ్చారు. హిందీని ప్రేమిద్దామని పవన్ అన్నారు మన భాషగా భావిద్దామని కూడా ఆయన చెప్పారు. దేశంలో అనేక భిన్న సంస్కృతులు ఉన్నాయని అనేక భాషలు ఉన్నాయని అలా ఉన్న అందరినీ కలిపే భాష హిందీ అని ఆయన చెప్పారు. దేశానికి సంబంధించి హిందీ ఒక కామన్ భాషగా ఉంటుందని అన్నారు. విదేశీయులు సైతం హిందీని నేర్చుకుంటూంటే మన భాష హిందీని మనం వ్యతిరేకించడం ఎంతవరకూ సమంజసమని ఆయన ప్రశ్నించారు. హిందీతో రాజకీయాలు మానుకోవాలని ఆయన కోరారు. బెంగాలీ జాతీయ గీతం అయింది, అబ్దుల్ కలాం మిసైల్ మాన్ అయ్యారు, దక్షిణ భారత దేశస్తుడు తయారు చేసిన జెండా జాతీయ జెండా అయింది, హిందీ అందరి భాషా ఎందుకు కారాదని పవన్ నిలదీశారు. - జనసేన స్లో పాయిజన్ తీసుకుంటుందా? ప్రతీ భాష జీవ భాషగానే చూడాలని అన్నారు. అదే సమయంలో హిందీ అందరినీ కలిపే రాష్ట్ర భాషగా చూడాలని పవన్ సూచించారు. మాత భాష మన అమ్మ భాష అయితే హిందీ పెద్దమ్మ భాష అని ఆయన అభివర్ణించారు. ఏ కారణం లేకుండా హిందీని వ్యతిరేకించడం అంటే భావి తరాల అభివృద్ధిని పరిమితం చేసినట్లే అని పవన్ అన్నారు. దేశంలోని అనేక ప్రాంతీయ చిత్రాలలో 31 శాతం హిందీలోకి డబ్ అవుతున్నాయని పవన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వ్యాపారానికి హిందీ కావాలి కానీ నేర్చుకోవడానికి మాత్రం అభ్యంతరం ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. తాను ఎంతగానో జాతీయ భాషను ప్రేమిస్తాను అని అందుకే ఏనాడో తాను నటించిన ఖుషీ సినిమాలో హిందీ పాట పెట్టాను అని ఆయన అన్నారు. హిందీ తన జాతీయ భాష అని చెప్పడానికే అలా చేశాను అని ఆయన అన్నారు. హిందీ గొప్పతనం అంతా తెలుసుకోవాలని ఆయన కోరారు. హిందీ భాష మీద నా చిత్తశుద్ధి అని ఆయన చెప్పారు. - 'డీకే'కు ఎసరు పెడుతోన్న సీఎం సిద్ధరామయ్య మొత్తం మీద చూస్తే పవన్ అర్థవంతంగా మాట్లాడారు, హిందీ విషయంలో జరుగుతున్న వ్యతిరేక ప్రచారాన్ని ఆయన తార్కికంగానే తిప్పికొట్టారు. దేశంలో విభిన్న రాష్ట్రాలను కలిపి ఉంచే కామన్ భాషగా హిందీని చూడాలని కోరారు. భాషను కూడా రాజకీయాలు చేసి సంకుచితంగా వ్యవహరిస్తున్న నాయకులకు చెంపపెట్టుగా పవన్ ప్రసంగం సాగింది అని అంటున్నారు. హిందీ భాష విషయంలో ఎక్కువగా మక్కువ చూపే వారంతా పవన్ స్పీచ్ కి ఫిదా అవుతున్నారు. ఆయన చెప్పింది నిజమే కదా అని కూడా వారు అంటున్నారు. ఒక ప్రాంతీయ పార్టీకి చెందిన నాయకుడు, అందునా దక్షిణాదికి చెందిన నాయకుడు నోట నుంచి ఇంత పెద్ద ఎత్తున హిందీకి మద్దతు దక్కడం అంటే గ్రేటే. అదే సమయంలో గుడ్డిగా హిందీని వ్యతిరేకించే వారికి మాత్రం ఇది మింగుడు పడని విషయమే అని అంటున్నారు.

## కొండాయి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన రాష్ట్ర మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క



ఏటూరు నాగారం ప్రభాత సూర్యుడు : పనులను వేగవంతంగా నాణ్యత తో త్వరగా చేపట్టాలని అధికారులకు సూచించిన రాష్ట్ర మంత్రివర్యులు ధనసరి సీతక్క గారు... కొండాయి మరియు దొడ్ల కొత్తూరు గ్రామాలలో 72 లక్షల నిధులు మంజూరు చేపట్టి నిర్మాణం పూర్తయినటువంటి సిసి రోడ్లను ప్రారంభించిన మంత్రి సీతక్క గారు... ఈ కార్యక్రమంలో కలెక్టర్ టి ఎస్ దివాకర,కాంగ్రెస్ పార్టీ పీసీసీ జనరల్ సెక్రటరీ మల్లాడి రాంరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి,ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, బ్లాక్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న,%=ూా% డైరెక్టర్ వసంత శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్,మండల అధ్యక్షులు చిటమట రఘు, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు,మహిళా నాయకురాల్లు,అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## డి ఈ ఓ, ఆర్ ఐ ఓ లను సస్పెండ్ చేయాలి..

### ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్.



అనంతపురం జూలై 11, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తున్న విద్యాశాఖ అధికారులు డీఈవో, ఆర్ ఐ ఓ లను విధుల నుంచి తొలగించాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం అనంతపురం నగరంలోనీ జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమర్ యాదవ్ మాట్లాడుతూ కరువు జిల్లాలో కార్పొరేట్, ప్రవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న అధికారులు పట్టించుకున్న పాపాలు పోలేదన్నారు. ప్రభుత్వ జీవోల ప్రకారం ఏ విద్యాసంస్థలైనా పుస్తకాలు, యూనిఫామ్, మెటీరియల్ అమ్మకూడదు కానీ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు, స్కూల్స్ కాలేజీల్లోనే సొంతంగా దుకాణం ఏర్పాటు చేసుకొని తమ విద్యాసంస్థల పేర్లను ముద్రించుకొని మూడు పూలు, ఆరు కాయలు లాగా పుస్తకాల వ్యాపారం చేస్తున్నారన్నారు. జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎక్కడైనా గాని నోటీసు బోర్డులో ఫీజులు వివరాలు తెలపలేదన్నారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు వివిధ రకాల గ్రూపుల పేర్లతో టెక్నో, సి బ్యాచ్, ఒలంపియాడ్, ఐపీఎల్, ఐకాన్, ఎం బ్యాచ్, సైనిక్, పేర్లతో విద్యార్థి తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డిఈఓ, ఆర్ ఐ ఓ లు ఏ విద్య సంస్థకైనా నోటీస్ ఇచ్చారో, సీజ్ చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. విద్య హక్కు చట్టం ప్రకారం బడుగు, బలహీన, దివ్యాంగుల, పేద విద్యార్థులకు ఎక్కడ 25 శాతం సీట్లు కేటాయించారో తెలిపాలని డిమాండ్ చేశారు.. ఈ అధికారులకు ముడుపులు కావాలంటే తాము విద్యార్థి సంఘాలుగా బిక్షాటన చేసి ముడుపులు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ వాహనంలో తిరుగుతూ లక్షలాది రూపాయలు వేతనం రూపంలో తీసుకుంటూ కనీసం కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు దోపిడీని అరికట్టకపోతే మరి ఎందుకు ఈ అధికారులని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com


## నాకూ 75 ఏళ్లు నిండుతాయని మోడీ చెప్పగలరా?!




న్యూఢిల్లీ : 75 ఏళ్లకు నేతలు రిటైర్ అవ్వాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ దుమారం రేపాయి. ఎందుకంటే ప్రధాని నరేంద్ర మోడీకి ఈ ఏడాది సెప్టెంబర్‌తో 75 ఏళ్లు పూర్తవుతాయి. కనుక మోహన్ భగవత్ మోడీనుద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారంటూ చర్చ నడుస్తోంది. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, ఆ పార్టీ కమ్యూనికేషన్స్ విభాగానికి ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీగా ఉన్న రమేష్ స్పందించారు. 'పేలవమైన అవార్డులను గెలుచుకున్న ప్రధాని నరేంద్ర మోడీ స్వదేశానికి తిరిగి వచ్చిన వేళ ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యలు గుర్తు చేసుకోవాలి. ప్రధాని నరేంద్ర మోడీకి సెప్టెంబర్ 17-2025 నాటికి 75 ఏళ్లు పూర్తవుతాయి. మరి ప్రధాని నాకు సెప్టెంబర్ నాటికి 75 ఏళ్లు నిండుతాయి అని ఆర్ఎస్ఎస్ చీఫ్‌కి చెప్పగలరా? ఒకవేళ చెబితే ఆయన పదవి ఉంటుందా? ఈ పరిస్థితి వస్తే.. ఒకే బాణానికి రెండు పిట్టలు అన్నట్టుగా ఉంటుందని రమేష్ అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, మోహన్ భగవత్ నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లీకి అంకిత చేసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. గతంలో మోరోపంత్ పింగ్లీ మాటాలను గుర్తు చేశారు. '75 ఏళ్లు నిండిన తర్వాత మీకు శాలువాతో సత్కారం లభిస్తే దాని అర్థం మీరు ఇక ఆగిపోవాలని. పక్కకు తప్పుకుని ఇతరులకు అవకాశం ఇవ్వాలి' అని మోరోపంత్ చేసిన వ్యాఖ్యలను భగవత్ ప్రస్తావించారు.

## జనాభా నియంత్రణ కాదు.. నిర్వహణ చేయాలి




అమరావతి : జనాభా నియంత్రణ కాదు.. నిర్వహణ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వెలగపూడిలోని సచివాలయం వద్ద ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ జనాభా అనేది భారం కాకుండా ఆస్తిగా భావించే కాలం వచ్చిందన్నారు. భారతదేశంలో ఎక్కువ జనాభా ఉండటం మనకు పెద్ద వనరు అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యువశక్తి క్షీణించి అభివఅద్ధి కూడా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకున్న తెలుగువారు అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. దేశమంటే మనుషులు అనే నినాదానికి సార్థకత చేకూరాలని, గురజాడ చెప్పిన స్ఫూర్తితో ముందుకెళ్లాలని సిఎం సూచించారు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి అర్హత లేదని గతంలో తానే చట్టం తీసుకొచ్చానని గుర్తు చేశారు. జనాభా నియంత్రణ కాదు.. జనాభా నిర్వహణ చేయాలి అని చెప్పారు. దీనిపై సూచనలు ఇవ్వాలని కోరుతున్నామంటే అదీ మార్పు అని అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పాలసీలను మార్చుకోకపోతే చాలా సమస్యలు వస్తాయని తెలిపారు. మంచి పాలసీ ఏ విధంగా తేవాలని ఇక్కడ మనం కూర్చొని ఆలోచిస్తున్నామన్నారు. ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరిన సందర్భంగా. 1985 జులై 11న మొదటిసారి ఐ.రా.స ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించిందని తెలిపారు. గతంలో జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవాళ్లు అని, ఇప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలపై ఆధారపడే పరిస్థితి వచ్చింది అని చెప్పారు. జనమే ప్రధాన ఆస్తిగా భావించే రోజులు వచ్చాయన్నారు. ప్రత్యుత్పత్తి రేటు 2.1గా ఉంటే జనాభా పెరుగుదల స్థిరంగా ఉంటుందని అయితే ఏపి రాష్ట్రంలో ప్రత్యుత్పత్తి రేటు 1.8గా ఉంది.. ఇది మెరుగుపడాలి అని సిఎం చంద్రబాబు తెలిపారు.

## 75 ఏళ్లకు రిటైర్ రావాలి
## ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యలపై వివాదం..



న్యూఢిల్లీ : బీజేపీ సైద్ధాంతిక సంస్థ ఆర్ఎస్ఎస్ చీఫ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా సంచలనంగా మారాయి. ఇటీవల ఓ కార్యక్రమంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ, 75 ఏళ్ల వయసు తర్వాత రిటైర్ కావాలని అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యల్ని ఉపయోగించుకుని కాంగ్రెస్, శివసేన(యూబీటీ) వంటి పార్టీలు బీజేపీని టార్గెట్ చేస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగలే తన 75వ పుట్టినరోజున చేసిన ప్రసంగాన్ని ప్రస్తావించాయి. అయితే, ఈ వ్యాఖ్యల కేవలం మోరోపంత్ పింగలేను మాత్రమే సూచిస్తున్నాయని, వాటితో మరెవరితో ముడిపెట్టకూడదని ఆర్ఎస్ఎస్ స్పష్టం చేసింది. ప్రతిపక్షాల విమర్శలకు బీజేపీ ఇంకా స్పందించలేదు. రెండు రోజుల క్రితం ఇంగ్లీషులో 'మోరోపంత్ పింగలే: ది ఆర్కిటెక్ట్ ఆఫ్ హిందూ రిసర్జెన్స్' అనే పుస్తకాన్ని అధికారికంగా ఆవిష్కరించే కార్యక్రమం జరిగింది. పింగలే తన 75 ఏళ్లు నిండిన తర్వాత చేసిన ప్రకటనను మోహన్ భగవత్ ప్రస్తావించారు. "75 సంవత్సరాల శాలువా మీపై కప్పబడి ఉంటే, మీరు ఒక నిర్దిష్ట వయస్సుకు చేరుకున్నారని, పక్కకు తప్పుకుని ఇతరులను పని చేయనివ్వాలని పింగలే ఒకసారి అన్నారు" అని మోహన్ భగవత్ నాగ్‌పూర్‌లో అన్నారు. ఇది యువతరం రావడానికి ఒక సంకేతమని ఆయన చెప్పారు. ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు బీజేపీని ఇరకాటంలో పెడుతున్నాయి. ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేస్తున్నాయి. సెప్టెంబర్ 17, 2025న ప్రధానిమోడీకి 75 ఏళ్లు నిండుతాయి. ఈ నేపథ్యంలో శివసేన ఠాక్రే వర్గం ఎంపీ ప్రియాంకా చతుర్వేది మాట్లాడుతూ.. ఇది స్పష్టమైన సందేశం అని, ఆర్ఎస్ఎస్ బీజేపీ మధ్య ఏం జరుగుతుందో దీని ద్వారా అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ నేత జై రాం రమేష్ మాట్లాడుతూ.. "ఒకే బాణం రెండు లక్ష్యాలు" ప్రధాని మోడీతో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్‌కు కూడా ఈ ఏడాదితో 75 ఏళ్లు నిండుతున్నాయని గుర్తు చేశారు.

## పీసీసీ చీఫ్‌గా డీకే శివకుమార్‌ను
## తొలగించేందుకు సిద్ధరామయ్య ప్లాన్..




న్యూఢిల్లీ : కర్ణాటక కాంగ్రెస్‌లో సీఎం సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్, ఉపముఖ్యమంత్రి అయిన డీకే శివకుమార్ వర్గాల మధ్య కోల్డ్ వార్ జరుగుతూనే ఉంది. ముఖ్యమంత్రి పీఠం డీకే శివకుమార్‌కి దక్కాలని ఆయన వర్గం డిమాండ్ చేస్తోంది. ఇలాంటి ప్రతిపాదన ఏం లేదని సీఎం సిద్ధరామయ్య ఓపెన్‌గానే చెబుతున్నారు. దీంతో రాష్ట్ర నాయకత్వంలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇదిలా ఉంటే, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అధ్యక్షుడిగా ఉన్న డీకే శివకుమార్‌ను ఆ స్థానం నుంచి తొలగించాలని సీఎం సిద్ధరామయ్య శిబిరం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. సీఎం వర్గం, పీసీసీ చీఫ్ పదవికి పిడబ్ల్యుడి మంత్రి సతీష్ జార్కిహొళిని ప్రతిపాదిస్తోంది. ఆయన ఎస్టీ వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు కావడంతో, కుల సమీకరణాలను అధిష్టానం ముందు సిద్ధరామయ్య వర్గం ఉంచింది. పార్టీలో "ఒకరికి ఒకే పదవి" అనే నియమానికి అనుగుణంగా కర్ణాటక పీసీసీ చీఫ్ అధ్యక్షుడిగా నియమిస్తే జార్కిహొళి తన మంత్రి పదవిని వదులుకునేలా సీఎం వర్గం ఒప్పించింది. ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో ఈ మార్పు అమలు చేయాలని సిద్ధరామయ్య వర్గం హైకమాండ్‌ని కోరింది. డీకే శివకుమార్ ప్రభావాన్ని తగ్గించే ప్లాన్‌లో భాగంగా సీఎం వర్గం ఈ వ్యూహాన్ని రచించినట్లు తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడి హోదాలో ఎమ్మెల్యేలను స్వతంత్రంగా పిలవకుండా అడ్డుకునేందుకు డీకే అధికారాలకు కత్తెర వేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# చిత్తశుద్ధి లేని నిషేధం!



రాజ్యాంగంలోని మూడు వ్యవస్థల తాలూకు సమస్త యంత్రాంగం కొలువు తీరిన దేశ రాజధాని ఢిల్లీలో ప్రమాదకర స్థాయికి చేరిన వాయు కాలుష్యం మన విధాన నిర్ణేతల వైఫల్యాలకు నిదర్శనం. ఈ నెల 1 నుంచి కాలం చెల్లిన వాహనాలను రోడ్లపై తిరగనివ్వబోమని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం) ఉత్తర్వులిచ్చింది. డీజిల్ వాహనాలు పదేళ్లకు మించి తిరుగుతున్నా, పెట్రోల్ వాహనాలు పదిహేనేళ్లకు మించి వినియోగిస్తున్నా వాటికి బంకుల్లో ఇంధన విక్ర యాన్ని కమిషన్ నిషేధించింది. మొదట దీన్ని ఢిల్లీలో అమలుచేసి, దశలవారీగా జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్) అంతటికీ విస్తరిస్తామని తెలిపింది. అందుకనుగుణంగా ఈ నెల 1న చర్యలు మొదలయ్యాయి కూడా. తొలిరోజు కాలం చెల్లిన 80 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 450 వాహనాలకు పెట్రోల్, డీజిల్ అమ్మకాలను నిరాకరించారు. అసలు ఆ బాపతు వాహనాలు బంకుల్లో ప్రవేశించిన క్షణాల్లోనే 'మీది కాలం చెల్లిన వాహనం. ఇక్కడ ఇంధన విక్రయాలు జరపరు' అంటూ మైకులు ఉరమటంతో జనం విస్తుపోయారు. కానీ రెండో రోజుకల్లా నిషేధం నీరుగారింది. కేవలం ఏడంటే ఏడే వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మూడోరోజుకల్లా అదీ లేదు. మొదటి రెండు రోజులూ నిషేధం అమలు చేసినా ఇప్పటికీ చాలామంది వాహన యజమానులకు దానిపై అవగాహన లేదంటే ప్రభుత్వ ప్రచారం ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. నిబంధన అమలును నిలిపేయాలని ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం సీఏక్యూఎంను కోరటంతో అది అంగీకరించింది. వచ్చే నవంబర్ 1 నుంచి ఈ నిషేధం అమలవుతుందని తాజాగా ప్రకటించింది. ఎన్నేళ్ల నుంచి వాహనం వాడుతున్నారో తేల్చటానికి అనువైన డిజిటల్ ఆధారిత కెమెరాలు, సెన్సర్లు, స్పీకర్లు చాలాచోట్ల సరిగా లేవనీ, అందువల్లే ఈ వాయిదా అత్యవసరమనీ సీఏక్యూఎంకు రాసిన లేఖలో ప్రభుత్వం తెలిపింది. ఢిల్లీ కాలుష్యానికి కేవలం కాలం చెల్లిన వాహనాలే కారణమా... కాలుష్యంలో వాటి వాటాయే అధికమా అని ప్రశ్నిస్తున్నవారు లేకపోలేదు. ఆ విచికిత్స మాట అటుంచి, ఏ చట్టమైనా మన దేశంలో ఎలా విఫలమవుతుందో చెప్పటానికి కేవలం ఈ రెండు రోజుల నిషేధమే రుజువు. నిషేధం మొదలయ్యాక పెద్దయెత్తున నిరసనలు పెల్లుబికాయి. ఇక చేసేది లేక ఆదరా బాదరాగా ఢిల్లీ ప్రభుత్వం సీఏక్యూఎంను ఆశ్రయించటం, అది వెంటనే అంగీకరించటం పూర్తయింది. కాలం చెల్లిన వాహనాలను నిలిపేయాలన్నది ఇప్పటి ఆలోచన కాదు. 2018లో సుప్రీంకోర్టే ఒక తీర్పులో ఈ సూచన చేసింది. దాన్ని అమలు చేస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారిక అంచనా ప్రకారం, ఢిల్లీలో కాలం చెల్లిన వాహనాల సంఖ్య 60 లక్షలు! ఢిల్లీలోని అయిదు ప్రాంతాలు- గురుగ్రాం, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతంబుద్ధ నగర్, సోనిపట్‌లలో వాహనాల తాకిడి అధికమని ఆ అంచనా చెబుతోంది. రాజధాని నగరంలో వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ఇంతవరకూ అమలు చేసిన ఏ విధా నమూ విజయవంతమైన దాఖలా కనబడలేదు సరిగదా... మొన్న మార్చిలో విడుదలైన గత ఏడాది ప్రపంచ వాయు కాలుష్య నివేదిక ప్రపంచంలోని కాలుష్య నగరాల్లో ఢిల్లీది రెండో స్థానమని ప్రకటించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన మార్గదర్శకాల ఆధారంగా రూపొందిన ఈ నివేదిక ఢిల్లీ వాతావరణంలో సాధారణ స్థాయికన్నా 21 రెట్లు అధికంగా సూక్ష్మ ధూళి కణాలున్నాయని తేల్చింది. ఇంకా విషాదమేమంటే, అంతకు ముందు ఏడాది కన్నా 2024లో ఈ కాలుష్యం 6 శాతం పెరిగింది. ఢిల్లీలో సాధారణంగా ప్రతి యేటా నవంబర్ నెలకల్లా వాయు కాలుష్యం గురించిన చర్చ మొదలవుతుంది. అప్పటికల్లా శీతగాలుల తాకిడి మొదలై వాతావరణంలో కాలుష్యం నిలకడగా ఉండిపోతుంది. ఈసారి రెండు రోజుల నిషేధం ప్రహసనం వల్ల ముందే ఆ చర్చ ప్రారంభమైంది. ఏ విధానమైనా అమలు చేసేముందు దాని అమలుకు సంబంధించిన మౌలిక సదుపాయా లెలా ఉన్నాయో ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి. ఒక్క మానెసర్ ప్రాంతంలోని ఒక కేంద్రం తప్ప ఢిల్లీ మొత్తంలో ఎక్కడా ప్రామాణికమైన కేంద్రాలు లేవని నిపుణులు చెబుతున్నారు. కేవలం ప్రైవేటు కార్లకే నిబంధనలు వర్తిస్తాయన్నట్టు రవాణా విభాగం ప్రవర్తించింది. ప్రజారవాణా బస్సులు మొదలుకొని వాణిజ్య వాహనాల వరకూ అనేకం ఢిల్లీ కాలుష్యాన్ని అపారంగా పెంచు తున్నాయి. తాజా నిషేధం వాటి జోలికి పోలేదు. ఇక కాలుష్యంలో టూవీలర్‌ల వాటా దాదాపు 25 శాతం. అసలు వాహనం మోడల్‌ని బట్టి దాన్ని కాలం చెల్లిన వాహనంగా వర్గీకరించటం అశాస్త్రీయం. వాహనాన్ని అరుదుగా వాడేవారుండొచ్చు, అతి జాగ్రత్తలు తీసుకునే వారుండొచ్చు. అటువంటివి కాలం చెల్లినవి ఎలా అవుతాయి? వాహనం సాంకేతికంగా తగిన ఫిట్‌నెస్ కలిగివుందా లేదా అనేది చూస్తే వేరుగా వుండేది. అన్నిటికన్నా ముఖ్యం - ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపర్చటం, నగరంలోని నలు మూలలకూ అన్ని సమయాల్లో విస్తృతంగా బస్సు సదుపాయం కల్పించటం. బస్సు కోసం రోడ్లపై గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకపోతే ఎవరైనా తడిసి మోపెడయ్యే సొంత వాహనం కోసం ఎందుకు ఎగబడతారు? వాహనాలు నానాటికీ పెరుగుతున్నాయంటే అది పాలకుల వైఫల్య పర్యవసానం. ఆ సంగతలా ఉంచి అసలు కాలం చెల్లిన వాహనాలను ఏం చేయదల్చుకున్నారు? వాటిని వదిలించుకోవటానికి ఏం ఆలోచించారు? సమస్యలు ఇన్నివున్నప్పుడు ఈ మొక్కుబడి నిషేధాల వల్ల ప్రయోజనం ఏమిటి?

# ఉక్రెయిన్‌కు పేట్రియాట్ క్షిపణులు!



ఉక్రెయిన్‌పై రష్యా మిలిటరీ చర్య 1,233వ రోజులో ప్రవేశించింది. పుతిన్ సేనలు, రష్యాపై దాడులు చేసేందుకు అవసరమైతే పేట్రియాట్ క్షిపణులు ఇస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించటంతో సంక్షోభం మరోమలుపు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కీలక ఆయుధ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించి కొద్ది రోజులు కూడా గడవక ముందే మిలిటరీ సరంజామా పంపుతున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. ఈ పరిణామం జరగ్గానే, బుధ, గురువారాల్లో రష్యన్ సేనలు పెద్దఎత్తున డ్రోన్లు, క్షిపణులతో ఉక్రెయిన్‌పై దాడులు జరిపాయి. మరోవైపున శాంతిచర్చలకు చొరవ చూపేందుకు పోప్ లియో సుముఖంగా ఉన్నారని ఆయనను కలిసిన తర్వాత జెలెన్‌స్కీ ప్రకటించాడు. వివిధ ప్రాంతాలపై దాడులు కొనసాగిస్తున్న రష్యా కొత్తగా మరికొన్ని ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నట్లు ప్రకటించింది. పుతిన్ వ్యవహార శైలితో తాను సంతోషంగా లేనని మంగళవారం నాడు మంత్రివర్గ సమావేశం తర్వాత ట్రంప్ ప్రకటించాడు. పుతిన్ గురించి నోరుపారవేసుకున్న ట్రంప్ తీరును తాము పట్టించుకోవటం లేదని రష్యా స్పందించింది. గురువారం నాడు రోమ్ నగరంలో ఉక్రెయిన్ స్వస్థత సమావేశం జరగటానికి ముందు జెలెన్‌స్కీ ఇటలీలో ట్రంప్ ప్రతినిధి కెయిత్ కెలోగ్‌తో సమావేశం సందర్భంగా రష్యా దాడులను తీవ్రం కావించింది. పోప్ లియోను రెండు నెలల్లోనే జెలెన్‌స్కీ రెండుసార్లు కలిశాడు. పోరు ఇంకా కొనసాగుతుండగానే ఉక్రెయిన్ పునరుద్ధరణ పథకాలు దానికి అవసరమైన పెట్టుబడులు, దానిలో పాలుపంచుకొనే దేశాలు, నిర్మాణ సంస్థల గురించి పశ్చిమదేశాలు వాణిజ్య చర్చలు జరపనున్నాయి.రాజకీయ, వాణిజ్యవేత్తలు దీనిలో భాగస్వాములు కానున్నారు. ఇల్లు కాలుతుంటే బొగ్గులేరుకొనేందుకు చూడటం తప్ప మరొకటి కాదు. నాటో కూటమి దేశాలు అనుసరించిన వైఖరి కారణంగానే ఉక్రెయిన్ సంక్షోభం అన్నది తెలిసిందే. దాన్ని ముగించాల్సిన బాధ్యత కూడా వారి మీదే ఉంది. దాన్ని పక్కనపెట్టి దాదాపు ఆరువందల బిలియన్ డాలర్లతో తిరిగి ఉక్రెయిన్‌ను బాగుచేస్తామని ఆ కాంట్రాక్టులను కూడా తమకే ఇవ్వాలని కోరుతున్నారంటే ఇంతకంటే దుర్మార్గం మరొకటి ఉంటుందా?తమపై పోరుకు పుతిన్‌కు చైనా మద్దతు ఇస్తున్నదని జెలెన్‌స్కీ ఆరోపించాడు. పౌరులకు హానికలిగే మందుపాతరలను అమర్చకూడదన్న అట్టావా ఒప్పందం నుంచి వైదొలిగిన ఉక్రెయిన్ పౌరులను బలితీసుకుం టున్నదని రష్యా విమర్శించింది. తమ దగ్గర ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నం దున ఉక్రెయిన్‌కు పంపలేమని, కొద్ది రోజులు నిలుపుదల చేస్తున్నట్లు పెంటగన్ ప్రకటించిన వారం తర్వాత పునరుద్ధరించటం వివాదాన్ని పరిష్కరించాలనే చిత్తశుద్ధి అమెరికాకు లేదన్నది స్పష్టం. మీరు గనుక ఉక్రెయిన్ మీద దాడి చేస్తే నేను మాస్కో మీద బాంబులు వేయిస్తానని పుతిన్‌తో మాట్లాడినపుడు ట్రంప్ బెదిరించాడన్న వార్త గుప్పుమన్నది. అయితే వారి మధ్య ఆ సంభాషణ ఎప్పుడు జరిగిందో, అది నిజమో కాదో నిర్ధారణ కాలేదు గానీ, ఆధునిక ఆయుధాలను ఇస్తాన్న ట్రంప్ మాటలు దాన్ని నిర్ధారిస్తున్నాయి.కొద్ది వారాల క్రితం రష్యా భూభాగంలో ప్రవేశించి అనేకచోట్ల ఉక్రెయిన్ జరిపిన దాడుల వెనుక అమెరికా హస్తం లేదని మెడమీద తలకాయ ఉన్నవారెవరూ చెప్పరు. అధికారానికి వచ్చిన 24 గంటల్లోనే ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరిస్తానని ట్రంప్ చెప్పాడు. పుతిన్‌తో నేరుగా మాట్లాడాడు. 'రష్యాకు రాయితీలు ఇవ్వాల్సిందే, కొన్ని ప్రాంతాలు వదులుకోవాల్సిందే, మేం 350 బిలియన్ డాలర్లు ఇచ్చినా యుద్ధంలో గెలిచేది లేదు చచ్చేది లేదని' జెలెన్‌స్కీతో చెప్పాడు. అతగాడిని మంచి హాస్యనటుడు అంటూనే ఎన్నికలు జరపని నియంత అన్నాడు. ఓవల్ కార్యాలయంలో అవమానించాడు. రష్యాను ఖండిస్తూ ఐరాసలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకించాడు. ఐరోపా దేశాలన్నీ ఈ తీరును చూసి నిజంగానే ట్రంప్ తమను వదిలి పుతిన్‌తో చేతులు కలిపి ఉక్రెయిన్‌ను అప్పగిస్తాడా అన్నంతగా భయపడ్డాయి. చివరికి భద్రతా మండలిలో రష్యామీద ఎలాంటి విమర్శలు లేని తీర్మానానికి మద్దతు ఇచ్చాయి. ఈలోగా ఉక్రెయిన్‌లోని విలువైన ఖనిజాలున్న ప్రాంతాన్ని తమకు అప్పగించాలని అమెరికా రాయించుకొని ఒప్పందం చేసుకుంది. తర్వాత జరిగిన పరిణామాలను చూస్తే అసలు వాటికోసమే ట్రంప్ ఇంతనాటకం ఆడాడా అన్న సందేహాలు కలిగాయి. ఇప్పుడు ఉక్రెయిన్‌కు పెద్దమొత్తంలో కీలక ఆయుధాలు ఇచ్చేందుకు ఆమోదముద్ర వేశాడంటే పోరును మరింతగా కొనసాగించేందుకు పూనుకున్నాడన్నది తేటతెల్లమైంది. ఇలాంటి ఉన్మాదులను సభ్యసమాజం గట్టిగా వ్యతిరేకించాలి.

# నేతలు మారకుంటే కాంగ్రెస్‌కు కష్టాలే!



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పనితీరు పట్ల కేంద్ర నాయకత్వం సంతృప్తిగా లేదు. అధికారంలో ఉన్న రాష్ట్రంలో పార్టీ ఉండాల్సిన పద్ధతి, లక్షణాలు, సమన్వయం, కార్యశీలత తెలంగాణలో లోపించాయని అధిష్ఠానం తలపోస్తోంది. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే, చాలా తక్కువ సమయంలోనే కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణుల ఆదరణే కాకుండా ప్రజాదరణను కూడా పార్టీ కోల్పోవాల్సి వస్తుందని నాయకత్వం హెచ్చరించింది. వీలైనంత తొందరగా పనితీరు మార్చుకొని, పరిస్థితిని చక్కదిద్దుకోవాలని ఒకింత ఘాటుగానే రాష్ట్ర ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేసింది. పార్టీలో భిన్నవైఖరులు, విభిన్న స్వరాలు లేవని, అందరం ఒకే ఆలోచన, ఒకే లక్ష్యంతో సంఘటితంగా పనిచేస్తున్నామనే భావన కలిగించాలని ఆదేశించింది. పార్టీ నాయకులే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం, చర్యలు చేపట్టడాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్ని సమర్థంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలోపార్టీ క్రియాశీలంగా వ్యవహరించాలని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని పార్టీ అఖిల భారత అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్యనేతలకు ఉద్బోధించారు. పార్టీ 'రాజకీయ వ్యవహారాల సంఘం' (పిఎసి) సమావేశంలో, అంతరంగిక భేటీలో ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కెసి వేణుగోపాల్‌లు నుడివిన మాటల్ని, నిర్దిష్టంగా చేసిన వ్యాఖ్యల్ని విశ్లేషిస్తే అధిష్ఠానం అసంతృప్తి స్పష్టమవుతోంది. సుతిమెత్తని మందలింపే అయినా రాష్ట్ర నాయకులకు బోధపడేలా ఘాటైన సందేశమిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పిసిసి అధినేత మహేశ్ కుమార్ గౌడ్‌లను ఉద్దేశించి కూడా నిర్దిష్ట వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి మాటతీరు అధిష్ఠానానికి నచ్చనట్లే, పిసిసి పనితీరు ముఖ్యమంత్రికీ నచ్చట్లేదనే విషయం ఈ సందర్భంగా స్పష్టమైంది. పిసిసి అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం తర్వాత పది నెలలకు గాని పిసిసి రాష్ట్ర కార్యవర్గం రాలేదు.ఇటీవలే ఏర్పడ్డ రాష్ట్ర కార్యవర్గం ఇప్పుడిప్పుడే పని ప్రారంభించింది. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎవరేం మాట్లాడినా చెల్లుబాటవుతోందని, పిసిసి అధినేతకు ఆయా గొంతులపై ఎటువంటి నియంత్రణ లేదనే భావన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందని, ఆయన చేసినట్టు చెబుతున్న వ్యాఖ్యల్ని బట్టి తెలుస్తోంది. పిసిసి అధినేత, పార్టీ వ్యవస్థపై ఇంకా పట్టు సాధించాలని ఆయన కోరుకుంటున్నట్టుంది. తమ అధ్యక్షుడి పనితీరు 'భూమి కౌలుకిచ్చి ఇక ఏమీ పట్టించుకోని యజమాని' (ఆబ్సెంటీ ల్యాండ్ లార్డ్) లా ఉందని ఆయనొక వ్యాఖ్య చేసినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. తమ పార్టీ నాయకత్వంలో, ప్రభుత్వంలో పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కోవర్టులున్నారంటూ పార్టీ ఎంఎల్ఎ ఒకరు ఇటీవల చేసిన వ్యాఖ్య పార్టీలో దుమారమే రేపింది. ఒక ఎంఎల్ఎ, ప్రస్తుత ప్రభుత్వ నిర్వాకాలను, పరోక్షంగా కొందరు మంత్రుల అవినీతి అక్రమాలను ఎండగట్టడానికి సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద ఇప్పటికే డజన్‌కుపైగా దరఖాస్తుల్ని దాఖలు చేసినట్టు సమాచారం. నగరంలోని విలువైన ఒక భూదందాలో జరిగిన అక్రమాలపై తామే ఫిర్యాదు చేసినా ప్రభుత్వ శాఖలు గాని, 'హైడ్రా' వంటి ఏజెన్సీలు గానీ చర్యలు తీసుకోవట్లేదని ఆగ్రహించిన పార్టీ ఎంఎల్ఎలు కొందరు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) వేశారు. ఎంఎల్ఎలదే ఈ పరిస్థితి అయితే సామాన్యుల సంగతేమిటని పార్టీలోని వారే ప్రశ్నిస్తున్నారు. ఇవన్నీ స్థూలంగా పార్టీ పట్ల, ప్రభుత్వం పట్ల ప్రజల్లో దురభిప్రాయం కలిగిస్తాయని పార్టీ శ్రేయోభిలాషులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత ఫిర్యాదులు కొత్త కాదు. పీఠంపై ఎవరున్నా అసంతుష్టుల ఫిర్యాదులు వస్తుంటాయి. గిట్టని నాయకత్వంపైన సమ ఉజ్జీలు, కిందిస్థాయి వారు ఇలా ఎవరెవరో అధిష్టానానికి ఫిర్యాదులు చేయడం కాంగ్రెస్‌లో మామూలే! అన్ని ఫిర్యాదుల్ని అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోదు, వాటిని సదరు నాయకుల దృష్టికి తీసుకురాదు. నమ్మదగిన, సహేతుకమైన, నిర్దిష్ట ఆధారాలున్న ఫిర్యాదుల్ని మాత్రం నాయకత్వం అంత తేలిగ్గా తీసిపారేయదు. సందర్భం వచ్చినపుడు ఆయా నాయకుల్ని నేరుగా ప్రశ్నించి, విషయం ఏంటో తెలుసుకుంటుంది, అవసరమైతే తేల్చుకుంటుంది. తీరు మార్చుకోమని చెబుతుంది, సరిదిద్దుకోవడానికి ఒక అవకాశం ఇస్తుంది. లోగడ కెసిఆర్ సచివాలయానికి రాకుండా ఫామ్‌హౌజ్ నుండి పాలన సాగించారని విమర్శించిన కాంగ్రెస్ పార్టీలో కూడా ఇప్పుడు అవే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి కూడా సచివాలయానికి, కేబినెట్ సమావేశాలకు మాత్రమే వస్తూ, మిగతా సమావేశాలను బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే ఏర్పాటు చేస్తున్నారంటూ పార్టీ సీనియర్ నేతలు కొందరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. రాష్ట్ర పార్టీ అధినేత జిల్లాల పర్యటనల కన్నా విదేశాలు, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల పర్యటనలు పెరిగాయనే షికాయతులు కూడా పైస్థాయి వరకు వెళ్లాయి. ఉన్నప్పుడైనా గాంధీభవన్‌లో కుదురుగా కూర్చోరని, అంతకన్నా అధిక సమయం మంత్రు వద్దో, కార్పొరేషన్ చైర్మన్లతోనో, ఇతర కార్పొరేట్లతోనో గడుపుతారనే ఫిర్యాదులూ వచ్చినట్టు ఢిల్లీ పెద్దల మాటల్నిబట్టి స్పష్టమవుతోంది. 'మీ వ్యవహారం ఇలాగే కొనసాగితే, చివరకు మీ నెత్తినే కొబ్బరికాయ కొట్టే పరిస్థితి వస్తుంది' అని ఢిల్లీ పెద్ద పిసిసి అధినేతతోనే అన్నారంటే, ఫిర్యాదుల్ని అధిష్ఠానం ఎంత సీరియస్‌గా పరిగణిస్తోందో ఇట్టే అర్థమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసే కొన్ని వ్యాఖ్యలు, ఉపయోగించే భాషపట్ల తరచూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విపక్షంలో ఉన్నపుడు చెల్లుబాటయిందేమో కాని, 'సాక్షాత్తూ ముఖ్యమంత్రిగా ఉండి అలా మాట్లాడొచ్చా?' అన్నది ప్రజాక్షేత్రంలో చర్చ లేవనెత్తుతోంది. అవతలి వారిని విమర్శించేప్పుడు సిఎం వాడే భాష, చేసే విపరీత వ్యాఖ్యలు ముఖ్యమంత్రి హోదాను తగ్గించేవిగా ఉండటమే కాక ప్రత్యర్థులకు అయాచితంగా అస్త్రాలిచ్చినట్టవుతోందని స్వయంగా ఖర్గేనే తప్పుబట్టినట్టు తెలిసింది. ఖజానా ఖాళీ, అప్పు పుట్టట్లేదు వంటి నిస్పహాయపు మాటలు కూడా సరికాదని,అశోక్ సామ్రాట్‌ను ఉటంకిస్తూ ఓ మాట చెప్పారాయన. 'బుద్ధం శరణం గచ్ఛామి' అన్నది అశోకుడి నినాదమే అయినా, తప్పనపుడు ఆయన కళింగ యుద్ధానికీ సిద్ధమయ్యార'నే విషయాన్ని గుర్తు చేశారు. ఇంకో మాట కూడా చెప్పారు. 'ఎంతో కఠోర శ్రమ, దీక్షతో మీరు మీ ఆశయాన్ని నెరవేర్చుకొని ముఖ్యమంత్రి అయ్యారు, మరి కాంగ్రెస్ గెలుపుకోసం శ్రమపడిన పార్టీ ఇతర నాయకులు, కార్యకర్తల ఆశలు, ఆశయాలు, అభీష్టాలు కూడా నెరవేరాలి కదా? అందుకు ప్రభుత్వాధినేతగా మీరు, పార్టీ అధినేతగా పిసిసి చీఫ్ సహకరించాలి కదా?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా, ఆయన తననే ఒక ఉదాహరణగా చెప్పారు. 'ఈ వయసులో కూడా నేను ఎప్పుడూ నిరాశ, నిస్పృహల్ని దరిరానీయను, పార్టీకి, కార్యకర్తలకు ఏం చేయగలమనే ఆలోచిస్తాను' అని పేర్కొన్నారు. తాము ఇష్టపడని కొందరు సీనియర్లను రాజకీయ వ్యవహారాల సంఘం (పిఎసి)లో ఎదుర్కోవడం ఇష్టం లేకే, అటువంటి కొందరితో ఒక 'సలహా సంఘం' ఏర్పాటన్నది సిఎం, పిసిసి అధినేత కలిపి పన్నిన పన్నాగమని కూడా ఎవరో ఢిల్లీ నేతల చెవిన వేసినట్టు తెలుస్తోంది. వీటన్నిటి ప్రభావమా? తమకున్న సమాచారమా? తెలియదు కానీ, మంత్రివర్గ కూర్పు. వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం వంటి అంశాలతో సహా పలు విషయాల్లో ఢిల్లీ అధిష్ఠానం ముఖ్యమంత్రికి సంపూర్ణ స్వేచ్ఛ ఇస్తున్నట్టు లేదు. వర్కింగ్ ప్రెసిడెంట్ల పద్ధతికే ప్రస్తుతానికి తిలోదకాలిచ్చినట్టుంది. పార్టీ పనితీరు పైస్థాయిలో ఇలా ఉంటే క్షేత్రంలోనూ భిన్నంగా ఏమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న తరుణంలో 'పీపుల్స్ పల్స్' నిర్వహించిన 'ట్రాకర్ పోల్ సర్వే' గణాంకాలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో తప్ప మిగిలిన అన్ని ఉమ్మడి జిల్లాల్లోనూ కాంగ్రెస్ వెనుకబడే ఉంది. సగం మంది మంత్రుల నియోజకవర్గాల్లో మెజారిటీ మండలాల్లో ప్రత్యర్థి పార్టీలదే ఆధిక్యత కనిపిస్తోంది. పైన కుదుటపడితే తప్ప కింది స్థాయిలో పార్టీ కుదురుకునే వాతావరణం లేదు.

## మీరు పట్టించుకోరు.. వైఎస్ జగన్ వెళ్తే ఏడుస్తారు!



**అమరావతి,:** రాష్ట్రంలో రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గిట్టుబాటు ఇవ్వడం లేదని వైసీపీ మాజీమంత్రి పేర్ని నాని మండిపడ్డారు. రైతుల వద్దకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెళ్తే ఏడుస్తారు అని కూటమి ప్రభుత్వంను విమర్శించారు. ఏపీలో రైతుల పరిస్థితులు దయనీయంగా ఉండటం సమాజానికి విచారకరం అని పేర్కొన్నారు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా కూటమి ప్రభుత్వ వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి జగన్ గారిని తిట్టడానికి తప్ప ఎక్కడైనా తిరిగారా? అని పేర్ని నాని ప్రశ్నించారు. శుక్రవారం అమరావతిలో మాజీమంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో రైతుల పరిస్థితులు దయనీయంగా ఉండటం సమాజానికి విచారకరం. ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, కోకో.. తాజాగా మామిడి పంటలు పండుతున్న రైతుల కడగండ్లు ప్రభుత్వానికి కనిపించటం లేదు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా కూటమి ప్రభుత్వ వ్యవహారం. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అర్థం ఏంటి?. ముందు నుంచి ఒకరు.. వెనుక నుంచి మరొకరు కోస్తారని అర్థమా?. రైతుల గోడు పట్టించుకునే నాథుడు లేడు. వ్యవసాయ శాఖ మంత్రి జగన్‌ను తిట్టడానికి తప్ప ఎక్కడైనా తిరిగారా?. హామీలు ఇచ్చిన మూడు పార్టీల్లో ఇద్దరు అవునంటారు.. మరొకరు తెలియదు అంటారు. వ్యవసాయ శాఖ మంత్రి రైతుల బాధలు పట్టించుకుంటున్నారా?. మిర్చి, పొగాకు రైతుల బాధలు చూడటానికి వెళ్తే సినిమా సెట్టింగుల యాత్రలు అంటారు. జగన్ వెళ్తుంటే విమర్శిస్తారు.. మీరు వెళ్ళి చూస్తుంటారు. మిర్చి యార్డు ఉన్న కేంద్ర మంత్రి రైతుల కోసం వెళ్లారా?. ఒక్క ఎమ్మెల్యే అయినా రైతుల కోసం వెళ్లారా?. మీరు పట్టించుకోరు, రైతులకు గిట్టుబాటు ఇవ్వరు.. జగన్ వెళ్తే ఏడుస్తారు' అని పేర్ని నాని మండిపడ్డారు. 'పొగాకు రైతుల కోసం జగన్ వెళ్తే ఒక 20 మంది పచ్చ మూకలను పంపిస్తారు. వాళ్లకు డబ్బులు ఇచ్చి పంపిస్తారు. మీ టీవీ డిబేట్లలో డబ్బులు ఇచ్చి జగన్‌ను తిట్టిస్తారు. జగన్‌ను తిట్టకుండా ఒక్క డిబేట్ ఉంటుందా?. మీరు వచ్చినప్పటి నుంచి చేసిందేమీ లేదు కాబట్టి.. జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. ఉదయం, సాయంత్రం మీ వ్యాపారం మొత్తం జగన్ మీదే కదా. ఇవాళ మామిడి రైతుల గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. జగన్ పర్యటనకు హెలెక్రాఫ్టర్కు పర్మిషన్ ఇవ్వరు. తప్పుడు మాటలు.. విష ప్రచారం.. అసత్యాలు మాట్లాడుతున్నారు. జగన్ బంగారుపాళ్యం వెళ్తున్నారని కేబినెట్లో తీర్మానం చేస్తారు. వీళ్లకు అబద్ధాల ప్రచారం తప్ప మరొకటి లేదు. 9వ తేదీ జగన్ వెళ్ళగానే 260 కోట్లు విడుదల చేశామన్నారు.. జీవో వచ్చిందా. ఎవరికైనా సమాచారం ఉందా?. ఒక్క మామిడి రైతుకన్నా న్యాయం చేశారా. రైతు కష్టం గురించి తెలియని వాళ్ళు.. విచిత్రమైన వ్యవసాయ శాఖ మంత్రి 80 శాతం కొనేసాము అంటారు. మరో మంత్రి 90 శాతం కొన్నారని అంటారు.. ఎవరిది నిజం' అని పేర్ని నాని ఫైర్ అయ్యారు. 'జగన్ వెళ్తున్నారని.. వాడు, వీడు అంటున్నాడు. మిమ్మల్ని వాడు, వీడు అనలేమా. జగన్ ఎప్పుడు కూడా వాడు, వీడు అని శత్రువుల గురించి కూడా మాట్లాడరు. అమ్మఒడి అందరికీ వేశామని చెప్పారు.. లక్ష మందికి అయినా 13 వేలు పడ్డాయా. ఈ దిక్కుమాలిన ప్రభుత్వం దగ్గరి నుంచి ఎలా వంచించాలో నేర్చుకోవాలి. 6.50 లక్షల టన్నుల పంట పండింది. 80 శాతం కొన్నామని వ్యవసాయ శాఖ మంత్రి.. 90 శాతం కొన్నామని సివిల్ సప్లై మంత్రి చెబుతారు. కలెక్టర్ మాత్రం 67 శాతం అని చెప్పారు. ఒక్క రైతు దగ్గరకు వెళ్లని వ్యవసాయ మంత్రి 80 శాతం కొనేసామని చెప్పారు.. సివిల్ సప్లై మంత్రి 90 శాతం అంటారు. మీ అబద్ధాలకు పోయే కాలం రాదా. ఫైనాన్స్ కాన్కరెన్స్ లేకుండా జీవో ఫైల్ జెనరేట్ చేశారు. ఏమీ చేయకుండా మమ అనేశారు' అని పేర్ని నాని విమర్శించారు.ద

## మాటలు అందరూ చెప్పారు..
## చేసి చూపించింది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి..!





**హైదరాబాద్, :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిను ప్రశంసలతో ముంచెత్తారు. ఇది రాజకీయ నిర్ణయం కాదని, సామాజికంగా గొప్ప మార్పునకు నాంది అని అభివర్ణించారు. అలాగే, ఇవ్వాళ నాకు చాలా గర్వంగా ఉంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రజలందరికీ గర్వపడే రోజులు ఇవి అని రేణుకా పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సామాజిక న్యాయం సాధ్యమవుతోందని తెలిపారు. ఎవరెవరో మాటలు చెప్పారు కానీ.. చేసి చూపించింది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఆమె స్పష్టం చేశారు. గురువారం జరిగిన కేబినెట్ తీసుకున్న 42% బీసీ రిజర్వేషన్ నిర్ణయం వల్ల వారికి రాజకీయాల్లోనే కాదు.. ఉద్యోగాల్లోనూ మెరుగైన అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఒక్క సంతకంతో మహిళల జీవితాలను మార్చారు. ఆయన తీసుకున్న నిర్ణయాలతో భర్తలు కూడా గౌరవం చూపించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ హయంలో బీసీలకు చరిత్ర సృష్టించే నిర్ణయం తీసుకున్నారు. 42 శాతం రిజర్వేషన్ దేశానికే మార్గదర్శిగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ నిర్ణయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. నాకు దేశవ్యాప్తంగా మెసేజ్‌లు వస్తున్నాయి. ప్రజలు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. న్యాయం చేయగలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని రేణుకా చౌదరి అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీపై ఆమె విమర్శలు గుప్పించారు. వాళ్లు పూటకోసారి పార్టీ పేరు మారుస్తుంటారు. కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలి.. ఎందుకంటే వాళ్లు అలాగే ఉన్నప్పుడు మేము అధికారంలో ఉంటాం. బీఆర్ఎస్‌లో గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్సీ కవిత గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని వ్యాఖ్యానించారు. ఇన్ని సంవత్సరాలు నాయకులు చెప్పినవి సొల్లు కబుర్లే.. కానీ ఇప్పుడు రాష్ట్రానికి అసలైన సీఎం లభించడమే గొప్ప విషయం. రేవంత్ రెడ్డి చేసిన నిర్ణయం దేశానికి మార్గం చూపుతుంది. చేతి గుర్తు అన్నది దేశాన్ని ముందుకు నడిపే సత్తా ఉన్న చిహ్నం అని అన్నారు.

## హిందీని ప్రేమిద్దాం.. మన దిగా భావిద్దాం..
## పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు



**అమరావతి,:** హిందీ భాషపై ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం.. బలవంతంగా.. రాష్ట్రాలపై హిందీని రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి.. అయితే, ఈ తరుణంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. హైదరాబాద్‌లో నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొని హిందీ వివస్ శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. హిందీని ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అని వ్యాఖ్యానించారు.. మన దేశం వివిధ సంస్కృతులు ఉంటాయి.. అందరినీ హిందీ ఒక కామన్ భాషగా కలుపుతుందన్నారు.. విదేశస్తులు మన భాష నేర్చుకుంటారు.. మనం హిందీ అంటే ఎందుకు భయపడాలి..? అని ప్రశ్నించారు. హిందీ జబర్దస్త్ వస్తువు ఏమీ కాదు.. జర్మనీ, ఇతర భాషలు నేర్చుకుంటున్నాం.. కానీ, హిందీతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.. హిందీ మనది అనడంలో సిగ్గు ఎందుకు..? హిందీ నీ ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అన్నారు పవన్ కల్యాణ్.. బెంగాలీ గీతం జాతీయ గీతం అయింది.. అబ్దుల్ కలాం మిస్సైల్ మన్ అయ్యారు.. దక్షిణ భారత దేశస్తుడు చేసిన జెండా భారత జెండా అయింది.. ప్రతీ భాష జీవ భాష.. రాష్ట్ర భాష హిందీ.. రాష్ట్ర భాష హిందీని స్వాగతిస్తున్నారు.. మాతృ భాష మన అమ్మ భాష అయితే.. పెద్దమ్మ భాష హిందీగా అభివర్ణించారు.. హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని పరిమితం చేయడమే అవుతుందన్నారు పవన్ కల్యాణ్.. ఉర్దూను, పర్షియన్ ను అంగీకరించి.. హిందీని వ్యతిరేకించడం అవివేకం అవుతుందన్ఆనరు.. 31 శాతం సినిమాలు హిందీ లో డబ్ అవుతున్నాయి.. వ్యాపారానికి హిందీ కావాలి.. కానీ, నేర్చుకోవడానికి అభ్యంతరం ఎందుకు? అని నిలదీశారు పవన్ కల్యాణ్..


## పెరుగుతున్న షార్ట్-ఫామ్ వీడియోల వ్యసనం

### 'స్వ'యంకృతం
### జూదం, మాదకద్రవ్య వినియోగంతో సమానమే
### ఆర్థిక నష్టాన్ని కూడా పట్టించుకోని మానసిక స్థితి.. క్రమంగా మెదడు కూడా 'దారి తప్పే' ప్రమాదం

రీల్స్, షార్ట్స్ చూడందే పొద్దు గడవని రోజులు వచ్చేశాయి. ఎక్కడ చూడండి, ఎవరిని చూడండి, ఎప్పుడు చూడండి.. వీటిలోనే లీనమైపోయి కనిపిస్తుంటారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలకు అతుక్కుపోతున్నారు. ఒకసారి ఈ రీల్స్ లేదా షార్ట్స్ ప్రపంచంలోకి వెళ్లామంటే.. వరుసపెట్టి ఎన్ని చూస్తామో మనకే తెలీదు. ఈ షార్ట్ వీడియోలు మనల్ని ఎందుకు ఇంతలా కట్టిపడేస్తున్నాయి? ఎందుకంటే అవి మనల్ని నవ్విస్తాయి. కవ్విస్తాయి. కబుర్లు చెబుతాయి. చాలావాటిలో మన చుట్టుపక్కల వాళ్లే కనిపిస్తారు. అన్నిటినీ మించి – సెకన్లలో, నిమిషాల్లో కొద్దిపాటి నిడివితో ముగుస్తాయి. ఒకప్పుడు కాలక్షేపంతో మొదలైన ఈ వీక్షణ ఇప్పుడు ఓ వ్యసనంలా మారింది. స్వ.. షార్ట్ వీడియోల వ్యసనం (ఎస్‌వీఏ) అని పిలిచే ఈ వ్యసనం వల్ల మన మెదడు పనితీరే మారిపోయే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం ఒకటి బాంబును పేల్చింది. రీల్స్, షార్ట్స్, వగైరాలను చూసే అలవాటు కనుక మితిమీరితే మెదడులోని 'రీవైరింగ్' ప్రక్రియ గతి తప్పి మనిషి మనస్తత్వంలో ప్రతికూల మార్పులు సంభవించే అవకాశం ఉందని తాజా అధ్యయనం హెచ్చరించింది. సుప్రసిద్ధ సైన్స్ జర్నల్ 'న్యూరోఇమేజ్'లో వచ్చిన ఈ పరిశోధనా వ్యాసం ప్రధానంగా షార్ట్-ఫామ్ వీడియోల వ్యసనం (ఎస్‌వీఏ – స్వ) వల్ల ప్రవర్తనల్లోని పెను మార్పుల గురించి చర్చించింది. 'స్వ' మెదడు కార్యకలాపాలను తారుమారు చేయగలదని, వాటికి అలవాటు పడిన వారిని మరింత ఉద్వేగభరితంగా, ఆర్థిక నష్టాలను సైతం పట్టించుకోనంతగా మొద్దుబారేలా చేస్తుందని ఈ కొత్త బ్రెయిన్ ఇమేజింగ్ అధ్యయనం వెల్లడించింది. అంతేకాదు, ఇలాంటివారు తొందర పడి తక్షణ నిర్ణయాలు తీసుకుంటారని, ఆ నిర్ణయ దుష్ఫలితాల పట్ల కూడా అవసరమైన స్పందన చూపించరని పేర్కొంది. తద్వారా వ్యక్తిగతంగా, వృత్తిలోనూ వారి అభివృద్ధి కుంటు పడుతుందని తెలిపింది.

### మెదడు దారి తప్పుతోంది..

'స్వ' అన్నది జూదం, మాదకద్రవ్య వినియోగం వంటి వ్యసనాల కంటే తక్కువేమీ కాదని తెలిపింది. ఈ రెండు రకాలైన వ్యసనాల్లోనూ వ్యక్తులు దీర్ఘకాలిక పరిణామాలను విస్మరించి, తక్షణ ప్రయోజనాలకే



ప్రాధాన్యం ఇస్తారని అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా – నిర్ణయాలు తీసుకోవటానికి, నియమాలను పాటించటానికి కారణమయ్యే మెదడులోని ప్రదేశాలు తమ తీరు మార్చుకుని దారి తప్పుతున్నట్లు అధ్యయనం కనిపెట్టింది.

### ఊబిలాంటివి

షార్ట్-ఫామ్ వీడియోలు ఊటబావుల వంటివి. స్క్రోలింగ్ చేయటానికి ఓపిక ఉండాలే కానీ వాటిల్లో అంతులేని కంటెంట్ ఉంటుంది. ఆ కంటెంట్ కూడా మనకు నచ్చేలా, మనకు సంబంధించిన విషయమని అనిపించేలా ఉంటుంది. వాటి వల్ల తక్షణ మానసిక సంతృప్తి లభిస్తుంది. అదొక తీరని దాహం అవుతుంది. దీంతో మెదడు ఒత్తిడికి గురై, మెదడు 'రీవైరింగ్' పని తీరులో మార్పులు సంభవిస్తాయి. పర్యవసానంగా ప్రమాదాలను పసిగట్టే, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. 'చివరికి అది ఎంతవరకు దారి తీస్తుందంటే – బతుకు బండిని నడిపించే డబ్బు విషయాల్లో జరిగిన నష్టాన్ని కూడా పెద్దగా పట్టించుకోరు' అని అధ్యయనం తెలిపింది.

### మెదడు 'రీవైరింగ్' అంటే?

రీవైరింగ్‌నే మెదడు పునఃశిక్షణ, న్యూరోప్లాస్టిసిటీ అని కూడా అంటారు. మెదడు నిరంతరం, జీవితాంతం కొత్త నాడీ సంబంధాలను ఏర్పరచుకుంటూ ఉంటుంది. ఆ విధంగా తన పునర్వ్యవస్థీకరణ సామర్థ్యాన్ని వినియోగించుకుంటుంది. మనిషి తన అనుభవాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటానికి, గాయాల నుంచి కోలుకోవటానికిబీ అలవాట్లను, ఆలోచనా విధానాలను మార్చుకోవటానికి అనుమతిస్తుంది. అయితే షార్ట్-ఫామ్ రీల్స్‌ను అదేపనిగా చూసే అలవాటు మెదడు ఇలా రీవైరింగ్ చేసుకోవటాన్ని నిరోధిస్తుందని తాజా అధ్యయనం చెబుతోంది.

### నిద్రలేమి... నిరాశ నిస్పృహలు

'స్వ'.. మొత్తం ప్రపంచ ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమించింది. తాజాగా అధ్యయనం జరిగిన చైనాలో వినియోగదారులు సగటున రోజుకు 151 నిమిషాలు ఈ వీడియోలనే చూస్తూ గడుపుతున్నారు. దాదాపు 95.5 శాతం మంది ఇంటర్నెట్ యూజర్లు వీటిలోనే నిమగ్నమై ఉంటున్నారు. ఈ తీవ్రత.. ఏకాగ్రత, నిద్ర, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, నిరాశా నిస్పృహలను దరిచేర్చే ప్రమాదం ఉందని చైనాలోని టియాంజిన్ నార్మల్ విశ్వవిద్యాలయం సైకాలజీ ప్రొఫెసర్, అధ్యయన కర్త కియాంగ్ వాంగ్ అంటున్నారు.

### ఎందుకు స్పందించడం లేదు?

ముఖ్యంగా, 'స్వ' ఉన్నవారిలో ఆర్థిక నష్టాల పట్ల పట్టింపు ఎందుకు ఉండటం లేదో కనుగొనాలని పరిశోధనా బృందం ప్రయత్నించింది. లాభాల కంటే నష్టాలకు ఎక్కువగా స్పందించే ధోరణిని.. నిర్ణయం తీసుకోవడంలో ముందు జాగ్రత్త లక్షణంగా పరిగణిస్తారు. ఈ లక్షణం ప్రమాదకర ప్రవర్తనను నివారించడానికి సహాయపడుతుంది. జూదం, మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలైన వారు తమ ఆర్థిక నష్టాల పట్ల కాస్తయినా స్పందనను చూపుతుండగా, షార్ట్-ఫామ్ వీడియో వ్యసనంలో ఇందుకు భిన్నంగా ఉండటానికి కారణాన్ని మాత్రం అధ్యయం కచ్చితంగా తేల్చలేకపోయింది. దానిని కనిపెట్టటానికి వారు ఈ రెండు రకాల వ్యసనాల కంప్యూటేషనల్ మోడలింగ్ (డీడీఎం), న్యూరోఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)లను ఆశ్రయించారు. కారణాల కోసం అన్వేషిస్తున్నారు.

### యువతపై తీవ్ర ప్రభావం

ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇండియన్ సైకాలజీ గతంలో నిర్వహించిన అధ్యయనంలో యుక్త, మధ్య వయస్కుల్లో.. షార్ట్స్, రీల్స్ చూడటం వల్ల ఒక పని మీద ధ్యాస, శ్రద్ధ ఉండకపోవడం గమనించారు. ముఖ్యంగా రకరకాల అంశాలకు సంబంధించిన చాలా స్వల్ప వ్యవధి వీడియోలు మార్చి మార్చి చూడటం వల్ల... యువత ఒక సమయంలో ఒకే పనిమీద పూర్తి శ్రద్ధ పెట్టలేకపోతున్నారని తేలింది. దేశంలోని నెట్ వినియోగదారుల్లో 80 శాతానికిపైగా షార్ట్ ఫామ్ వీడియోలు రోజూ వీక్షిస్తున్నారు. ఇండియాలో నెట్ యూజర్లు రోజుకు గంటకుపైగానే షార్ట్-ఫామ్ వీడియోలు చూస్తున్నారని ఒక అంచనా.

## సహజ వనరుల లైఫ్‌'లైన్'!

### ప్రపంచాన్ని చుడుతున్న చమురు, గ్యాస్ పైప్‌లైన్స్
### అత్యంత పొడవైన ఎల్‌పీజీ పైప్‌లైన్ నిర్మిస్తున్న భారత్




'దేశ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. చమురు కంపెనీల దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయి. వివిధ మార్గాల ద్వారా ఇంధన సరఫరాలు నిరంతరాయంగా అందుతున్నాయి. హోర్ముజ్ మార్గం బందైనా భారత్‌కి ఇబ్బంది లేదు. వేరే మార్గాల్లో భారత్‌కు క్రూడాయిల్ వస్తుంది' – ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం, హోర్ముజ్ మార్గం మూసేస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి ఇటీవల చెప్పిన మాటలివి. ఆయన చెప్పింది నిజమే. ఇప్పటికే మనదేశం ప్రపంచంలోనే అతిపొడవైన ఎల్‌పీజీ పైప్‌లైన్ ప్రాజెక్టు నిర్మిస్తోంది. ఇలాంటి పైప్‌లైన్లే ప్రపంచ దేశాలకు చమురు, సహజ వాయువుల వంటి ఇంధనాలు అందిస్తున్న ప్రాణవాయువులు. ఈ పైప్‌లైన్లు ప్రపంచ దేశాలను చుడుతూ భారీగా విస్తరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎన్ని కిలోమీటర్ల పొడవుతో గ్యాస్ పైప్‌లైన్ అందుబాటులో ఉందో తెలుసా? 14.2 లక్షల కిలోమీటర్లు. అంటే భూమిని 35సార్లు చుట్టొచ్చన్న మాట. లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్ జీ) పైప్‌లైన్ల సామర్థ్యం 5 బిలియన్ (500 కోట్ల) టన్నులు. అలాగే చమురును సరఫరా చేసే పైప్‌లైన్ల పొడవు 5,04,000 కిలోమీటర్లు. చమురు, సహజ వాయువు.. ప్రపంచాన్ని నడిపిస్తున్న సహజ ఇంధన వనరులు ఇవి. ఆర్థిక వ్యవస్థ రథచక్రాలివి. ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వం, సమర్థవంతమైన వనరుల పంపిణీకి చమురు, సహజ వాయువు పైప్‌లైన్లు కీలకమైనవి. 'అన్నింటా మనం' అన్నట్టు చమురు, సహజ వాయువు రంగంలో భారత్ సైతం తనదైన ముద్రవేస్తోంది. ప్రపంచంలో అతిపొడవైన లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) పైప్‌లైన్ ప్రాజెక్టుకు మన దేశం శ్రీకారం చుట్టింది.

### టాప్-5లో గెయిల్

గ్యాస్ సరఫరా కోసం చైనాలో 21.9 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో 17,800 కిలోమీటర్లు, భారత్‌లో 20.7 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో 14,300 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోంది. ప్రపంచంలో ఇతర అన్ని దేశాల్లో అభివృద్ధి దశలో ఉన్న మొత్తం పైప్‌లైన్ కంటే ఈ రెండు దేశాలు నిర్మిస్తున్నవే అధికం కావడం విశేషం. గ్యాస్ పైప్‌లైన్లను అభివృద్ధి చేస్తున్న టాప్-5 మాతృ సంస్థలు ప్రభుత్వ రంగానికి చెందినవి కావడం విశేషం. రష్యాలో గ్యాస్‌ప్రామ్, చైనా-పైప్‌చైనా, భారత్-గెయిల్, నైజీరియా-ఎన్ ఎన్ పీసీ, ఇరాన్ లో చమురు మంత్రిత్వ శాఖ వీటిలో ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న అత్యంత పొడవైన గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టులు 2,775 కిలోమీటర్ల ఇరాన్-పాకిస్తాన్ పైప్‌లైన్, అలాగే భారత్‌లో 2,655 కిలోమీటర్ల జగదీష్‌పూర్-హల్దియా-బొకారో-ధమ్రా సహజ వాయువు పైప్‌లైన్. నిర్మాణంలో ఉన్న అతి పొడవైన చమురు పైప్‌లైన్ ప్రాజెక్టుల్లో ఆఫ్రికాలోని చైనా నేషనల్ పెట్రోలియం కార్పొరేషన్ యాజమాన్యంలోని 1,950 కిలోమీటర్ల నైజర్-బెనిన్ ఆయిల్ పైప్‌లైన్, భారత్‌లో నుమాలిఘర్ రిఫైనరీ లిమిటెడ్‌కు చెందిన 1.635 కిలోమీటర్ల పారాదీప్ నుమాలిఘర్ క్రూడ్ పైప్‌లైన్ (పీఎన్ సీపీఎల్) టాప్-2లో నిలిచాయి.

### అగ్రదేశాల సరసన మనమూ..

అమెరికాకు చెందిన ప్రముఖ ఇంధన రంగ విశ్లేషణ సంస్థ 'గ్లోబల్ ఎనర్జీ మానిటర్' గణాంకాల ప్రకారం అంతర్జాతీయంగా 59,100 కిలోమీటర్ల గ్యాస్ సరఫరా పైప్‌లైన్స్ నిర్మాణంలో ఉన్నాయి. మరో 1,51,300 కిలోమీటర్ల పైప్‌లైన్ ప్రాజెక్టులు ప్రతిపాదన దశలో ఉన్నాయి. వీటన్నింటి అంచనా వ్యయం 533.6 బిలియన్ డాలర్లు. అభివృద్ధి చేస్తున్న పైప్‌లైన్ల పరంగా చైనా, రష్యా, భారత్, ఆస్ట్రేలియా, యూఎస్ ముందున్నాయి. చమురు సరఫరా కోసం 9,100 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణంలో ఉంది. మరో 21,900 కిలోమీటర్ల ప్రాజెక్టులకు ప్రతిపాదనలు ఉన్నాయి. 2023 మే నాటికి 25.3 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్న మొత్తం చమురు సరఫరా పైప్‌లైన్స్లో 49 శాతం ఆఫ్రికా, మధ్యప్రాచ్యంలో విస్తరించాయి. ఈ ప్రాంతాలు 4,400 కిలోమీటర్ల ముడి చమురు సరఫరా పైప్‌లైన్లను నిర్మిస్తున్నాయి. అలాగే 10,800 కిలోమీటర్ల ప్రాజెక్టులు ప్రతిపాదనలో ఉన్నాయి.

### 2,800 కి.మీ. పొడవు!

ప్రపంచంలో అతిపొడవైన ఎల్‌పీజీ పైప్‌లైన్ ప్రాజెక్టును భారత్ చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వ రంగ సంస్థలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఇండియన్ ఆయిల్ సంయుక్తంగా ఐహెచ్‌బీఎల్ పేరుతో సంయుక్త భాగస్వామ్య కంపెనీని ఏర్పాటు చేశాయి. ప్రాజెక్టు కోసం 1.3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారు. 2,800 కిలోమీటర్ల పొడవైన ఈ పైప్‌లైన్ ప్రాజెక్టులో గుజరాత్‌లోని కాండ్లను ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌తో అనుసంధానిస్తారు. ఏటా 83 లక్షల టన్నుల ఎల్పీజీని రవాణా చేయగల సామర్థ్యం దీని సొంతం. ఇది దేశ మొత్తం ఎల్పీజీ డిమాండ్‌లో 25 శాతం.

## చైనాలో ప్రాణాంతక మైనింగ్

### విచ్చలవిడిగా రేర్ ఎర్త్ మినరల్స్ తవ్వకాలు
### గాలి, నీరు, భూమి విషతుల్యం
### లాభాల వేటలో కంపెనీలు.. రోగాల బారిన జనం

అత్యంత అరుదైన ఖనిజాలు(రేర్ ఎర్త్ మినరల్స్)... రెండు అగ్రరాజ్యాలైన అమెరికా, చైనా మధ్య వాణిజ్య వివాదానికి దారితీస్తున్న అంశమిది. తమకు తక్కువ ధరకే ఈ ఖనిజాలు సరఫరా చేయాలని చేయాలని అమెరికా డిమాండ్ చేస్తుండగా, డ్రాగన్ దేశం అందుకు ఒప్పుకోవడం లేదు. ఎంతో అరుదైన, విలువైన ఈ ఖనిజాలు చైనా గడ్డపై ఉండడం, అవి తమకు సులువుగా దక్కకపోవడం సహజంగానే అమెరికాకు రుచించడం లేదు. అందుకే చైనాపై ఒత్తిడి పెంచుతూనే ఉంది. రాజకీయంగా, ఆర్థికంగా అమెరికాను చైనా బహిరంగంగా ధిక్కరిస్తోంది అంటే అందుకు కారణం ఈ ఖనిజాలే అనే చెప్పొచ్చు. ఆధునిక యుగంలో స్మార్ట్‌ఫోన్లు, బ్లూటూత్ స్పీకర్లు, కంప్యూటర్లు, టీవీ స్క్రీన్లు, ఎలక్ట్రిక్ వాహనాలతోపాటు సోలార్ ప్యానెళ్లు, ఎంఆర్ఐ మిషన్లు, జెట్ ఇంజన్లు, విద్యుత్ పరికరాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ వాడకం తప్పనిసరిగా మారింది. ఇదే ఇప్పుడు చైనా పంట పండిస్తోంది. ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న ఈ ఖనిజాల్లో సగానికిపైగా చైనా నుంచే వస్తున్నాయి. అరుదైన ఖనిజాల మైనింగ్, శుద్ధి, ఎగుమతుల విషయంలో చైనా మొదటి స్థానంలో నిలుస్తోంది. ఇదంతా నాణేనికి ఒకవైపే. మరోవైపు ఏముందో చూస్తే...

### నీరు, భూమి కలుషితం

చైనాలో ఉత్తరాన ఉన్న ఇన్నర్ మంగోలియా ప్రాంతంలోని బయాన్ ఓబో, దక్షిణాన జియాంగ్‌జీ ప్రావిన్స్‌లోని గాంగ్‌ఝౌలో రేర్ ఎర్త్ ఖనిజాల గనులున్నాయి. ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగా తవ్వకాలు సాగుతున్నాయి. భారీ యంత్రాలు, వాహనాల రొదతో అవి నిత్యం దద్దరిల్లుతుంటాయి. పొరలు పొరలుగా భూమిని పెకిలించి వేస్తున్నారు. బడా కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలతోపాటు



ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపిస్తున్న గనులు స్థానికులకు మాత్రం నరకానికి నకలుగా మారిపోయాయి. పచ్చని మైదానాలు మసిబారిపోయాయి. గడ్డి భూములు ప్రమాదకరమైన దుమ్ము ధూళితో నిండిపోయాయి. లోతైన గనుల నుంచి దట్టమైన దుమ్ము మేఘాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. భూమాతకు గాయాలవుతూనే ఉన్నాయి. గాలి, నీరు, భూమి దారుణంగా కలుషితం అవుతున్నాయి.

### చట్టవిరుద్ధంగా తవ్వకాలు

గనుల నుంచి వెలువడే రేడియోయాక్టివ్ బురదను నిల్వ చేయడానికే సమీపంలో కృత్రిమంగా సరస్సులు నిర్మించారు. కాలుష్యం కారణంగా స్థానికులు రోగాల బారినపడుతున్నారు. పెద్దలకు క్యాన్సర్లతోపాటు శిశువులకు పుట్టుకతో లోపాలు పరిపాటిగా మారాయి. ఇదంతా బాహ్య ప్రపంచానికి తెలియకుండా చైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. అపరిచితులను గనుల వైపు అనుమతించడం లేదు. మైనింగ్ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేస్తున్నామని అధికారులు చెబుతున్నా అందులో వాస్తవం లేదని నిపుణులు అంటున్నారు. గనుల తవ్వకంతో వెలువడే మట్టి, బురదలో ప్రాణాంతకమైన భార లోహాలు, రేడియోయాక్టివ్ అవశేషాలు ఉంటున్నాయి. టన్నుల కొద్దీ అమ్మోనియం సల్ఫేట్, అమ్మోనియం క్లోరైడ్‌తోపాటు ఇతర రసాయనాలు భూ ఉపరితలంపై పేరుకుపోతున్నాయి. చైనాలో వేలాది మైనింగ్ సైట్లు ఉన్నాయి. వీటిలో చట్టవిరుద్ధమైనవే ఎక్కువ. ఒక చోట తవ్వకానికి అనుమతులు తీసుకొని మరికొన్ని చోట్ల అక్రమంగా మైనింగ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గనుల నియంత్రణకు ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. మైనింగ్ లైసెన్స్‌ల సంఖ్య తగ్గించింది. అయినప్పటికీ అక్రమ గనులు సంఖ్య పెరిగిపోతోంది తప్ప తగ్గడం లేదు. కేవలం ఒక టన్ను ఖనిజాలు కావాలంటే ఏకంగా 2,000 టన్నుల మట్టిని తవ్వాల్సి ఉంటుంది.

### గ్రామాలకు గ్రామాలే ఖాళీ

గనుల వల్ల జరగాల్సిన నష్టం చాలావరకు ఇప్పటికే జరిగిపోయింది. మైనింగ్ ప్రాంతాల్లో అడవులు అంతరించిపోయాయి. భూముల్లో గోతులే మిగిలాయి. నదులు, పంట పొలాలు పనికిరాకుండా పోయాయి. భూగర్భ జలాలు సైతం విషతుల్యంగా మారుతున్నాయి. ఒక విధానం అంటూ లేకుండా తవ్వకాలు సాగిస్తుండడంతో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. మైనింగ్ కంపెనీలు రైతుల పొలాలను కూడా వదలిపెట్టడం లేదు. వారు ఎంత మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం. బడా కంపెనీలపై చట్టపరంగా కోర్టుల్లో పోరాడే శక్తి లేక మిన్నకుండిపోతున్నారు. కొన్నిచోట్ల గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయి. మరోవైపు గనుల తవ్వకం ఆపాల్సిందేనని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రభాత సూర్యుడు

## సంపాదకీయం

## మావోయిస్టుల గమ్యం, గమనం!

### (విశ్లేషణ)

'అవును. వాళ్ళు మరణిస్తారు. వీళ్ళంటున్న ఈ ఆఖరి యుద్ధంలో చిట్టచివరి వీరుడూ నేలకొరిగాక ఎప్పుడో చేసుకున్న ఒప్పందాల దస్త్రాలు దుమ్ము దులిపి బయటకు తీస్తారు. ఆదివాసుల్ని వాళ్ళ నేలనుండే బహిష్కరిస్తారు. వెళ్ళని వాళ్ళని ఎప్పటిలానే, చరిత్ర పొడుగుతా జరిగినట్లుగానే గూడేలకు గూడేలు తగలబెడతారు. ఈ మారణకాండను చూసిన చెట్లు ఎక్కడ సాక్ష్యం చెబుతాయోనని వేర్లతోసహా పెకలించివేస్తారు. ముక్కలై మాంసంలో కలిసి ఎగుమతైన స్పార్టకస్ అంశతో ఎవడో పుడతాడు. భగత్ సింగ్ పక్కింట్లో పుడతాడు. నల్లా ఆదిరెడ్డో, నంబాల కేశవరావో ఎవడో ఒకడు. స్వర్ణక్కో, రేణుకో, పద్మో ఎవరో ఒకరు. మళ్ళీ వచ్చార్రా%ొ% వీళ్ళది పోరాటమంటే.. అని నలుగురం కూడి చీర్స్ చెప్పుకుంటూ వాళ్ళ పోరాటాన్ని మాట్లాడుకుందాం. తల ఉందంటే తెగి పడుతుంది. వెన్నెముక నిటారుగా ఉంటే విరిగిపోతుంది' అని మావోయిస్టు పార్టీ అభిమాని ఒకరు మే 22 న సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టాడు. కాగా 'ఒక అధ్యాయం ఇక ముగిసినట్లే.నూతన అధ్యాయం ఎలా ఉంటుందో కాలమే సమాధానం చెబుతుంది' అని ఒక మాజీ మావోయిస్టు పార్టీ నాయకుడు ఒకరు అన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్ కౌంటర్ వార్త గుప్పుమనగానే ఆయన తక్షణ స్పందన ఇది! 'భారత సైనిక బలగాలు అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో మావోయిస్టులపై పైచేయి సాధించవచ్చు కానీ, వాళ్ళు ప్రజల్ని జయించినట్టు కాదు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. కాగా కేవలం అడవులకు మాత్రమే మనం ఎందుకు పరిమితమయ్యామో ఆలోచించుకోవాలి అని మావోయిస్టు పార్టీ సిద్ధాంత కర్తలలో ఒకరైన కోబాడ్ గాంధీ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. నిజమే! ఆయన మాటలను మావోయిస్టు పార్టీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవలసిందే. 'పోరాటంతో ఆటలాడొద్దు. మీ ఆటల పర్యవసానాలను ఎదుర్కొనే సంసిద్ధత లేకపోతే అసలు విప్లవంతో ఆటలాడొద్దు. విప్లవం అంటే ప్రతిరోజూ మారిపోయే అనంతమైన పరిణామాలను గణించే విధానం. మిమ్మల్ని వ్యతిరేకించే రాజ్యానికి అధికారం, సైనిక బలం పుష్కలంగా ఉన్నాయి. మీరు అంతకన్నా బలంగా లేకపోతే ఓడిపోతారు. నశించిపోతారు' అని మార్క్ 'న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్' లో ఒక వ్యాసంలో వివరించారు. 'రాజకీయ వ్యూహం, దానికి అనుగుణంగా ఉండే మిలిటరీ ఎత్తుగడలు రెండింటిలోనూ తప్పులు జరిగాయి. 1920-1940 మధ్య చైనాలో విజయవంతమైన వ్యూహాన్ని మావోయిస్టులు అనుసరిస్తున్నారు. ఆ వ్యూహం మొత్తం దేశానికి ఆపాదించలేం. భారతదేశంలో వ్యవసాయ సమాజం, ఆర్థిక రంగం రెండూ బహుముఖాలుగా చీలిపోయి ఉన్నాయి. మావో రూపొందించిన వ్యూహం మన దేశంలో కూడా విజయవంతమవుతుందన్న ఊహల్లోనే మావోయిస్టు పార్టీ నాయకత్వం ఉండిపోయింది. చైనాలో కామ్రేడ్లు జరిపిన పోరాటం కంటే, భిన్నమైన పరిస్థితుల్లో, భిన్నమైన పోరాటం తాము జరుపుతున్న వాస్తవాన్ని విప్లవకారులు తెలుసుకోవాలి' అని నక్సలైట్ ఉద్యమ విశ్లేషకుడు, చరిత్రకారుడు సమంత బెనర్జీ ఒక వ్యాసంలో అన్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును మే 21న ఎన్‌కౌంటర్ చేయడంతో నక్సలైట్ నాయకత్వం పతనం అంచున ఉన్నట్టు కనబడుతోంది. కొద్దిమంది పోలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు మాత్రమే చురుకుగా ఉన్నట్టు తాజాగా ఐ.బి వర్గాల అంచనా. రామన్న, హరిభూషణ్, రామకృష్ణ, కటకం సుదర్శన్ వంటి ప్రధాన నాయకులు అనారోగ్యం కారణంగా మరణించారు. లేదా ఎన్‌కౌంటర్లకు బలయ్యారు. సీనియర్ నాయకుడు చలపతి ఇటీవల గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. జార?ండ్‌కు చెందిన అగ్రశ్రేణి నాయకుడు ప్రశాంత్ బోస్‌ను అరెస్టు చేశారు. ఈ ఎదురు దెబ్బలతో నక్సలైట్ నెట్‌వర్క్ చావుదెబ్బ తిన్నది. కీలకమైన నక్సలైట్ నాయకుల కదలికలను ట్రాక్ చేయడానికి భద్రతా దళాలు డ్రోన్‌లు, ఉపగ్రహ ఇమేజింగ్, ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపయోగిస్తున్నది.మావోయిస్టు నాయకుల చుట్టూ ఉచ్చు బిగించడానికి సిఆర్‌పిఎఫ్ బెటాలియన్లు, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ యూనిట్లను బలోపేతం చేశారు. మావోయిస్టులకు ఆర్థిక, లాజిస్టికల్ మద్దతు వ్యవస్థ దాదాపు స్తంభించిపోయింది. నిధుల కొరత, కీలక నాయకుల ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు ఉద్యమ ప్రభావాన్ని బలహీనపరిచాయి. 'శత్రువు బలం ఎక్కువగా ఉండి, నీ బలం తక్కువగా ఉన్నప్పుడు, నీ బలమైన ప్రాంతాల్లో నీకున్న శక్తులన్నీ కూడగట్టుకొని శత్రువుకు చెందిన చిన్న చిన్న విభాగాలపై బలమైన మెరుపుదాడులు చేసి విజయాలు సాధించాలి' అనేది మావో చెప్పిన గెరిల్లా యుద్ధవ్యూహాల్లో ఒకటి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో జరుపుతున్న దాడులతో మావోయిస్టుల 'బలమైన' ప్రాంతాల్లోనూ కదిలే పరిస్థితిలేని కట్టడి కనిపిస్తోంది. మావోయిస్టులపై కేంద్ర బలగాల తుది పోరాటం అత్యంత కీలకమైన దశలో ఉంది. బిజెపి అనుబంధ సంస్థ సొంత పత్రిక 'ఆర్గనైజర్' కథనాన్ని బట్టి, గ్రామీణ, మారుమూల, అడవులు, కొండ, కోనల్లో మావోయిస్టుల సాయుధ గెరిల్లా దళాలను తుదముట్టించే 'ఆపరేషన్ కగార్'కు సమాంతరంగా, మావోయిస్టుల రాజకీయ అభిప్రాయాలను సమర్థించే వాళ్ళను ఏరివేసే చర్యలు కూడా ముమ్మరం కావచ్చు. పట్టణాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, మేధావులు, పౌరహక్కుల కార్యకర్తలు, కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, ఇతర ప్రజాసంఘాల కదలికలపై నిఘా తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. రాడికల్ విద్యార్థి, యువజన సంఘాలు, సికాస వంటి సంఘాలలో ఇదివరకు పనిచేసి ప్రస్తుతం వివిధ నగరాల్లో, రాష్ట్రాల్లో, విదేశాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వ్యక్తుల కార్యకలాపాలపైనా నిఘా పెంచనున్నారని తెలియవచ్చింది. 'కేంద్ర ప్రభుత్వ భద్రతాసంస్థల అధ్యయనాలలో అర్బన్ నక్సలిజం నాల్గవ తరం యుద్ధం (4 వ జనరేషన్ ) పరిధిలోకి వస్తుంది. నక్సలిజం పరిధి కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితంకాదని అర్థం చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో పని అనేది మావోయిస్టు వ్యూహంలో ఒక భాగం, దీనిని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ 2004లో జారీ చేసిన 'అర్బన్ పెర్స్పెక్టివ్', 'భారత విప్లవ వ్యూహాలపై' పత్రాలలో విస్తృతంగా వివరించింది. పట్టణ ప్రాంతాల్లో నక్సల్ కార్యకలాపాలపై దృష్టి సారించే పత్రంలోని విభాగాలు భారతదేశంలో అర్బన్ నక్సలిజం సైద్ధాంతిక చట్రాన్ని అందిస్తాయి. ప్రజాయుద్ధానికి, విముక్తి పొందిన ప్రాంతాల స్థాపనకు అవసరమైన వివిధ రకాల సామర్థ్యాలను కలిగి ఉన్న కార్యకర్తలు, నాయకత్వాన్ని అందించే ప్రధాన వనరులలో పట్టణ ఉద్యమం ఒకటి అని వారి పత్రాలు స్పష్టంగా చెబుతున్నాయి%ొ% అంతేకాకుండా, ప్రజా యుద్ధానికి సరఫరాలు, సాంకేతికత- నైపుణ్యం, సమాచారం, ఇతర వస్తువులను అందించే బాధ్యత కూడా పట్టణ విప్లవ ఉద్యమం భుజాలపైనే ఉంది. 2015- 16లో ఎఫ్‌టిఐ, హెచ్‌సియు, ఐఐటి చెన్నై, జెఎన్‌యు, ఉస్మానియా, జాదవ్‌పూర్, ఢిల్లీ విశ్వవిద్యాలయం వంటి ప్రఖ్యాత విద్యా సంస్థల క్యాంపస్‌లలో భారత జాతి విచ్ఛిన్నతను సమర్థించే నినాదాలు తరచూ ప్రతిధ్వనిస్తున్నట్టు ఒక నివేదికను ఇంటెలిజెన్స్ బ్యూరో కేంద్రానికి అందజేసినట్టు సమాచారం అందుతోంది. అర్బన్ నక్సల్స్ గ్రామీణ ప్రాంతాల్లోని మావోయిస్టులకు ఆయుధాలు, ఔషధాలు, కమ్యూనికేషన్ పరికరాలు వంటి ముఖ్యమైన వస్తువులను సరఫరా చేయడం ద్వారా మద్దతు ఇస్తున్నట్టు ఆ నివేదికలో తెలిపారు. అదే సమయంలో కొన్ని 'కవర్ ఆర్గనైజేషన్స్'ను ఏర్పాటు చేసి, దళ సభ్యులుగా తయారు చేస్తున్నట్టు కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలంటున్నవి. తమ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి ఇంటర్నెట్, సోషల్ నెట్‌వర్క్‌లను అర్బన్ నక్సలైట్లు వాడుతున్నట్టు ఆ వర్గాలు చెబుతున్నవి. 'సైనిక, పారామిలిటరీ దళాలు, పోలీసులు, రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలోని ఉన్నత స్థాయిలలోకి చొచ్చుకుపోవాలి. శత్రువు గురించి సమాచారాన్ని సేకరించాలి. ఆయా వ్యవస్థలలో విప్లవానికి మద్దతును కూడగట్టాలి. సమయం వచ్చినప్పుడు తిరుగుబాటును ప్రేరేపించాలి' అని పట్టణ ప్రాంతాల్లోని మేధావులు, రచయితలకు నిర్దేశిస్తున్నట్టుగా మావోయిస్టు పార్టీకి చెందిన ఒక 'వ్యూహ పత్రం'లో బయటపడినట్టు కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థలు చెబుతున్నాయి.

# ఆనంద ద్వీపం.. అయ్యో పాపం!



### కిన్నెరసాని జలాశయం మధ్యలో ఆనంద ద్వీపం

### మంత్రులు, కలెక్టర్లు పరిశీలించినా అభివృద్ధికి దూరమే

### ఫలితంగా దూరం నుంచే పర్యాటకులు వీక్షించాల్సిన దుస్థితి

పాల్వంచ రూరల్: ప్రకృతి అందాలకు నెలవైన కిన్నెరసాని పర్యాటక అభివృద్ధికి నోచుకోవడం లేదు. మంత్రులు, కలెక్టర్లు ప్రత్యక్షంగా పరిశీలించినా అడుగు కూడా ముందుకు పడడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని పర్యాటకంగా అభివృద్ధి చెందకపోవడంతో ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోంది. నిత్యం వందల సంఖ్యలో, సెలవు రోజుల్లో వేలాదిగా వచ్చే పర్యాటకులు రిజర్వాయర్ మధ్యలోని ఆనంద ద్వీపాన్ని సందర్శించాలని తపన పడుతుంటారు. కానీ అక్కడ చేయాల్సిన అభివృద్ధి పనుల్లో ముందడుగు పడకపోవడంతో అద్భుత అవకాశాన్ని కోల్పోతున్నారు.

**ముగ్గురు మంత్రులు వీక్షించినా..**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏడాది క్రితం కిన్నెరసానిని సందర్శించారు. రిజర్వాయర్ మధ్యలోని ఆనంద ద్వీపం అద్భుతంగా ఉందని, పర్యాటకులకు దర్శనభాగ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అద్దాల మేడ, కాటేజీ పనులు వేగవంతం చేయాలని, పర్యాటకులను ఆకర్షించేలా ఆనంద ద్వీపాన్ని తీర్చిదిద్దాలని అటవీశాఖను ఆదేశించారు. ప్రభుత్వం కూడా ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించడంతో కలెక్టర్ కిన్నెరసానిపై ప్రత్యేక దృష్టి సారించినా, పనులు మాత్రం మందకొడిగానే సాగుతున్నాయి.

**పర్యాటకులకు నిరాశే..**

చూడచక్కని ప్రకృతి అందాలు, అద్భుతమైన హైల్యాండ్స్, అందమైన జలాశయం, ఆహ్లాదకరమైన అడవులు ఉన్న కిన్నెరసానిలో సౌకర్యాలు లేక పర్యాటకులకు నిరాశే మిగులుతోంది. అద్దాలమేడ, కాటేజీలు, హరిత హోటల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతారు.

**పదేళ్ల క్రితమే నిధులు మంజూరు**

కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు 2015లో నీతి అయోగ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేశాయి. ఆ నిధులతో కొత్తగూడెం క్రాస్ వద్ద హరిత హోటల్, కిన్నెరసానిలో పది కాటేజీలు, అద్దాలమేడ, ఫుడ్‌కోర్టు పనులు చేపట్టాలని నిర్ణయించారు. కాగా, ఇందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో సౌకర్యాల లేమితో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నా.. వసతులు ఉంటే మరింత మంది వచ్చే అవకాశం ఉంది.

**సింగపూర్ నుంచి ఆర్కిటెక్ట్‌లు..**

రిజర్వాయర్ మధ్యలో ఉన్న ఆనంద ద్వీపాన్ని అభివృద్ధి చేసేందుకు 2018లో అప్పటి కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ సింగపూర్ నుంచి ప్రత్యేకంగా ఆర్కిటెక్ట్‌లను పిలిపించారు. పర్యాటకుల సౌకర్యార్థం వెదురు బొంగులతో గుడారాలు, ఎత్తయిన ట్రాక్, తాగునీటి వసతి వంటివి కల్పించాలని నిర్ణయించారు. అయితే అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత కలెక్టర్లు ఎంవీ రెడ్డి, అనుదీప్‌తోపాటు ప్రస్తుత కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కూడా పనులను పరిశీలించినా ఫలితం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లక్నవరంలో ఏర్పాటు చేసినట్టుగా ఆనంద ద్వీపం వరకు తీగలవంతెన ఏర్పాటు చేసి, హోటళ్లు, వసతి గృహాలను నిర్మిస్తే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముంది.

# జర్మనీ సంచలన నిర్ణయం..


# రష్యాకు హెచ్చరికగా 5,000 మంది సైనికుల మోహరింపు

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో నాటో కూటమి తన తూర్పు సరిహద్దులను బలోపేతం చేసుకోవడంలో భాగంగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జర్మనీ సైన్యం చరిత్రలోనే ఒక భారీ ప్రాజెక్టును చేపట్టింది. దాదాపు 5,000 మంది జర్మన్ సైనికులను లిథువేనియాలో శాశ్వతంగా మోహరించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఏప్రిల్ 1న లిథువేనియా రాజధాని విల్నియస్‌లో కొత్త పాన్జర్ బ్రిగేడ్ 45 అధికారికంగా ప్రారంభమైంది. రష్యా దూకుడుకు వ్యతిరేకంగా NATO తూర్పు సరిహద్దును సురక్షితం చేయడానికి జర్మనీ ఈ చర్య తీసుకుంది. జర్మనీ సైన్యం గతంలో ఎనిమిది బ్రిగేడ్‌లతో ఉండేది. ఇప్పుడు లిథువేనియాలో మోహరించబడిన తొమ్మిదో బ్రిగేడ్ ఇది. బుండెస్వెహర్ చరిత్రలో ఒక విదేశీ గడ్డపై సైన్యాన్ని శాశ్వతంగా మోహరించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలకు చిహ్నంగా పాన్జర్ బ్రిగేడ్ 45 చిహ్నంలో విల్నియస్ నగరంలోని ప్రముఖ కట్టడం గెడిమినాస్ టవర్ ను కూడా చేర్చారు. సైనికులు తమ యూనిఫామ్‌లపై ఈ చిహ్నాన్ని ధరిస్తారు. జర్మన్ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ రెండు వారాల క్రితం కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత బుండెస్టాగ్ (పార్లమెంట్)లో తన మొదటి ప్రసంగంలో ఈ నిర్ణయం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. నాటో భూభాగంలో ప్రతి అంగుళాన్ని రక్షించడానికి జర్మనీ సిద్ధంగా ఉంటుందని ఆయన ప్రతిజ్ఞ చేశారు. 3 మిలియన్ల జనాభా కలిగిన లిథువేనియా, రష్యాకు చెందిన కాలినిన్‌గ్రాడ్ ఒబ్లాస్ట్, రష్యా మిత్రదేశమైన బెలారస్‌ల మధ్య ఉంది. బెలారస్‌తో దాదాపు 680 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుంది. లిథువేనియా ప్రభుత్వం కూడా తమ సైనిక శక్తిని బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా జర్మనీలో తయారైన 44 ఆధునిక లియోపార్డ్ 2 A8 ప్రధాన యుద్ధ ట్యాంకులను ఆర్డర్ చేసింది. ఇదే ట్యాంక్‌లను లిథువేనియాలో మోహరించిన బుండెస్వెహర్ బ్రిగేడ్ కూడా ఉపయోగించనుంది. ఇది రెండు సైన్యాల మధ్య సహకారాన్ని సులభతరం చేస్తుంది. రక్షణ మంత్రి పిస్టోరియస్ 2023 వేసవి నుంచి ఈ బ్రిగేడ్ ఏర్పాటును వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం, బ్రిగేడ్ సిబ్బంది, ప్రారంభ సహాయక యూనిట్లు మాత్రమే అక్కడ ఉన్నాయి. అయితే, ఈ సంవత్సరం చివరి నాటికి మొత్తం 500 మంది జర్మన్ సైనికులు లిథువేనియాలో మోహరిస్తారు. బ్రిగేడ్ ప్రధాన స్థావరమైన రుడ్నిన్కై సైనిక శిక్షణా ప్రాంతంలో కీలకమైన మౌలిక వసతులను ఇంకా



నిర్మిస్తున్నారు. బ్యారక్‌లు, కొత్త రహదారులు, ఆగ్నేయ లిథువేనియాలోని ఈ స్థలానికి సేవలను అందించడానికి ఒక రైల్వే లైన్‌ను విస్తరిస్తున్నారు. సైనికుల కుటుంబాల కోసం విల్నియస్, కౌనాస్ నగరాల్లో పాఠశాలలు, కిండర్‌గార్టెన్‌లను నిర్మిస్తున్నారు. మొత్తం బ్రిగేడ్ మోహరింపు 2027 చివరి నాటికి పూర్తవుతుందని అంచనా. ఇది రెండు దేశాలకు లాజిస్టికల్‌గా మాత్రమే కాకుండా, ఆర్థికంగా కూడా ఒక పెద్ద సవాలు. లిథువేనియా తన రక్షణ బడ్జెట్‌ను పెంచింది. ఛాన్సలర్ ఫ్రిడ్రిచ్ మెర్జ్ నేతృత్వంలోని కొత్త జర్మన్ ప్రభుత్వం కూడా రక్షణ ఖర్చులను పెంచే ప్రణాళికలను ప్రకటించింది. 4,800 మంది సైనికులను, 200 మంది ఉద్యోగులను లిథువేనియాకు స్వచ్ఛందంగా తరలించడం బుండెస్వెహర్‌కు ఒక సవాలుగా మారింది. దీనిని అధిగమించడానికి నాటో తూర్పు సరిహద్దులో 2024 జనవరిలో బుండెస్టాగ్ ఒక చట్టాన్ని ఆమోదించింది. ఇందులో సౌకర్యవంతమైన పని గంటలు, పెరిగిన అలవెన్సులు, ఓవర్‌టైమ్ చెల్లింపు వంటివి ఉన్నాయి. జర్మనీ 2017 నుండి లిథువేనియాలో మోహరించింది. అక్కడ NATO యుద్ధ సమూహానికి జర్మనీ నాయకత్వం వహించింది. బ్రిగేడ్ శాశ్వత మోహరింపుకు చట్టపరమైన ఆధారం 2024 సెప్టెంబర్‌లో జర్మనీ , లిథువేనియా మధ్య కుదిరిన అంతర్-ప్రభుత్వ ఒప్పందం. ఇది బుండెస్వెహర్‌కు లిథువేనియా ఆస్తులను అద్దె లేకుండా ఉపయోగించుకోవడానికి, దేశంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేయడానికి అనుమతిస్తుంది. ప్రభుత్వం జర్మన్ భాషా కిండర్‌గార్టెన్‌లు, పాఠశాలలను కూడా స్థాపించవచ్చు. ఇవి జర్మన్ పాఠ్యప్రణాళికను బోధిస్తాయి.

# యువతే టార్గెట్‌గా 'సైబర్' రాకెట్



విదేశీ ఉద్యోగాల పేరున మోసాలు ఎన్నో సాగుతున్నాయి. ఈ ఉచ్చులోపడి వేలాది మంది విదేశాల్లో చిక్కుకుని నానాఅవస్థలు పడుతున్నారు. అక్కడ హింసలను భరించి వెట్టిచాకిరీ చేస్తున్నారు. ఇటువంటి సైబర్ బానిసత్వంలో బాధితులైన వారిని కేంద్ర ప్రభుత్వం రక్షించడానికి అనేక చర్యలు తీసుకుంటోంది. అయినాసరే చాపకింద నీరులా ఈ సైబర్ బానిసత్వ రాకెట్ అంతర్జాతీయ స్థాయిలో థాయిలాండ్, బ్యాంకాక్, మయన్మార్ వంటి దేశాల్లో సాగుతుండడం విశేషం. బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగం వస్తుందని, ప్రతినెలా లక్ష రూపాయలు వస్తాయని ఏజెంట్లు ఆశ చూపించడంతో తెలంగాణకు చెందిన కొంతమంది యువకులు దగాపడ్డారు. మయన్మార్ కేంద్రంగా సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో బందీలుగామారి బలవంతంగా సైబర్ వెట్టి చాకిరీకి గురవుతున్న 2000 మందికి ఇటీవల కేంద్రం చొరవతో విముక్తి లభించడం విశేషం. బాధితుల కథనం ప్రకారం ఏజెంట్లు ముంబై మీదుగా బ్యాంకాక్‌కు విమానంలో తరలించారు. అక్కడ నుంచి పొరుగుదేశాలకు అక్రమ రవాణా చేశారు. అమెరికా, బ్రిటన్ దేశాల్లోని ఎన్‌ఆర్‌ఐలను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలు సాగించేలా వీరికి శిక్షణ ఇచ్చారు. సైబర్ క్రైమ్ శిక్షణకోసం భారతీయులను లావోస్‌కు పంపిన దాఖలాలు కూడా బయటపడ్డాయి. అంతర్జాతీయ సైబర్ బానిసత్వ రాకెట్‌లో ఇద్దరు ప్రధాన నిందితులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అరెస్టు చేయగలిగింది. ఈ ఇద్దరు నిందితుల్లో ఒకరు గుజరాత్‌కు చెందిన హితేష్ అర్జన సౌమ్య కాగా, మరొకరు హైదరాబాద్‌కు చెందిన కొలనాటి నాగశివ అలియాస్ జేమ్స్. కొలనాటి నాగశివ అలియాస్ జేమ్స్‌ను మే 19న కోల్‌కతాలోని నేతాజీ సుబాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. లుక్ అవుట్ నోటీస్ ప్రకారం లావోస్ నుండి వచ్చిన తరువాత అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. హితేష్ అర్జన సౌమ్యను ఢిల్లీలో అరెస్టు చేయగలిగారు. హోం మంత్రిత్వశాఖ సమన్వయంతో సైబర్ బానిసత్వానికి గురైన అనేక మంది బాధితులతో అతను ఇటీవల మయన్మార్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చాడు. కంబోడియా, మయన్మార్, లావోస్‌ల్లోని అక్రమ సైబర్ కాల్ సెంటర్ల నుంచి రక్షించబడిన బాధితుల ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ పోలీసులు అరెస్టు చేయడం గమనార్హం. బాధితుల్లో కొందరిని థాయ్‌లాండ్‌లో ఒక్కొక్కరిని 5000 డాలర్లకు అమ్మేయడం కూడా జరిగింది. తెలంగాణకులోని కొహెడ్‌కు చెందిన బాధితుడు తన అనుభవం చెబుతూ బ్యాంకాక్‌కు 200 కి.మీ దూరంలో మంచి జాబ్ ఉందని ఏజెంట్ నమ్మించాడని, తీరా అక్కడకు వెళ్లాక రోజుకు 16 గంటల పని అప్పచెప్పారని, పని చేయడానికి మొండికేయగా, అక్కడున్న చైనీయులు తన పాస్‌పోర్టు గుంజుకున్నారని, చివరకు అక్కడున్న ఆర్మీ వాళ్లకు తాము దొంగతనంగా ఆ దేశానికి వచ్చామని చెప్పి ఆర్మీ వాళ్లకు పట్టించగా జైలు పాలయ్యానని వాపోయాడు.

ఇదే విధమైన మోసంతో సుమారు ఐదు వేల మంది భారతీయులు కాంబోడియాకు వెళ్లి నానా అవస్థలు పడుతున్నారు. మోసగాళ్లు వీరిచే బలవంతంగా చట్టవ్యతిరేక సైబర్ నేరాలు చేయిస్తూ స్వదేశంలోని భారతీయుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. కాంబోడియా వేదికగా జరుగుతున్న ఈ స్కామ్‌లో బాధితులను బలవంతంగా దింపుతున్నారు. తాము కేంద్ర ప్రభుత్వ అధికారులుగా నటించి వారిచే సైబర్ నేరాలు చేయిస్తున్నారు. మహిళల పేర్లు, నకిలీ ఫోటోలతో తమతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలు ఓపెన్ చేయించి ఈ వ్యవహారాలు నడిపిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. రోజూ టార్గెట్లు విధించేవారని, అవి నెరవేర్చని వారికి భోజనం కూడా పెట్టేవారు కాదని చెప్పుకొచ్చారు. ఫేస్‌బుక్‌తోపాటు వివిధ డేటింగ్ యాప్‌ల్లో మహిళలవలే తమతో నటింపచేస్తూ భారతీయులను నమ్మిస్తున్నారని, వారి నుంచి క్రిప్టో పెట్టుబడుల పేరిట డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. కాంబోడియాలో ఈ విధంగా దాదాపు 5 వేల మంది భారతీయ నిరుద్యోగులు చిక్కుకున్నారని దర్యాప్తు సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇదే విధంగా మయన్మార్‌లో సైబర్ క్రైమ్ రాకెట్ సాగుతోంది. బాధితులను సోషల్ మీడియా ద్వారా సంప్రదించి థాయిలాండ్, ఇతర తూర్పు ఆసియా దేశాలకు ఉద్యోగాల పేరిట పంపుతున్నారు. పర్యాటక వీసాలపై ఏజెంట్లు మయన్మార్ సరిహద్దుల వరకు తీసుకెళ్తున్నారు. అక్కడనుంచి పడవల్లో నదులు దాటించి చివరికి సాయుధ తిరుగుబాటు దారుల నియంత్రణలో ఉన్న ప్రాంతాల్లో దింపుతున్నారు. అక్కడనుంచి బాధితులకు తీరని నరకయాతన సాగుతోంది. పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుని బందీలుగా ఉంచుతున్నారు. చెప్పినపని చేయకుంటూ అవయవాలను తొలగిస్తామని బెదిరిస్తున్నారు. ఈ విధంగా మయన్మార్ సైబర్ క్రైమ ఇరుక్కున్న 60 మంది భారతీయులను మహారాష్ట్ర పోలీస్ సైబర్ విభాగం రక్షించగలిగింది. ఈ కేసుకు సంబంధించి ఒక విదేశీయుడితో సహా ఐదుగురు ఏజెంట్లను అరెస్ట్ చేసింది. ఇదిలా ఉండగా ఉత్తరాది కేంద్రంగా సైబర్ నేరాలు చేసే సూత్రధారులకు సహాయం చేసే పాత్రధారులు హైదరాబాద్ నగరంలో కూడా ఉంటున్నారు. బోగస్ వివరాలతో బ్యాంకు ఖాతాలు తెరిపించి ఇవ్వడం ద్వారా సహకరిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. వర్క్ ఫ్రమ్‌హోమ్ అన్న పేరుతో స్కామ్ నడుస్తుండడం ఇటీవలనే బయటపడింది. ఇందులో ప్రధాన పాత్ర వహించిన నలుగురిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగం ద్వారా రోజుకు రూ. 17 వేల నుంచి రూ. 18 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉంటోందని నమ్మిస్తున్నారు. అంతేకాదు తమ వద్ద కొన్ని స్కీమ్‌లు ఉన్నాయని పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మిస్తున్నారు.

# ఒకే వేదికపై ఆడటం అదనపు ప్రయోజనమే..

# విమర్శలతో ఏకీభవిస్తా: స్టార్క్




ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 లో టీమిండియా ఒకే వేదికపై ఆడటంపై విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు మైకేల్ వాన్, మైకేల్ ఆథర్టన్ తదితరులు భారత జట్టుకు అదనపు ప్రయోజనాలు చేకూరాయని వ్యాఖ్యానించారు.

'హోం అడ్వాంటేజ్'

మరోవైపు.. రెండో సెమీ ఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో సౌతాఫ్రికా ఓటమి తర్వాత ప్రొటీస్ స్టార్ డేవిడ్ మిల్లర్ కూడా ఇదే మాట అన్నాడు. ఈ సందర్భంగా తాను ఫైనల్లో న్యూజిలాండ్‌కే మద్దతు ఇస్తానని కూడా మిల్లర్ పేర్కొన్నాడు. తాజాగా.. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ కూడా 'హోం అడ్వాంటేజ్'పై స్పందించాడు. మిగతా జట్లతో పోలిస్తే రోహిత్ సేనకు కొంతమేర లాభం చేకూరిందని.. ఒకే వేదికపై ఆడటం వల్ల టీమిండియాకు మేలు జరిగిందన్న వాదనలతో తాను ఏకీభవిస్తానని తెలిపాడు.

న్యాయంగానే గెలిచారు

అదే సమయంలో.. భారత జట్టు ఈ టోర్నీలో ఎలాంటి మోసానికీ పాల్పడలేదని.. న్యాయంగానే వాళ్లు గెలిచారని స్టార్క్ వ్యాఖ్యానించడం విశేషం. "ఒకే స్టేడియంలో తమ మ్యాచ్‌లన్నీ ఆడటం వల్ల కలిగే లాభాల గురించి రోజూ చర్చ జరుగుతూ ఉంది. అయితే, ఇండియా మాత్రం దుబాయ్ తమకు తటస్థ వేదిక అని వాదించేందుకు అన్ని మార్గాలను ఉపయోగించుకుంటోంది. ఏదేమైనా టీమిండియా నిజాయితీగా ఈ టోర్నీలో గెలిచింది. ఎందుకంటే.. మూడు ఫార్మాట్లలోనూ సుదీర్ఘకాలంగా వాళ్లు అద్భుతంగా ఆడుతున్నారు. అయితే, ఈ టోర్నీ విషయంలో వాళ్లపై వస్తున? విమర్శలు సబబే అనిపిస్తోంది. సెమీ ఫైనల్ ఆడేందుకు న్యూజిలాండ్ పాకిస్తాన్‌కు వెళ్లింది. ఆ తర్వాత వెంటనే ఫైనల్ కోసం దుబాయ్‌కు వచ్చింది. పాకిస్తాన్ ఆతిథ్య దేశమే అయినప్పటికీ వాళ్లూ టీమిండియాతో ఆడేందుకు దుబాయ్‌కు రావాల్సి వచ్చింది. డేవిడ్ మిల్లర్ కూడా ఈ విషయంపై మాట్లాడాడు. అప్పటికప్పుడు విమాన ప్రయాణం చేయడం సులువు కాదని.. తమకు కలిగిన అసౌకర్యం గురించి చెప్పాడు.

ఆ విమర్శలతో ఏకీభవిస్తా

ఏదేమైనా ఒక జట్టు ఎలాంటి ప్రయాణాలు లేకుండా.. ఒకే చోట ఉండి ఆడటం వల్ల కచ్చితంగా లాభపడుతుంది. కాబట్టి.. నేను ఈ విషయంలో టీమిండియాపై వ్యక్తమవుతున్న అభిప్రాయాలతో కచ్చితంగా ఏకీభవిస్తా" అని స్టార్క్ ఫెంటాస్టిక్స్‌టీవీతో పేర్కొన్నాడు. కాగా చాంపియన్స్ ట్రోఫీ-2025కి పాకిస్తాన్ ఆతిథ్యం ఇవ్వగా.. బీసీసీఐ మాత్రం భారత జట్టును అక్కడకు పంపేందుకు నిరాకరించింది. భద్రతా కారణాల వల్ల తమకు తటస్థ వేదికపై ఆడే అవకాశం ఇవ్వాలని ఐసీసీని కోరగా.. ఇందుకు సమ్మతి లభించింది. ఈ నేపథ్యంలో దుబాయ్‌లోనే రోహిత్ సేన తమ మ్యాచ్‌లన్నీ ఆడింది. అయితే, టీమిండియాతో మ్యాచ్‌ల కోసం ఇతర జట్లు దుబాయ్- పాకిస్తాన్ మధ్య ప్రయాణాలు చేయాల్సి వచ్చింది. ఇక ఈ వన్డే టోర్నమెంట్లో భారత్ గ్రూప్ దశలో బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌లను చిత్తు చేసింది. సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించిన టీమిండియా.. ఫైనల్లో న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. చాంపియన్స్ ట్రోఫీ-2025 విజేతగా అవతరించింది. ఇక ఈ టోర్నీలో భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌లలోనూ విజయం సాధించడం విశేషం.

ఆ సత్తా భారత్‌కు మాత్రమే ఉంది

ఈ నేపథ్యంలో స్టార్క్ టీమిండియాపై ప్రశంసలు కురిపించాడు. భారత్‌లో ప్రతిభావంతులైన క్రికెటర్లు చాలా మంది ఉన్నారని, రిజర్వ్ పూల్ సత్తా అసాధారణమని ప్రశంసించాడు. ఒకేరోజు టీ20, వన్డే, టెస్టు మ్యాచ్‌లను ఆడే సత్తా భారత్‌కే ఉందని చెప్పాడు. 'మూడు వేర్వేరు ఫార్మాట్లలో మూడు జట్లను ఒకేరోజు మైదానంలో దింపగలిగే సామర్థ్యం ప్రపంచ క్రికెట్‌లో ఒక్క భారత దేశానికి మాత్రమే ఉంది. ఆసీస్‌తో టెస్టు, ఇంగ్లండ్‌తో వన్డే, దక్షిణాఫ్రికాతో టీ20 ఆడగలదు. ఇదేదో ఆషామాషీగా కాదు! అంతర్జాతీయ క్రికెట్ పోటీకి ఏమాత్రం తగ్గకుండా మూడు టీమిండియా జట్లు ఆడగలవు. ఈ సామర్థ్యం, సత్తా మరే దేశానికి లేదు' అని స్టార్క్ పేర్కొన్నాడు. ప్రపంచ లీగ్ క్రికెట్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అగ్రగామిగా వెలుగొందడం వల్లే ఇంతటి అనుకూలతలు వచ్చాయా అన్న ప్రశ్నకు స్టార్క్ ఆసక్తికర సమాధానమిచ్చాడు.

కేవలం ఐపీఎల్ వల్ల కాదు..

ఇండియన్ ప్రీమియర్ 'ఒక్క ఐపీఎల్ వల్లే ఈ సానుకూలతలని నేననుకోను. మేమంతా (క్రికెటర్లందరూ) కూడా ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ లీగ్‌లు ఆడుతున్నాం. కానీ భారత క్రికెటర్లు మాత్రం ఒక్క ఐపీఎల్ మాత్రమే ఆడుతున్న సంగతి మరవొద్దు. ఇక్కడ చూడాల్సింది అనుకూలతలు కావు. రిజర్వ్ బెంచ్ సత్తా. భారత క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ ఆడే బలగం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. రోజు రోజుకీ పోటీ క్రికెటర్లు దీటుగా తయారవుతున్నారు. ఐపీఎల్ ఒక పెద్ద టోర్నీ.

కొంత అడ్వాంటేజ్ ఉండొచ్చు. కానీ అంతకుమించిన ప్రతిభ కూడా ఉంది. అదే భారత క్రికెట్ బలగం అవుతోంది' అని చెప్పాడు. మిగతా క్రికెటర్లు ఏడాదికి ఐదారు లీగ్‌లు ఆడుతున్నారని, మరి వారి దేశాల్లోనూ, ఆయా దేశాల్లోనూ లీగ్‌లు జరుగుతున్నప్పటికీ ఒక్క ఐపీఎల్‌కు పరిమితమైన దేశంలోనే పెద్ద సంఖ్యలో క్రికెటర్లు వెలుగులోకి రావడం గొప్ప విశేషమని స్టార్క్ వివరించాడు.

# ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు.. రెండో రోజు ముగిసిన ఆట

లార్డ్స్: అండర్సన్-తెండుల్కర్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. ఓవర్ నైట్ స్కోర్ 251/4తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌట్ అయింది. రూట్ (104) శతకం చేయగా, బ్రైడన్ కార్స్ (56), జేమీ స్మిత్ (51) అర్ధశతకాలు చేశారు. భారత బౌలర్లలో బుమ్రా 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి 145/3 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్ (53), రిషభ్ పంత్ (19) ఉన్నారు. ప్రస్తుతం భారత్ 242 పరుగుల దూరంలో వెనకబడి ఉంది. రెండో రోజు ఆటలో కేవలం 75 ఓవర్లే వేశారు.

నిలబడిన రాహుల్..

యశస్వి జైస్వాల్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. మూడు ఫోర్లు కొట్టి ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించిన జైస్వాల్ (13).. ఆర్చర్‌కు చిక్కాడు. రెండో ఓవర్ మూడో బంతికి స్లిప్స్‌లో ఉన్న హ్యారీ బ్రూక్‌కు క్యాచ్ ఇచ్చి యశస్వి వెనుదిరిగాడు. దీంతో క్రీజులోకి వచ్చిన కరుణ్ నాయర్ (40: 62 బంతుల్లో 4 ఫోర్లు)తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. మరోవికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడిన వీరు అడపాదడపా షాట్లతో అలరించారు. దీంతో టీ బ్రేక్ ముగిసే సమయానికి భారత్ 44 పరుగులతో నిలిచింది.

ఓవైపు రాహుల్ క్రీజులో నిలుదొక్కుకునేందుకు ప్రయత్నించగా.. కరుణ్ నాయర్ వేగంగా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో జట్టు స్కోర్ 74 పరుగుల వద్ద స్టోక్స్ బౌలింగ్‌లో రూట్‌కు క్యాచ్ ఇచ్చి కరుణ్ ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ శుభమన్ గిల్ (16) క్రీజులోకి వచ్చాడు. గత రెండు మ్యాచ్‌ల్లో సూపర్ ఫామ్‌తో అదరగొట్టిన గిల్ ఈ సారి భారీ స్కోర్ చేయడంలో విఫలమయ్యాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో 107 పరుగుల వద్ద జేమీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో భారత్ కాస్త ఒత్తిడికి గురైంది. అయితే రిషభ్ పంత్ (19లి)తో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లిన రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడాడు. ఈ క్రమంలో 39వ ఓవర్ తొలిబంతికి బషీర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి రాహుల్ అర్ధశతకం చేశాడు.

ఐదు వికెట్లతో అదరగొట్టిన బుమ్రా..

ఓవర్‌నైట్ స్కోర్ 251 పరుగులతో రెండో రోజు ఇన్నింగ్స్ మొదలుపెట్టిన పెట్టిన ఇంగ్లాండ్‌కు బుమ్రా షాక్ ఇచ్చాడు. 260 పరుగుల వద్ద ఆ జట్టు కెప్టెన్ స్టోక్స్‌ను (44) ఔట్ చేశాడు. అయితే శతకం చేసిన ఆనందంలో ఉన్న రూట్ (104)ను మరో అద్భుత బంతితో బుమ్రా బౌల్డ్‌చేశాడు. ఆ తర్వాత బంతికే క్రిస్ వోక్స్‌ను బుమ్రా బోల్తా కొట్టించాడు. దీంతో ఆ జట్టు 271 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. 300 పరుగులలోపే ఆ జట్టు ఆలౌట్ అయ్యేలా కనిపించింది. అయితే జేమీ స్మిత్ (51: 56 బంతుల్లో), బ్రైడన్ కార్స్ (56) మరో వికెట్ పడకుండా ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. లంచ్ బ్రేక్ ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 353/7 స్కోర్‌తో నిలిచింది. అయితే ఈ జోడీని సిరాజ్ విడదీశాడు. 355 పరుగుల వద్ద కీపర్ ధ్రువ్ జురేల్‌కు క్యాచ్ ఇచ్చి స్మిత్ ఔటయ్యాడు. ఎనిమిదో వికెట్‌కు స్మిత్, బ్రైడన్ జోడీ 87 పరుగులు జోడించారు. అనంతరం బుమ్రా బౌలింగ్‌లో ఆర్చర్ బౌల్డ్ అయ్యాడు. అనంతరం 387 పరుగుల వద్ద సిరాజ్ బౌలింగ్‌లో బ్రైడన్ కార్స్ క్లీన్ బౌల్డ్ కావడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ముగిసింది.




# 2007 టి20 వరల్డ్ కప్ మోడ్‌లోకి యువీ!

# వింటేజ్ షాట్లతో ఆస్ట్రేలియా బౌలర్ల బెండు తీసాడుగా!

క్రికెట్‌లో కొన్ని దృశ్యాలు ఎప్పటికీ మారవు, వాటిలో యువరాజ్ సింగ్ ఆస్ట్రేలియన్ బౌలర్లను చిత్తు చేయడం ఒకటి. 2007 టి20 ప్రపంచకప్‌లో సెమీ-ఫైనల్‌లో ఆసీస్‌పై విరుచుకుపడ్డ యువీ, 2025 ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ (%×మీా) ు%20 సెమీ-ఫైనల్‌లో అదే ఘనతను మరోసారి ప్రదర్శించాడు. గడియారాన్ని వెనక్కి తిప్పుతూ, తనదైన వింటేజ్ సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించాడు. 2007లో దూకుడైన ఇన్నింగ్స్‌తో ఆసీస్ బౌలింగ్‌ను తునాతునకలు చేసిన యువరాజ్, ఈసారి కూడా రాయ్‌పూర్‌లో అదే రీతిలో విరుచుకుపడ్డాడు. అప్పట్లో 30 బంతుల్లో 70 పరుగులు చేసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పిన యువరాజ్, ఇప్పుడు అదే పర్ఫార్మెన్స్‌ను మరలా ప్రదర్శించాడు. అభిమానులు '2007 మేజిక్ మళ్లీ' అంటూ గట్టిగా గోలలు చేయడం విశేషం. యువరాజ్ తన ఆటను సాధారణంగా నెమ్మదిగా ఆరంభించడు, ఈ మ్యాచ్‌లో కూడా అదే జరిగింది. పవన్ నేగి అవుట్ అయిన వెంటనే క్రీజులోకి వచ్చిన యువరాజ్, సమయాన్ని వృధా చేయకుండా వెంటనే దాడికి దిగాడు. ఏడో ఓవర్ ఐదో బంతికి ఎడమచేతి వాటం స్పిన్నర్ జేవియర్ డోహెర్టీ బంతిని వేయగా, యువరాజ్ ఒక క్షణం కూడా ఆలోచించకుండా తన హై బ్యాక్‌లిఫ్ట్‌తో బంతిని లాంగ్-ఆన్ మీదుగా స్టాండ్స్‌లోకి పంపాడు. ఆ ఒక్క షాట్‌తో స్టేడియం హోరెత్తిపోయింది, అభిమానులు 2007 నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భారత మాస్టర్స్ జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. 13 ఓవర్లు ముగిసే సరికి 132/3తో మెరుగైన స్థితిలో ఉంది. యువరాజ్ అప్పటికే 26 బంతుల్లోనే 52 పరుగులు సాధించి, ఆరు సిక్సర్లు బాదాడు. మరో ఎండ్‌లో స్టువర్ట్ బిన్నీ 2 పరుగులతో నిలిచి ఉన్నాడు. ఇన్నింగ్స్ ప్రారంభంలో సచిన్ టెండూల్కర్ 42 పరుగులు చేయగా, అంబటి రాయుడు (5), పవన్ నేగి (14) త్వరగా అవుటయ్యారు. కానీ యువరాజ్ క్రీజులో ఉండటంతో భారత్ భారీ స్కోరుపై దృష్టి సారించింది. అతని దూకుడు బ్యాటింగ్ చూసి అభిమానులు 2007 సెమీ-ఫైనల్‌ను గుర్తు చేసుకున్నారు. షేన్ వాట్సన్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా మాస్టర్స్ టీమ్, యువరాజ్ దెబ్బకు పూర్తిగా నష్టపోయింది. డోహెర్టీ లెఫ్ట్-ఆర్మ్ స్పిన్ బౌలింగ్‌ను యువరాజ్ తునాతునకలు చేశాడు. 2007లో దర్బన్‌లో యువరాజ్ ఆస్ట్రేలియా బౌలింగ్‌ను చిత్తుచేసినట్లుగానే, ఈసారి కూడా అదే మజాను అభిమానులు ఆస్వాదించారు.



# సెకండ్ హ్యాండ్ స్మార్ట్‌ఫోన్..

# ఈ ప్రీమియం ఫోన్లు చాలా చౌక ధరలకు..





మీరు మంచి, అధిక నాణ్యత గల స్మార్ట్‌ఫోన్‌ను కొనాలనుకుంటున్నారు. కానీ బడ్జెట్ లేకపోవడం వల్ల మీరు దానిని కొనలేరు. దీంతో మీరు సెకండ్ హ్యాండ్ స్మార్ట్‌ఫోన్‌ను కూడా కొనుగోలు చేయవచ్చు. మీరు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో తక్కువ ధరల్లో మంచి ఫీచర్స్ ఉండే స్మార్ట్‌ఫోన్‌లను కనుగొనవచ్చు. స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసేటప్పుడు చాలా మందికి ఒకే ప్రశ్న ఉంటుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేయడం ప్రయోజనకరంగా ఉంటుందా లేదా హానికరంగా ఉంటుందా? ఆన్‌లైన్‌లో చౌకగా ఏ స్మార్ట్‌ఫోన్‌లు లభిస్తాయి అనే దాని గురించి తెలుసుకుందాం.

ఈ ఫోన్లు ఎలా ఉంటాయి?

ఈ స్మార్ట్‌ఫోన్‌లు కొత్తవి కావు. కానీ అవి ఉపయోగించలేనింత పాతవి కావు. కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసేటప్పుడు చాలా మంది ఆన్‌లైన్ ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లను సద్వినియోగం చేసుకుంటారు. చాలా మందికి తరచుగా ఫోన్లు మార్చే అలవాటు ఉంటుంది. మార్కెట్లో కొత్త ఫోన్ రాగానే, ఈ వ్యక్తులు రెండు మూడు నెలలుగా వాడుతున్న ఫోన్‌ను అమ్మేసి కొత్తది తీసుకుంటారు. ఈ ఫోన్లు కొన్ని రోజులు లేదా నెలల పాటు చెల్లుబాటు అవుతాయి. ఎక్స్ఛేంజ్ ఆఫర్ల ద్వారా అమ్ముడవుతాయి. చాలా సార్లు ఈ ఫోన్‌లు ఒక సంవత్సరం కూడా ఉపయోగించి ఉండవు. చిన్న లోపాలు లేదా అసంతృప్తి కారణంగా వాటిని అప్‌డేట్ చేసి తిరిగి విక్రయిస్తారు. అప్పుడు తిరిగి ఇచ్చిన ఫోన్‌లోని కొన్ని చిన్న లోపాలను సరిచేస్తారు. దీని తరువాత ఈ ఫోన్లు సరికొత్తగా మారతాయి. ఈ స్మార్ట్‌ఫోన్‌లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తారు. ఈ ఫోన్ ధర ఇతర కొత్త ఫోన్ల కంటే చాలా తక్కువ. మీరు దీన్ని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు Amazon-Flipkart, Cashify లలో చూడవచ్చు.

ఒప్పో రెనో 10:

మీరు ఈ సిల్వర్ గ్రే కలర్ స్మార్ట్‌ఫోన్‌ను ఒప్పో నుండి కేవలం రూ.18,999కి కొనుగోలు చేయవచ్చు. అయితే ఈ స్మార్ట్‌ఫోన్ అసలు ధర రూ.38,999. కానీ ఈ ఫోన్ పునరుద్ధరించి తర్వాత దీన్ని తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చు. ఈ ఒప్పో బ్రాండ్ ఒక సంవత్సరం వారంటీని కూడా అందిస్తోంది. అమెజాన్ ప్లాట్‌ఫామ్‌లో అందించిన సమాచారం ప్రకారం ఈ ఫోన్ అన్ని విధులను పరీక్షించారు. ఒప్పో రెనో 10 స్మార్ట్‌ఫోన్ 8 జీబీ ర్యాదించిన సమాచారం ప్రకారం ఈ ఫోన్ అన్ని విధులను పరీక్షించారు. ఒప్పో రెనో 10 స్మార్ట్‌ఫోన్ 8 జీమ్ ం 256 జీబీ స్టోరేజ్ వేరియంట్‌లో వస్తుంది.

పోకో F4 5G:

మీరు 12 GB RAM, 256 GB స్టోరేజ్ వేరియంట్‌తో ఈ Poco స్మార్ట్‌ఫోన్‌ను రూ.14,999కి కొనుగోలు చేయవచ్చు. అలాగే, ఈ ఫోన్‌ను కొనుగోలు చేసేటప్పుడు క్రెడిట్ కార్డ్ ఉపయోగించి రూ.1,000 వరకు తగ్గింపు పొందవచ్చు.

# 2028 నాటికి 5.7 ట్రిలియన్ డాలర్లు జర్మనీని అధిగమించి ముందుకు మోర్గాన్ స్టాన్లీ అంచనా




న్యూఢిల్లీ: భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా 2028 నాటికి అవతరిస్తుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వ్యక్తం చేసింది. ప్రపంచంలోనే అత్యంత డిమాండ్ ఉన్న వినియోగ మార్కెట్‌గా భారత్ మారుతోందంటూ.. స్థూల

## మూడేళ్లలో మూడో అతిపెద్ద ఎకానమీ..

ఆర్థిఎక స్థిరత్వానికితోడు, మెరుగైన మౌలిక వసతులతో ప్రపంచ ఉత్పాదకతలో భారత్ తన వాటా పెంచుకోనున్నట్టు తెలిపింది. 2023 నాటికి 3.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. 2026 నాటికి 4.7 ట్రిలియన్ డాలర్లకు విస్తరించడం ద్వారా యూఎస్, చైనా, జర్మనీ తర్వాత నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అంచనా వేసింది. 2028లో 5.7 ట్రిలియన్ డాలర్లతో జర్మనీని అధిగమించి భారత్ మూడో స్థానానికి చేరుతుందని పేర్కొంది. 1990లో ప్రపంచంలో 12వ స్థానంలో భారత్ ఉన్నట్టు తన నివేదికలో గుర్తు చేసింది. ఆ తర్వాత 2000 నాటికి 13వ స్థానానికి దిగిపోయిందని..తిరిగి 2020లో 9వ ర్యాంక్‌నకు, 2023లో 5వ స్థానానికి మెరుగుపడినట్టు వివరించింది. ప్రపంచ జీడీపీలో 3.5 శాతంగా ఉన్న భారత్ వాటా 2029 నాటికి 4.5 శాతానికి చేరుతుందని తెలిపింది.

2035 నాటికి 10.3 ట్రిలియన్ డాలర్లు..

భారత ఆర్థిక ప్రగతి విషయమై మోర్గాన్ స్టాన్లీ మూడు రకాల అంచనాలు వేసింది. "బేర్ కేసులో (ప్రతికూల పరిస్థితుల్లో) భారత ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి ఉన్న 3.65 ట్రిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2035 నాటికి 6.6 ట్రిలియన్ డాలర్లకు విస్తరించొచ్చు. బేస్ కేసులో (తటస్థ పరిస్థితుల్లో) 8.8 ట్రిలియన్ డాలర్లకు.. బుల్ కేసులో (సానుకూల పరిస్థితుల్లో) 10.3 ట్రిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుంది"అని తెలిపింది.

2025లో తలసరి ఆదాయం 2,514 డాలర్లుగా ఉంటే బేర్ కేసులో 4,247 డాలర్లకు, బేస్ కేసులో 5,683 డాలర్లకు, బుల్ కేసులో 6,706 డాలర్లకు వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. "అంతర్జాతీయ ఉత్పాదకతలో భారత్ వచ్చే దశాబ్ద కాలంలో తన వాటాను పెంచుకుంటుంది. జనాభాలో వృద్ధి, స్థిరమైన ప్రజాస్వామ్యం, విధానపరమైన మద్దతుతో స్థూల ఆర్థిక స్థిరత్వం, మెరుగైన మౌలిక వసతులు, పెరుగుతున్న వ్యాపార వర్గం, సామాజిక పరిస్థితుల్లో మెరుగుదల అనుకూలించనున్నాయి"అని మోర్గాన్ స్టాన్లీ నివేదిక తెలిపింది.


అతిపెద్ద వినియోగ మార్కెట్

ప్రపంచంలో టాప్ వినియోగ మార్కెట్‌గా భారత్ అవతరించనుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా. ఇంధన పరివర్తనం దిశగా భారత్ అతిపెద్ద మార్పును చూడనుందని.. జీడీపీలో రుణ నిష్పత్తి పెరుగుతోందని, అదే సమయంలో జీడీపీలో తయారీ రంగం వాటా సైతం వృద్ధి చెందుతోందని పేర్కొంది.

ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోంది..

ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోందని మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. "ఇటీవలి వారాల్లో అధిక ఫ్రీక్వెన్సీ సంకేతాలు మిశ్రమంగా ఉన్నాయి. కానీ, కొన్ని నెలల క్రితంతో పోల్చి చూస్తే మెరుగ్గా ఉన్నాయి. ద్రవ్య, పరపతి విధాన మద్దతుకుతోడు, సేవల ఎగుమతులు పుంజుకోవడంతో 2024 ద్వితీయార్ధంలో మందగమనం నుంచి వృద్ధి కోలుకుంటుందని భావిస్తున్నాం"అని పేర్కొంది. 2024-25లో జీడీపీ 6.3 శాతం మేర, 2025-26లో 6.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది.రానున్న రోజుల్లో వినియోగం అన్ని విభాగాల్లోనూ కోలుకోవచ్చంటూ.. ఆదాయ పన్ను తగ్గింపు పట్టణ డిమాండ్‌కు ప్రేరణనిస్తుందని, గ్రామీణ వినియోగానికి మద్దతుగా నిలుస్తుందని పేర్కొంది. 2024-25లో ద్రవ్యోల్బణం 4.9 శాతంగా, 2025-26లో 4.3 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. సేవల ఎగుమతుల్లో ఉన్న వృద్ధి వస్తు ఎగుమతుల్లో ఉన్న బలహీనతను కొంత వరకు భర్తీ చేస్తుందని తెలిపింది. అంతర్జాతీయంగా మందగమనం లేదా సమీప కాలంలో మాంద్యం వంటి పరిస్థితులు తలెత్తితే అవి తమ అంచనాలకు సవాలు కాగలవని.. అలాంటి పరిస్థితుల్లో 2025లో భారత ఈక్విటీలు గరిష్ట స్థాయిలకు దూరంగా ఉండొచ్చని పేర్కొంది.

# ఈ 8 ఆహారాలు గుండెకు రక్షణ.. ఇది ఆరోగ్య నిపుణులు సూచన..!




: మన జీవనశైలి బాగుంటేనే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రెగ్యులర్ ఎక్సర్‌సైజ్‌తోపాటు డైట్ కూడా కీలకం. అయితే కొన్ని ఆహారాలు గుండెకు రక్షణ కవచంలా నిత్యం కాపాడుతాయట. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ ఆహారాలు ప్రధానంగా మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించేస్తాయి. దీంతో హార్ట్ అటాక్ సమస్య రాదు. అంతేకాదు వీటిలో ఖనిజాలు పుష్కలం ఇది మీ గుండెను బలంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్..

ఇది మన డైట్‌లో కచ్చితంగా ఉండాల్సిందే. ప్రధానంగా ఎక్స్ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమై కొవ్వులు ఉంటాయి. ఇది మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించేస్తుంది.దీంత కార్డియో ఆరోగ్యం బాగుంటుంది. గుండె సమస్యలు మీ దరిచేరకుండా ఉంటాయి.

అవకాడో..


అవకాడోలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. అంతేకాదు అవకాడోలో పొటాషియం ఉంటుంది. ఇది కూడా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంద. రక్తపోటను నియంత్రణలో ఉంచుతుంది. తద్వారా గుండె పోటు సమస్య కూడా తక్కువగా ఉంటాయి. అవకాడో మన శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం పెంచుతాయి.

డార్క్ చాకొలేట్..

ఇందులో ఫ్లేవనాయిడ్స్ పుష్కలం. కోకోవా శాతం అధికంగా ఉండే డార్క్ చాకొలేట్‌లు మాత్రమే తినండి. ఇది గుండె ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం. అంతేకాదు రక్తసరఫరాను సైతం మెరుగు చేస్తుంది. డార్క్ చాకొలేట్స్ రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.

వెల్లుల్లి..

వెల్లుల్లిలో అల్లిసిన్ ఉంటుంది. గత వందల ఏళ్లుగా దీన్ని




వినియోగిస్తారు. ఇందులో ఔషధ గుణాలు ఉంటాయి. వెల్లుల్లి కూడా రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. ఇది రక్తసరఫరాను పెంచి గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

ఆకుకూరలు..

ఆకుకూరల్లో విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. వీటిని తరచూ తినాలని ఆరోగ్య నిపుణులు కూడా సూచిస్తారు. ప్రధానంగా పాలకూర, కాలే వంటి ఆకుకూరలు తినాలి. ఇవి బీపీని కూడా తగ్గిస్తాయి. అంతేకాదు గుండె పోటు ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

బెర్రీ పండ్లు..

బెర్రీ జాతికి చెందిన పండ్లు తరచూ తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా బ్లూబెర్రీ, స్ట్రాబెర్రీ, రాస్ప్బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది ఆక్సిడేటీవ్ స్ట్రెస్ తగ్గిస్తాయి. కార్డియో ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

సాల్మాన్..

సాధారణంగా ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. సాల్మాన్ చేప చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. వారంలో రెండుసార్లు ఈ చేప తినాలి. దీంతో మీ గుండె దృఢంగా మారి పనితీరు కూడా మెరుగు చేస్తుంది.


వాల్‌నట్స్..

ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. వాల్‌నట్స్‌లో ఉండే ఫైబర్ గుండె పనితీరును మెరుగు చేస్తుంది. ప్రతిరోజూ నానబెట్టిన వాల్‌నట్స్ తింటే రక్తంలో చెడు కొలెస్ట్రాల్ నిర్వహిస్తాయి.



# 'బాహుబలి: ది ఎపిక్'.. రిలీజ్ డేట్ అనౌన్స్ చేసిన రాజమౌళి

తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన సినిమా 'బాహుబలి'. ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎపిక్ యాక్షన్ మూవీ.. పాన్ ఇండియాకి సరికొత్త బాటలు వేసింది. ఒకే కథను రెండు భాగాలుగా బిగ్ స్క్రీన్ మీదకు తీసుకురావడం అనే న్యూ ట్రెండ్ కు నాంది పలికింది. బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లతో సంచలనం సృష్టించింది. అప్పటివరకూ ఉన్న రికార్డులను బ్రేక్ చేసి ఎన్నో కొత్త రికార్డులను క్రియేట్ చేసింది. తెలుగు సినిమా చరిత్రను మార్చిన బాహుబలి నేటితో పదేళ్లు పూర్తి చేసుకు ంది. ఈ నేపథ్యంలో రాజమౌళి ఓ ఇంట్రెస్టింగ్ అనౌన్స్ మెంట్ తో వచ్చారు. 'బాహుబలి' సినిమా 10 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్ఎస్ రాజమౌళి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "బాహుబలి.. ఎన్నో ప్రయాణాలకు నాంది.. లెక్కలేనన్ని మధుర జ్ఞాపకాలు.. అంతులేని ప్రేరణ.. ఈ సినిమా వచ్చి 10 సంవత్సరాలు అయింది. ఈ స్పెషల్ మైలురాయిని గుర్తుచేసుకుంటూ, రెండు భాగాలుగా అలరించిన ఈ చిత్రం ఇప్పుడు 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే పార్ట్‌గా రానుందని తెలియజేస్తున్నా.



ప్రపంచవ్యాప్తంగా 2025 అక్టోబర్ 31న తెలుగు హిందీ తమిళం మలయాళ భాషల్లో థియేటర్లలో రిలీజ్ కానుంది" అని రాజమౌళి ఎక్స్ లో పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఓ పోస్టర్ ను పంచుకున్నారు. ఐదున్నర గంటల కథంతా ఒకే భాగంలో..

'బాహుబలి' మూవీ రీ-రిలీజ్ గురించి చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. అక్టోబర్ లో ప్రభాస్ బర్త్ డే స్పెషల్ గా విడుదల చేస్తారని అందరూ భావించారు. అయితే రాజమౌళి రెండు భాగాలుగా కలిపి ఒకే సినిమాగా తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. 'బాహుబలి: ది ఎపిక్'గా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే ఎడిటింగ్ పనులు పూర్తి చేసారని టాక్. దీన్ని రీరిలీజ్ అని అనలేం. జక్కన్న చేస్తున్న ఒక కొత్త ప్రయోగం అని అనుకోవాలి. 'బాహుబలి: ది బిగినింగ్' రన్ టైమ్ 2 గంటల 38 నిమిషాలు ఉంటే.. 'బాహుబలి 2: ది కన్క్లూజన్' 2 గంటల 47 నిమిషాల నిడివితో వచ్చింది. దాదాపు ఐదున్నర గంటల లెన్త్ ని కుదించి ఇప్పుడు ఒకే సినిమాగా రిలీజ్ చేస్తున్నారు. ఇది బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

'బాహుబలి' అనేది పగ, ప్రతీకారం, ప్రేమ, త్యాగం, ద్రోహం, రాజకీయం వంటి అంశాలతో కూడిన ఒక ఎపిక్ గాథ. అమరేంద్ర బాహుబలి, భల్లాలదేవ మధ్య సింహాసనం కోసం జరిగే పోరాటం.. దేవసేన ప్రేమ కథ.. కట్టప్ప విశ్వాసం. . శివగామి రాజనీతి, బిజ్జల దేవుడి కుట్రలు కుతంత్రాలు వంటివి ప్రేక్షకులకు ఎమోషనల్ గా కనెక్ట్ అయ్యాయి. 'బాహుబలి: ది బిగినింగ్' తర్వాత "కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు?" అనే ప్రశ్న దేశవ్యాప్తంగా ఒక ఉత్సుకతను రేకెత్తించి, 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేసింది.'బాహుబలి' సిరీస్ కేవలం కథాబలంతోనే కాకుండా, దాని అద్భుతమైన సాంకేతిక విలువలత నూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. రాజమౌళి తన విజన్ ను తెరపై ఆవిష్కరించడానికి అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్‌ను ఉపయోగించారు. మహిష్మతి సామ్రాజ్యం, కుంతల రాజ్యం, జలపాతం, కాలకేయ యుద్ధం వంటివి సృష్టించారు. భారీ సెట్స్, యుద్ధ సన్నివేశాలు, వేల మందితో కూడిన సైనిక దళాలు, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ, ఆర్కా మీడియా అద్భుతమైన నిర్మాణ విలువలు, ఎంఎం కీరవాణి పాటలు ఈ సినిమాను ఒక విజువల్ వండర్ గా నిలిపాయి. బాహుబలి సినిమాలో మహేంద్ర బాహుబలి అమరేంద్ర బాహుబలి పాత్రల్లో ప్రభాస్ నటించారు. భల్లాలదేవగా రానా దగ్గుబాటి, దేవసేనగా అనుష్క శెట్టి, అవంతికగా తమన్నా భాటియా, శివగామిగా రమ్యకృష్ణ, కట్టప్పగా సత్యరాజ్, బిజ్జలదేవగా నాజర్ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్ పై శోభు యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మించారు.



# ఒక్క ఫోటోతో క్లారిటీ

విడాకుల ప్రచారంపై లేడీ సూపర్‌స్టార్ నయనతార క్లారిటీ ఇచ్చింది. ఇటీవల తన ఇన్‌స్టాలో పెట్టిన భావోద్వేగ పోస్టుతో ఈ విడాకుల వార్తలు ఊపందుకున్నా, దాన్ని వెంటనే డిలీట్ చేయడంతో ఊహాగానాలు మరింత పెరిగాయి. అయితే తాజాగా భర్త విఘ్నేష్‌పై పడుకున్న ఫోటోని షేర్ చేస్తూ "మా గురించి పిచ్చి వార్తలు రాస్తే మా రియాక్షన్ ఇదే" అని నయనతార పోస్ట్ చేయడంతో విడాకుల వార్తలకి చెక్ పడినట్లయింది. నయనతార ప్రస్తుతం తెలుగులో చిరంజీవి, అనిల్ రావిపూడి చిత్రంలో నటిస్తోంది. 40 ఏళ్ల వయసులోనూ వరుస చిత్రాలతో దూకుడు మీదుంది లేడీ సూపర్‌స్టార్ నయనతార . తెలుగులో ప్రస్తుతం చిరంజీవి-అనిల్ రావిపూడి చిత్రంలో నటిస్తోన్న నయనతార తమిళం, కన్నడ, మలయాళ చిత్రాలతో బిజీగా ఉంది. గతంలో ఎంతోమందితో ప్రేమాయణాలు నడిపిన నయన్.. ఆ తర్వాత విఘ్నేశ్ శివన్‌ని పెళ్లాడి సరోగసీ విధానంలో కవల పిల్లలకు జన్మనిచ్చింది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా భర్త, పిల్లలతో తరుచూ వెకేషన్స్‌కి వెళ్తూ ఎంజాయ్ చేస్తుంటుంది. అయితే ఇటీవల భర్త తీరుతో నయనతార విసిగిపోయిందని, వీరిద్దరు విడాకులు తీసుకోబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. నయనతార చేసిన పోస్ట్ దీనికంతటికీ కారణమైంది.


'తెలివి తక్కువ వ్యక్తిని పెళ్లి చేసుకున్నప్పుడు పెళ్లి అనేది పెద్ద మిస్టేక్. నీ భర్త చేసే పనులకు నువ్వు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పురుషులు సాధారణంగా మెచ్యూర్ కాదు. నన్ను ఒంటరిగా వదిలేయండి. నేను ఆల్రెడీ చాలా మీవల్ల ఫేస్ చేశా' నయనతార ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టింది. ఆ పోస్ట్ నిమిషాల్లో వైరల్ కాగా కాసేపటికే ఆమె డిలీట్ చేసేసింది. అప్పటికే స్క్రీన్ షాట్‌ల రూపంలో ఆ పోస్ట్ వైరల్ కాగా.. నయనతార, విఘ్నేష్ శివన్‌ల మధ్య విభేదాలు తలెత్తాయని, త్వరలోనే విడాకులు తీసుకోబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచా రం అంతటికీ ఒకే ఒక్క ఫోటోతో చెక్ పెట్టేసింది లేడీ సూపర్‌స్టార్. విఘ్నేష్ శివన్ నేలపై పడుకుని ఉండగా ఆయనపై ఎక్కి పడుకున్న ఫోటోని షేర్ చేసిన నయనతార.. 'మా గురించి కొన్ని పిచ్చి వార్తలు రాస్తున్నప్పుడు మా రియాక్షన్ ఇలాగే ఉంటుంది' అని రాసుకొచ్చింది.నయనతార చేసిన పోస్టుతో విడాకుల ప్రచారం అంతా ఫేక్ అని క్లారిటీ వచ్చేసింది. తాము ఎంతో అన్యోన్యంగా ఉన్నామని, ఎవరెన్ని ప్రచారాలు చేసినా కలిసే ఉంటామని స్పష్టత ఇచ్చింది.



# ఆ డబ్బింగ్ ఏంట్రా బాబూ..

తాజాగా రిలీజైన 'సార్ మేడమ్' టీజర్‌లో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్, యోగిబాబు పాత్రలకు తెలుగు డబ్బింగ్ అస్సలు సెట్ కాలేదంటూ నెటిజన్లు మండిపడుతున్నారు.

తమిళ స్టార్ విజయ్ సేతుపతి తెలుగు ప్రేక్షకులకి సుపరిచితమే అన్న సంగతి తెలిసిందే. సైరా, ఉప్పెన, మహారాజా చిత్రాలతో మనవారికి దగ్గరైన ఆయన ఇప్పుడు పూరీ జగన్నాథ్ డైరెక్షన్లో హీరోగా డైరెక్ట్ తెలుగు సినిమా చేస్తున్నారు. ఇందులో సంయుక్త హీరోయిన్‌గా కాగా సీనియర్ నటి టబు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇక మలయాళ బ్యూటీ నిత్యా మీనన్ గురించి ఎంత




చెప్పినా తక్కువే. 'అలా మొదలైంది'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ చిన్న హీరోలతో పాటు ఎన్టీఆర్, అల్లు అర్జున్, పవన్ కళ్యాణ్ వంటి పెద్ద హీరోలతోనూ నటించి మెప్పించింది. తాజాగా విజయ్ సేతుపతి, నిత్యామీనన్ తమిళంలో నటించిన సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. కోలీవుడ్‌లో పెద్ద బ్యానర్లలో ఒకటైన సత్యజ్యోతి ఫిలింస్ ఈ చిత్రాన్ని తెరెక్కిస్తుండగా పాండిరాజ్ దర్శకత్వం వహించారు. ఆయన గతంలో సూర్య, కార్తి, శివకార్తికేయన్ లాంటి స్టార్ హీరోల చిత్రాలను డైరెక్ట్ చేశారు. సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తోన్న 'సార్ మేడమ్' మూవీ ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే మేకర్స్ గురువారం టైటిల్ టీజర్ విడుదల చేశారు. ఇందులో విజయ్ సేతుపతి, నిత్యామీనన్ భార్యభర్తలుగా ఓ శుభకార్యం లో వంట చేస్తూ ఒకరినొకరు తిట్టుకుంటూ కనిపిస్తున్నారు. ట్రైలర్ చూడటానికి కాస్త డిఫరెండ్‌గానే కనిపిస్తున్నా ఓ విషయంలో మాత్రం తెలుగు ఆడియన్స్‌ని భయపెట్టేసింది. విజయ్ సేతుపతి, నిత్యా మీనన్, యోగిబాబు పాత్రలకు చెప్పిన తెలుగు డబ్బింగ్ అస్సలు సూట్ కాలేదు. విజయ్ సేతుపతికి తెలుగులో రమేష్, గోపీనాథ్ అనే ఆర్టిస్టులు డబ్బింగ్ చెబుతుంటారు. అయితే ఇందులో వాయిస్ మాత్రం డిఫరెం ట్‌గా ఉంది. ఇక బహుభాషా కోవిదురాలైన నిత్యామీనన్ అన్ని బాషల్లోనూ తనే డబ్బింగ్ చెప్పుకుంటుంది. ముఖ్యంగా తెలుగులో ఆమె వాయిస్ భలే ఉంటుంది. ఇప్పటివరక నటించిన అన్ని చిత్రాల్లోనూ తన పాత్రకి నిత్యానే డబ్బింగ్ చెప్పుకుంది. ఈ మూవీలో మాత్రం మరెవరితోనూ చెప్పించారు. ఆ వాయిస్ వింటుంటేనే కర్ణ కఠోరంగా ఉందని నెటిజన్లు అంటున్నారు. ఇక తమిళంలో స్టార్ కమెడియన్ అయిన యోగిబాబుకు తెలుగులో రాకేష్ రాచకొండ డబ్బింగ్ చెబుతుంటారు. ఆ డబ్బింగ్ చూసేవాళ్లకి అది నిజంగా యోగిబాబు వాయిస్ ఏమో అన్నంతగా సెట్ అవుతుంది. ఈ మూవీలో మాత్రం వేరే ఆర్టిస్టుతో చెప్పించడంతో యోగిబాబు వాయిస్ కూడా సెట్ కాలేదు.

# పుష్పరాజ్‌తో మరోసారి...

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, నేషనల్ క్రష్ రష్మిక మందన్నా మరోసారి జంటగా కనిపించే అవకాశం కనిపిస్తోంది. అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న భారీ బడ్జెట్ చిత్రంలో రష్మికను తీసుకునే అంశంపై పరిశ్రమ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి కథ వినిపించారని, రష్మిక గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఈ కాంబినేషన్ పక్కాగా కుదరనుందని సమాచారం. దీపికా పదుకొణె, మృణాల్ ఠాకూర్ పేర్లు ఇప్పటికే ఫిక్స్ అయినట్లు తెలుస్తుండగా, మూడో హీరోయిన్‌గా రష్మిక ఎంపిక కావడంపై క్లారిటీ రావాల్సి ఉంది.

సినీ ఇండస్ట్రీలో కొన్ని జంటలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. ఆ హీరో హీరోయిన్ కలిసి నటిస్తున్నారంటే ప్రేక్షకులు కూడా ఆసక్తి చూపిస్తుంటారు. టాలీవుడ్‌లో అలాంటి జంటల్లో ఒకటి అల్లు అర్జున్ , రష్మిక మందానా జోడీ ఒకటి. 'పుష్ప', 'పుష్ప 2'లో కలిసి నటించిన ఈ జోడీకి ప్రేక్షకులు నూటికి నూరు మార్కులు వేశారు. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, అతడి భార్య శ్రీవల్లిగా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ అదిరిపోయిందనే చెప్పాలి. ఈ సినిమాల్లో బన్నీకి పోటీగా నటించి తాను కూడా క్రెడిట్ కొట్టేసింది రష్మిక. అసలు శ్రీవల్లి క్యారెక్టర్లో ఆమెను తప్ప వేరొక నటిని కనీసం ఊహించుకునే సాహసం కూడా చేయలేదు ఆడియన్స్. సెంటిమెంట్, రొమాన్స్ సన్నివేశాల్లోనే కాదు సాంగ్స్‌లోనూ ఇద్దరూ పోటీపడి డ్యాన్స్ చేశారు.




బన్నీ, రష్మికని మరో సినిమాలో జోడీగా చూడాలని ఎదురుచూస్తున్న ప్రేక్షకుల కల నెరవేరేలా కనిపిస్తోంది. అట్లీ , అల్లు అర్జున్ కాంబినేషన్లో తెరకెక్కుతోన్న భారీ చిత్రంలో రష్మికను తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ మూవీలో ముగ్గురు హీరోయిన్లు ఉంటారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే అందరూ బాలీవుడ్ హీరోయిన్లనే తీసుకుంటున్నట్లు ప్రచారం జరిగినా మేకర్స్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే ఓ హీరోయిన్‌గా దీపికా పదుకొణెని ఫిక్స్ చేయగా.. మరో రోల్ కోసం మృణాల్ ఠాకూర్‌ని తీసుకోవడం దాదాపు ఫైనల్ అయినట్లు తెలుస్తోంది. మిగిలిన ఆ మూడో హీరోయిన్‌గా జాన్వీ కపూర్‌ని ఫైనల్ చేయనునారని వార్తలొచ్చినా క్లారిటీ లేదు. తాజాగా ఇప్పుడు రష్మిక పేరు వినిపిస్తోంది. రష్మికకు ఇప్పటికే కథ వినిపించారని, ఆమె గ్రీన్‌సిగ్నల్ ఇస్తే అల్లు అర్జున్‌తో మరోసారి జోడీ కట్టడం ఖాయమని అంటున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ సైన్స్ ఫిక్షనల్ మూవీలో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేయనున్నట్లు తెలుస్తోంది. అందులో ఒకటి యానిమేటెడ్ పాత్ర అని టాక్. సన్ పిక్చర్స్ సంస్థ సుమారు రూ.800 కోట్ల బడ్జెట్‌తో దీన్ని నిర్మిస్తుండగా.. అల్లు అర్జున్ సుమారు రూ.300 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో హాలీవుడ్‌కి చెందిన ఓ స్టార్ హీరో ప్రత్యేక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది.

పుష్ప, యానిమల్, పుష్ప 2, ఛావా చిత్రాలతో వరుస బ్లాక్‌బస్టర్లు అందుకున్న రష్మిక ఇటీవల 'కుబేర' చిత్రంతో మరో హిట్‌ని తన ఖాతాలో వేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో టాప్ హీరోయిన్‌గా కొనసాగుతోన్న రష్మిక వరుస సినిమాలను లైన్లో పెడుతూ దూసుకుపోతోంది.

# ఏ యుగంలో ఉన్నామో అర్థం కావడం లేదు

'జానకి' టైటిల్ విషయంలో సెన్సార్ బోర్డు వ్యవహారశైలి పట్ల మలయాళ దర్శకుడు, ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ జనరల్ సెక్రటరీ బి. ఉన్నికృష్ణన్ తీవ్రంగా స్పందించారు. లైంగిక దాడికి గురైన మహిళ పాత్రకు 'జానకి' అనే పేరు పెట్టకూడదని CBFC అభ్యంతరం చెప్పడాన్ని ఆయన ఖండించారు. "మనం ఏ యుగంలో బతుకుతున్నాం? ఇలాంటి వాదన చెబుతున్న CBFCకి సిగ్గులేదా?" అని ప్రశ్నించారు. న్యాయవాది ముస్లిం కావడం కూడా అభ్యంతరకరమని పేర్కొనడం శోచనీయమన్నారు. 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ '.. కొద్దిరోజులుగా దేశమంగా ఈ సినిమా గురించే మాట్లాడుతుకుంటోంది. కేంద్రమంత్రి సురేష్ గోపీ , అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సెన్సార బోర్డు సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించడం సంచలనంగా మారింది. ఇందులో అత్యాచార బాధితురాలికి జానకి అనే పేరు పెట్టడంపై సెన్సార్ బోర్డు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జానకి పేరు మార్చడంతో పాటు కొన్ని సీన్లు తొలగించాలని, లేదంటే సినిమా విడుదలకు అనుమతి ఇచ్చేది లేదని తెగేసి చెప్పడం వివాదానికి దారితీసింది. ఈ విషయమై నిర్మాతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు సెన్సార్ బోర్డు వ్యవహారశైలిని నిరసిస్తూ మలయాళ ఇండస్ట్రీ పెద్దలు కేరళలోని ఆ రాష్ట్ర కార్యాలయం ఎదుట ధర్నా కూడా నిర్వహించారు. అయితే చివరికి ఈ వ్యవహారంపై ముందు నుంచి పట్టుమీదున్న సెన్సార్ బోర్డు తాజాగా కాస్త వెనక్కి



తగ్గింది. ముందు చెప్పిన విధంగా 96 కట్స్ కాకుండా కేవలం రెండే మార్పులు చేస్తే చాలని సూచించింది. ఈ మేరకు సెన్సార్ బోర్డ్ తరఫు న్యాయవాది కేరళ హైకోర్టులో తన వాదనలు వినిపించారు. సినిమా టైటిల్ విషయంలో చిన్న మార్పు చేయమని కోరారు. ఈ వాదనలు విన్న న్యాయస్థానం దీనిపై ఓ నిర్ణయానికి వచ్చి తమకు తెలియజేయా లని చిత్ర దర్శక నిర్మాతలకు సూచించింది. ఈ విషయంలో కాస్త ఆలోచించి సరైన నిర్ణయమే తీసుకునే అవకాశాలున్నాయని మలయాళ ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.అయితే జానకి టైటిల్ విషయంలో Central Board of Film Certification వ్యవహరించిన తీరుపై మలయాళ చిత్ర దర్శకుడు, ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ జనరల్ సెక్రటరీ బి. ఉన్ని కృష్ణన్ తీవ్రంగా ఖండించారు. మనం ఏ కాలంలో బతుకుతు న్నాం? అని ప్రశ్నించారు. లైంగిక దాడికి గురైన మహిళకు జానకి అని పేరు పెట్టకూడదని CBFC సిగ్గు లేకుండా వాదిం చిందని.. జానకిని విచారణ చేసే న్యాయవాది కూడా వేరే మతా నికి చెందినవాడని ప్రస్తావించడం చూస్తుంటే మనం ఇంకా ఏ యుగంలో బతుకుతున్నామో అర్థం కావడం లేదన్నారు.

Printed by RATNA GRAPHICS, at H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Published by CHERUKU UPENDAR on behalf of CHERUKU UPENDAR ( HAMSA PUBLICATIONS ), Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana. *Editor : CHERUKU UPENDAR E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555